# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

మార్చి
2022

వెల: రూ.
25/-




SRI VENKATESWARA

# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 15 సంచిక: 3


సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు


ప్రధాన సంపాదకులు:
పుల్లగూర్ల సాయిరెడ్డి
(గోవిందదాసు)
గౌరవ సంపాదకులు:
డా|| పులిగడ్డ విజయలక్ష్మి
ఫొటోగ్రాఫర్:
పత్తి సుబ్రమణ్యం, శ్రీనివాస మంగాపురం
డి.టి.పి: సాయినాథ్
డిజైన్: రమేష్



**Email:** srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


## లోపలి పేజీల్లో


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| భక్తవశంకరుడు నారసింహుడు | 6 |
| శుభములను ప్రసాదించు శుభరాత్రి- మహాశివరాత్రి | 10 |
| బాలాజీ | 12 |
| కర్మ సిద్ధాంతాల మర్మం | 14 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 17 |
| భక్తవరేణ్యుడు మాణిక్య వాచకర్ | 23 |
| రామాయణ రత్నాకరం | 25 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 30 |
| శ్రీ వేంకటేశ సహస్ర నామావళి | 34 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవ వైభవం | 36 |
| అయిదు సన్నిధుల అంజుమూర్తి కోవెల | 39 |
| జరాసంధుడు | 42 |
| కొండలలో నెలకొన్న శ్రీవేంకటేశ్వరుడు | 44 |
| అనంత ఫలప్రదం లింగార్చన | 48 |
| మీ ప్రశ్న - మా సమాధానం | 51 |
| శ్రీ వేంకటేశ్వర అష్టో త్తర శతనామావళి | 52 |
| బ్రాహ్మీ ముహూర్త సమయంలో | 54 |
| ఒక భక్తుని అనుభూతి | 56 |
| మహాశివరాత్రి | 57 |
| శివపురం శివుడు | 60 |
| మన మహర్షులు | 61 |
| శ్రీ విష్ణు మహాపురాణం | 62 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞా నం | 66 |




# భగవంతునికి విశ్రాంతి

ఈ సృష్టి స్థితి లయ కారకుడైన శ్రీమన్నారాయణుడు ఈలోకంలో మానవులతో పాటు రకరకాల జీవరాసులను, వృక్షాదులను, పశు పక్ష్యాదులను మరెన్నింటినో సృష్టించాడు. కాని ఆయనకు అన్ని జీవరాశుల కంటే కూడా మానవులపై అమితమైన ప్రేమ కనబరుస్తున్నాడు. భూమిపైన పుట్టిన ప్రతి మనిషి ఉద్ధరింపబడాలని ఆరాటపడుతున్నాడు. అందులకై తాను ఎన్ని కష్టాలైనా అనుభవించటానికి సిద్ధపడి ఎన్నో అవతారాలను ఎత్తి మానవులు తరించడానికి కావలసిన జ్ఞానమును, భక్తిని లోకానికి అందించాడు. ఒక తరము నుండి మరొక తరానికి ఇట్టి జ్ఞానమును అందించుటకు వీలుగా పుస్తక రూపములో, గురుపరంపర విధానముతో పాటు రామాయణ, భారత, భాగవతాది గ్రంథములను అందించాడు. క్రిందటి యుగములో జరిగిన విషయాలను కథలుగా భావించకూడదని, అవి నిజమని తెలుపుటకు ప్రతి యుగములో ఏదో ఒక అవతారమును దాల్చి ఈలోక వాసులకు జ్ఞానబోధ చేయుచునే ఉన్నాడు. ఒక అవతారము తరువాత మరో అవతారము ఇలా కొన్ని వందల అవతారములను ఎత్తి మానవ జాతిని ఉద్ధరించుటకు ప్రయత్నించుచునే ఉన్నాడు. ఈనాడు శ్రీమన్నారాయణుడు శ్రీవేంకటేశ్వరుని అవతారములో తిరుమల కొండపై వెలసి మానవులను రక్షించుచున్నాడు. చెడును ఆశ్రయించినవాడు రావణాసురుడిగానో, కంసుడిగానో, దుర్యోధనుడిగానో నశించక తప్పదని చెప్పచునే ఉన్నాడు. మంచిగ జీవించమని, ధర్మాన్ని, భగవంతుణ్ణి సర్వదా ఆశ్రయించమని, అట్టివారిని తప్పక ఆదుకొందునని కొన్ని వేలసార్లు చెప్పినప్పటికీ మానవుడు కుక్కతోక వంకరన్న సామెతగా ఎప్పటికీ వంకరగానే వర్తించుచున్నాడు. సుఖం దొరికినప్పడు నేనే రాజునన్న భావంతో విర్రవీగుచున్నాడు. కష్టాల్లో కూడా శక్తి మేర ప్రాకులాడి చివరికి భగవంతుణ్ణి ఆశ్రయించుచున్నారు. అది కూడా తనకున్న కష్టాన్ని దూరం చేసి పూర్వపు సుఖాన్ని ప్రసాదించమనే కోరికతోనే భగవంతుణ్ణి ఆశ్రయించుచున్నారు. భగవంతుడు దయతలచి ఆ కష్టాన్ని దూరం చేసిన వెంటనే తిరిగి తనే రాజుననే భావంతో మైకంతో ప్రవర్తించుచున్నాడు. ఇది మానవుని యుగ యుగాల చరిత్ర. మనకు తల్లిగా, తండ్రిగా, గురువుగా సర్వం తానై ఉన్న ఆ శ్రీవేంకటేశ్వరుణ్ణి ఇంకా ఎంతకాలం శ్రమింపచేస్తాం? ఆయనకు విశ్రాంతిని ఎప్పడు ఇస్తాం? ఆయన అలసటను ఎప్పడు తీరుస్తాం? ఆయన అలసటను తీర్చవలసిన బాధ్యత మనందరిపైన ఉంది. ప్రతి ఒక్కరం ఆలోచించి తదనుగుణంగా ప్రవర్తించవలసిన తరుణమిది. మానవునిలోని అరిషడ్వర్గాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను అణచివేసి, భగవంతుని పైననే మనస్సు నిలిపి జీవించుటే పరమ ఔషధంగా భావించి జీవనం గడపవలసిన సమయమిది. హే ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! మీరు మా గురించి ఎన్నో కష్టాలను అనుభవించారు. ఇంకా అనుభవించుచునే ఉన్నారు. మా యొక్క శ్రేయస్సే అంతిమ లక్ష్యంగా కష్టపడుచున్నారు. కాని మీ గురించి ఆలోచించినప్పడు, స్మశాన వైరాగ్యము లాగా కొంతకాలమే మీ అభిమతము గుర్తుండి, తిరిగి యథాస్థితికి వచ్చి మా స్వలాభమే లక్ష్యంగా జీవించుచున్నాము. మీరు బోధించిన విషయాల పట్ల, లక్ష్యాల పట్ల ఎక్కువ కాలము మనస్సు నిలపలేక పోవుచున్నాము. మనస్సును కట్టడి చేయలేక పోవుచున్నాము. నేను, నాది అన్న భావనను వదిలించుకోలేకపోతున్నాము. దృతరాష్ట్రునికి మాకు తేడాలేదు. చివరికి క్షమించమని వేడుకుంటున్నాము. మేము తెలిసిన మూర్ఖులని పదే పదే తప్పలు చేసేవారమని అంగీకరించుచు మా అశక్తిని మీముందు అంగీకరించుచు మీరే మాకు దిక్కని, మమ్ములను రక్షించేవారని దృఢంగా నమ్ముచు, మీ శరణు వేడుచున్నాము. నమో వేంకటేశాయ!

నమో వేంకటేశాయ
వినా వేంకటేశం న నాథో న నాథః |
సదా వేంకటేశం స్మరామి స్మరామి||

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. Editor: Pullagurla Saireddy: Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 1 సం॥ | 250-00 |
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 3,000-00 |
| ☐ పోషకులు | 5,116-00 |
| ☐ రాజపోషకులు | 10,116-00 |

**9348212354**

నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.

లేదా

శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను

లేదా

**Srivenkatesham**

A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు ఏదేని పీఎన్బీ కాని, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:______________________
______________________
చిరునామా:______________________
______________________
______________________
______________________
______________________
పిన్‌కోడ్:______________________
చందా వివరాలు:______________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

**చందాదారులకు స్వామివారి పవిత్ర పాదాలు (10"x8") ఉచితం**




# శ్రీ వేంకటేశ్వర స్తుతి

## 35.లలిత (తివడ)

నరహరి! మొదలనే నోరు మాటల పుట్ట మౌనంబెట్టు సిద్ధించు
వీనులు గిరుల గుహలవంటివి యెవ్వరు మాటలాడినను ప్రతిధ్వనుల వలె నాదించుచుండు
నవి వినకుండనెట్లు వచ్చు
దేహంబుల నాఁకలి దినదినంబునుఁ బెడరెంచఁగా చెవులు గొనకెట్లుండవచ్చు
యందుల సకలంబునుఁ బ్రతిబింబించు చుండఁగా చూడకుండనెట్లు వచ్చు
ముక్కున నొక్కొక్క దినము యిరువది యొక్క వేయును నారు నూరు
మార్పులు గొలచి పోయవలసివుండఁగా వాసనలు గ్రోలకెట్లుండవచ్చు
నిన్నియును ననుభవించిననేమి నీవు రక్షకుండవై యుండఁగ
యేను నీకు గుఱి నీ పాదంబులు నాకు గుఱి నన్ను నీవెల్ల విధంబుల
రక్షింతువుగాక శ్రీవేంకటేశ్వరా!

తాత్పర్యం : నరసింహా! మొదటే నోరు మాటలకు జనన స్థానం. అది మాటాలడకుండా ఎలా ఉంటుంది? చెవులు – పర్వతాల గుహల వంటివి. ఎవరు మాటాడినా ప్రతిధ్వనులలాగా మోగుతుంటాయి. అవి – వినకుండా ఎలా ఉంటాయి? శరీరాలలో ఆకలి అనుదినం పురికొల్పుతుంటే చెవులు వినకుండా ఉంటాయా? ఇక – కళ్ళేమో ఆకారాలకు అద్దాలలాగా ఉన్నాయి. వాటిలో సర్వం ప్రతిబింబిస్తూ ఉంటుండగా అవి చూడకుండా ఎట్లుంటాయి? మఱి – ముక్కు, ఒక్క దినానికి ఇరవై యొక్క వేల ఆరువందల శ్వాసలను ప్రసరించవలసి ఉన్నప్పుడు – అది వాసనలను ఆఘ్రాణించకుండా ఎలా ఉంటుంది? శ్రీవేంకటేశ్వరా! ఇలా నోరూ, చెవులూ, కళ్ళూ, ముక్కూ – అన్నీ వాటి పనులను అవి నిర్వహిస్తుండగా, వాటిని అనుభవిస్తూనే ఉన్నా – నీవే నాకు రక్షకుడవు. నేను నీకు లక్ష్యాన్ని; నీ పాదాలు నాకు లక్ష్యం. సర్వకాల సర్వావస్థలలో ఇలాగే నన్ను కాపాడుతుండాలని ప్రార్థిస్తున్నాను స్వామీ!

పంచేంద్రియ విషయాలను తాను అనుభవిస్తున్నా, భగవంతుని పాదాలే లక్ష్యంగా జీవిస్తున్న తనను సదా రక్షించాలని వేడుకున్నాడు పెదతిరుమలాచార్యుడు శ్రీవేంకటేశ్వరస్వామిని.

వ్యాఖ్యానం: డా॥ తిరుమల శ్రీనివాసాచార్య



# ముక్తిమార్గము

భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య



## బౌళి

తందనాన ఆహి – తందనాన పురే
తందనాన భళా – తందనాన || పల్లవి ||

1. బ్రహ్మ మొకటే పర – బ్రహ్మ మొకటే పర
బ్రహ్మ మొకటే పర – బ్రహ్మ మొకటే || తంద ||


2. కందువగు హీనాధికము – లిందు లేవు
అందరికి శ్రీహరే – అంతరాత్మ
ఇందులో జంతుకుల – మింతా నొకటే
అందరికీ శ్రీహరే – అంతరాత్మ || తంద ||

3. నిండార రాజు నిద్రించు – నిద్రయు నొకటే
అండనే బంటునిద్ర – అదియు నొకటే
మెండైన బ్రాహ్మణుఁడు – మెట్టుభూమి యొకటే
చండాలుఁడుండేటి – పరిభూమి యొకటే|| తంద ||

4. అనుఁగు దేవతలకును – అల కామసుఖ మొకటే
ఘనకీట పశువులకు – కామసుఖ మొకటే,
దిన మహోరాత్రములు – తెగి ధనాఢ్యున కొకటే
వొనర నిరుపేదకును – వొక్కటే అనియు || తంద ||

5. కొరలి శిష్టాన్నములు – గొను నాఁక లొకటే
తిఱుగు దుష్టాన్నములు – తిను నాఁక లొకటే,
పరగు దుర్గంధముల – పై వాయు వొకటే
వరుసఁ బరిళముపై – వాయు వొకటే || తంద ||

6. కడగి యేనుగు మీద – గాయు యెండొకటే
పుడమి శునకము మీఁదఁ – బొలయు నెండొకటే,
కడుఁ బుణ్యులను పాప – కర్ములను సరిగావ
జడియు శ్రీ వేంకటే – శ్వరు నామ మొకటే || తంద ||



**భావము :** భిన్న భిన్న స్వరూప స్వభావములతో సదా పరిణామము చెందుచున్న ఈ విశ్వము నందు ఎట్టి మార్పు లేక శాశ్వతమైయున్నది బ్రహ్మ మొక్కటే. ముమ్మాటికీ సద్వస్తువైన ఆ పరబ్రహ్మ మొక్కటే ఉన్నది గాని వేఱెద్దియు లేదు.

అంతయు బ్రహ్మమయమైన ఈ సృష్టిలో తెగలు తెగలుగా విడదీసి చూపుటకనువైన హెచ్చు తక్కువ లెవ్వియు లేవు. అందరికినీ అంతరాత్మ శ్రీహరియే. అందుచే జగత్తులోని ప్రాణివర్గమెల్ల ఒకటే గాని భేదమేమియు లేదు. జంతు జాలము లన్నింటికి శ్రీహరి యొక్కడే అంతరాత్మగా నున్నాడు.

ఒక భూపాలుడు హంసతూలికా తల్పముపై నిద్రించును. ఆ చెంతనే అతని భటుడు కటిక నేలపై నిద్రించును. శయనములలో భేదమున్నను వారిరువురు నిండుగా నిద్రించు నిద్రలో మాత్ర మెట్టి వ్యత్యాసము లేదు.

వేదశాస్త్ర పారంగతుడైన విప్రు డొకడు, చెప్పులు కుట్టి జీవించు చండాలుడింకొకడు. విద్యావృత్తులయందు వారిరువురికి వ్యత్యాసమున్నను నిలుచుటకు ఆధారమైన నేల మాత్రమొక్కటే. అన్యోన్యానురాగము గల దేవతా దంపతులు కామసుఖ మనుభవించు చున్నారు. కీటకములు, పశువులు కూడ ఆ సుఖము ననుభవించుచునే యున్నవి. ఈ యిరుతెగల ప్రాణుల జన్మములలో తేడా యున్నను వారనుభవించు కామ సుఖములో మాత్ర మెట్టి తేడా లేదు. ఒకడు అష్టైశ్వర్య సంపన్నుడైన ధనికుడు. మరొకడు కూటికి లేని నిరుపేద. కాని ఈ ఇరువురికిని రేపవళ్ళ పరివర్తనము, పరిణామము ఒకే తీరుగా నున్నవి.

గౌరవ సంపన్నుడైన ఒకడు షడ్రసోపేతములైన శిష్టాన్నములు తృప్తిగా దిను చున్నాడు. దీనుడైన మరొకడు ఎవరి ఎంగిలి మెతుకులకో కాచుకొని ఆ ఉచ్ఛిష్టముతో పొట్టపోసుకొనుచున్నాడు. ఈ ఇరువురికిని ఆకలిలో మాత్ర మెట్టి తేడా లేదు.

ఒకచో దుర్గంధ భూయిష్టములైన పదార్థము లున్నవి. మరొకచో సుగంధ భరిత వస్తువులు కలవు. ఈ రెండు విధములైన వస్తువులపై వీచు గాలిలో మాత్రమెట్టి భేదము లేదు.

జంతుకోటిలో పెద్దదైన ఏనుగు మీదను, నీచమైన కుక్కపైనను ప్రసరించు సూర్యుని వెలుగులో ఎట్టి వ్యత్యాసము లేదు. అట్టి అటు పుణ్యాత్ములను, ఇటు పాపకర్ములను సమానముగా సంరక్షించుటకు సమర్థమైన శ్రీవేంకటేశ్వరుని నామము గూడ ఒక్కటే గాని దానికి సాటి రాగలది వేరొకటి లేనేలేదు.



# భక్తవశంకరుడు నారసింహుడు

- చింతలపాటి శివశంకర శాస్త్రి

శ్లో॥ "శ్రీమత్పయోనిధి నికేతన చక్రపాణే
భోగీంద్ర భోగ మణిరంజిత పుణ్యమూర్తే
యోగీశ శాశ్వత శరణ్య భవాబ్ధి పోత
లక్ష్మీ నృసింహ మమ దేహి కరావలంబం"

ఫల్గుణీ నక్షత్రముతో కూడి, పున్నమి గల మాసాన్ని ఫాల్గుణ మాసమని అంటారు. వినీలాకాశంలో శ్వేత వర్ణంతో దండాకారంగా ప్రకాశిస్తున్న రెండు నక్షత్రాలతో కూడిన మండలమే ఫల్గుణీ నక్షత్రము. పూర్ణిమ రోజున ఈ నక్షత్రంతో చంద్రుడు ఉంటే ఏర్పడే మాసాన్ని ఫాల్గుణ మాసమని అంటారు. సూర్యుడు సాధారణంగా ఫాల్గుణ మాసంలోనే మీనరాశిలో ప్రవేశిస్తాడు. శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన మాసాల్లో ఈ మాసం ఒకటి. తెలుగు సంవత్సరాలలో చివరిది. కార్తీక, మాఘమాసాల వలెనే ప్రాతః కాలంలో స్నానం, వ్రతం, జపం మున్నగునవి ఈ మాసంలోనూ ఆచరిస్తారు. నియమ నిష్ఠలతో ఆచరించువారికి భగవత్ కృప మెండుగా లభిస్తాయని అంటారు. ఈ మాసంలో పరశురామ జయంతి, హోళి మొదలైన పండుగలు వస్తాయి.

"పరిత్రాణాయ సాధూనాం
వినాశాయచ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ
సంభవామి యుగేయుగే"

ధర్మానికి హాని జరిగినా, అధర్మం మితిమీరినా దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేయాల్సిన పరిస్థితులేర్పడినప్పుడల్లా ఈ భూమిపై అవతరిస్తూనేయుంటానని భగవద్గీతలో శ్రీకృష్ణుడు బోధించాడు. అలా అనేక రూపాల్లో అవతరించినా, వాటిలో దశావతారాలు ప్రధానమైనవి. దుష్టశిక్షణ కోసం భగవంతుడు దాల్చిన అవతారాలలో నాలుగవ అవతారం నృసింహావతారం.

శ్రీ నృసింహ అవతార వైభవాన్ని తెలియజేసే వృత్తాంతాలు అనేక పురాణాల్లో ఉన్నాయి. అత్యంత మహిమాన్వితమైన శ్రీ నృసింహ అవతారం కృత యుగానికి

సంబంధించినది. అన్ని యుగములలో అన్ని అవతారములలో అంతర్లీనంగా ఉండి, ఆయా అవతారముల ప్రయోజనమును సిద్ధింపచేసినది శ్రీ నృసింహ అవతారం. భక్తుల రక్షణార్థమై అవతరించిన అవతారం నృసింహావతారం. స్కాంద, బ్రహ్మాండ పురాణములలో నృసింహ అవతార వైభవం వర్ణించబడింది.

''ఉత్సవం'' అంటే అపరిమితమైన ఆనందం అని, దాని కల్పతరువులు భక్తకోటికి అందించి, ఆనందింపజేయు వేడుక అని అర్థము. ఫాల్గుణ శుద్ధ విదియ మొదలు ద్వాదశి వరకు ప్రతి సంవత్సరం శ్రీవారి బ్రహ్మోత్సవములు అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. సుప్రభాత సేవ నుండి ప్రతిరోజు ఏకాంతసేవ వరకు శ్రీపాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి నిర్వహిస్తుంటారు. అటువంటి ఉత్సవాలలో కళ్యాణోత్సవం, బ్రహ్మోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి మహోత్సవ వేడుకలు అలనాడు బ్రహ్మాది దేవతలు నిర్వహించారు. నాటినుండి, నేటివరకు దేవతల కాలమానమును అనుసరించి కళ్యాణ మహోత్సవమును నిర్వహిస్తున్నారు. శ్రీరాముని సోదరి శాంత. ఋష్యశృంగుని భార్య. వారి కుమారుడు యాద ఋషి. నృసింహోపాసకుడైన యాదర్షి ప్రత్యక్షంగా దర్శించుకోవాలని తపస్సు చేసుకొని ఆ తపః ప్రభావం చేత ప్రసన్నుడైన శ్రీ నరసింహ స్వామివారు ప్రత్యక్షమై స్వయంభువుగా వెలసిన క్షేత్రము యాదాద్రి పంచ నారసింహ క్షేత్రంగా భక్తుల పాలిట కల్పతరువై యాదగిరి క్షేత్రం. అత్యంత మహిమాన్వితమై భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నది. ఇక్కడ నరసింహస్వామి యోగానంద, జ్వాల, లక్ష్మీనరసింహ రూపాలతో గుహలో కొలువు తీరాడు. స్వామివార్లకు జరిగే బ్రహ్మోత్సవాలను, కళ్యాణోత్సవాలను దర్శించేందుకు వెయ్యి కన్నులైనా చాలవు. ఈ ఉత్సవాలలో పరిణయోత్సవాలను వీక్షించినా, నారసింహుని దర్శించినా అనంతకోటి పుణ్యఫలం లభిస్తుందని ప్రతీతి. యాదాద్రి లక్ష్మీనరసింహుని కళ్యాణోత్సవం తరువాత నారసింహుని మాహాత్మ్యము, వైశిష్ట్యము గురించి తెలుసుకొనుట అత్యంత ఆవశ్యకము.

కుంఠము కానిది వైకుంఠము. ఆ వైకుంఠము నందు ద్వారపాలకులు జయ విజయులు. విష్ణు సేవాతత్పరులు. ఒకమారు సనక సనందనాద మునులు నారాయణుని దర్శనార్థమై వైకుంఠమునకు రాగా, నారాయణుని దర్శనానికి ఇది తగిన సమయము కాదని ద్వారపాలకులు వారిని అడ్డగించారు. అందుకు మునులు ఆగ్రహించి యుక్తాయుక్త జ్ఞాన మెరుంగక మమ్మల్ని అడ్డగించినందుకు మీరు విష్ణులోకానికి దూరమయ్యెదరని శపించారు. అప్పుడు జయ విజయులు శ్రీమహావిష్ణువును శరణు కోరగా, మహర్షుల శాపానికి తిరుగులేదని, శిక్ష (శాపము) అనుభవించక తప్పదని, మీరు నా భక్తులైనందున మీకు కొంత శాప విమోచన కలిగిస్తానని పలికి నా భక్తులుగా యుంటూ ఏడు జన్మలు కానీ, విరోధులుగా మెలగుచు మూడు జన్మలుగానీ భూలోకమున జన్మించిన పిమ్మట మరల వైకుంఠానికి వస్తారని ఉపశమనాన్ని ఇచ్చాడు. అందుకు వారు మీకు దూరంగా ఏడు జన్మలు ఉండలేమని, విరోధులుగా మూడు జన్మలు ఎత్తుతామని పలికారు.

మహర్షుల శాప ఫలితముగా కృతయుగములో హిరణ్యాక్ష, హిరణ్యకశిపులుగానూ, త్రేతాయుగంలో రావణ, కుంభకర్ణులుగానూ, ద్వాపరయుగంలో శిశుపాల దంతవక్త్రులుగానూ జన్మించారు. ప్రతి జన్మలోనూ విరోధులుగా శ్రీహరిని ఎదిరించి దూషించి, అనంతరం శాప విముక్తి పొందారు.

కశ్యప మహర్షి, దితి యందు హిరణ్యాక్ష హిరణ్యకశిపులనే మహావీరులు జన్మించారు. హిరణ్యాక్షుడు తపమాచరించి బ్రహ్మ చేత వరములను పొంది వరగర్వితుడై బ్రాహ్మణులను, ఋషులను, మునులను దేవతలను హింసిస్తూ, యుద్ధంలో ఓడిస్తూ అందరినీ భయకంపితులను గావించాడు. హిరణ్యాక్షుని బాధలను భరించలేక దేవతలు, మునులు శ్రీమహావిష్ణువును ప్రార్థించారు. వారి మొర ఆలకించిన శ్రీహరి వారికి అభయమొసగి దీవించాడు. భూదేవి హిరణ్యాక్షుని వలన తాను అనుభవించిన వేదనలను వివరించగా శ్రీహరి భూదేవిని ఓదార్చి వరాహావతారమెత్తి హిరణ్యాక్షునితో తలపడ్డాడు. అప్పుడు జరిగిన భీకర యుద్ధంలో హిరణ్యాక్షుడు శ్రీహరి చేతిలో మరణించాడు.


సోదరుని మరణానికి చింతించి, అందుకు కారణభూతుడైన శ్రీహరి మీద పగ పెంచుకొని, రాజ్యభారాన్ని మంత్రులకు అప్పగించి మందరగిరికి వెళ్ళి బ్రహ్మ గురించి ఘోరమైన తపమాచరించాడు. ఆతని తపస్సు ఉగ్రతకు లోకాలన్నీ కంపించాయి. బ్రహ్మ ప్రత్యక్షమై వరం కోరుకొమ్మన్నాడు. హిరణ్యకశిపుడు విధాతను చూచి భక్తితో నమస్కరించి తనకు గాలిలో కానీ, ఆకాశంలో గానీ, భూమిపైన కానీ, నీటిలో కానీ, అగ్నిలో కానీ, రాత్రి కానీ, పగలు కానీ దేవదానవ మనుష్యుల చేత కానీ, జంతువులచే కానీ, ఇంటా, బయట కానీ మరణముండరాదనీ వరాన్ని కోరాడు. అలాగే అని బ్రహ్మ వరాన్ని అనుగ్రహించాడు.

వరగర్వితుడైన హిరణ్యకశిపుడు లోకకంటకుడై అందరినీ

బాధించసాగాడు. మహాఋషులు నిత్య కర్మానుష్ఠానములను వదిలి వేయవలసి వచ్చింది. దేవతలను జయించాడు. ఇంద్ర సింహాసనాన్ని ఆక్రమించాడు. పంచభూతాలను నిర్బంధించాడు. సాధువులను హింసించసాగాడు. హిరణ్యకశిపుని బాధలకు తాళలేక దేవతలు, యక్షులు, కిన్నరులు, మునులు విష్ణుమూర్తితో మొర పెట్టుకున్నారు. మునులు, దేవతలు, యక్ష, కిన్నరుల మొరలను విన్న విష్ణువు లోకకంటకుడైన ఆ హిరణ్యకశిపుని వధించి శిష్టరక్షణను గావించెదనని వారికి అభయమిచ్చాడు.

జన్మలలో నరజన్మ ఉత్తమమైనది. జంతుజాలంలో మృగరాజైన సింహం శ్రేష్ఠమైనది. అందువలననే ఆ శ్రీహరి నరసింహ రూపాన్ని ధరించాడు. సగం మానవాకృతి మరో సగం సింహాకృతి. బ్రహ్మ వరానికి భంగం కలగకుండా ఉండటానికి నరసింహావతారాన్ని ధరించాడు.

సోదరుని మరణానికి చింతించి, అందుకు కారణభూతుడైన శ్రీహరిపై పగ పెంచుకొని తపస్సు చేసుకునే సమయములో దేవతలు అతని రాజ్యంపై దండెత్తి క్రూరంగా కొల్లగొట్టారు. ఇంద్రుడు రాక్షసరాజైన హిరణ్యకశిపుని భార్య లీలావతిని చెరబట్టగా, గర్భవతిని చెరబట్టడం శ్రేయస్కరం కాదని నారదుడు మందలించి, ఆమెను రక్షించి తన ఆశ్రమానికి తీసుకొని వెళ్ళి కాపాడాడు. ఆమె గర్భంలో ఉన్న శిశువుకు భాగవత తత్వబోధనను, శ్రీహరి వైభవాన్ని



బోధించాడు. నెలలు నిండిన తర్వాత లీలావతి ప్రసవించింది. అఖిల లోకానికి ప్రహ్లాదం బొనరించటం చేత బాలునకు ప్రహ్లాదుడను నామధేయాన్ని ఒనరించారు. ప్రహ్లాదం అనగా సంతోషాన్ని కలిగించేవాడు, పరిపూర్ణమైన ఆహ్లాదం కలవాడని, భక్తిభావ పరిమళాలు అణువణువు నందు కలిగినవాడు, అందరికీ పంచేవాడని అర్థం.

ప్రహ్లాదుడు జన్మతః పరమ భాగవతుడు. తనకు వలెనే, ఇతరులకూ సమానంగా మంచి జరగాలనే తలంపు కలవాడు. శుక్ల పక్ష చంద్రుని లాగా దినదినాభివృద్ధి చెందుతూ పరిఢవిల్లసాగాడు. పెద్దల పట్ల వినయ విధేయతలతో దరి చేరి నమస్కరించేవాడు. పరస్త్రీలను తల్లిలా చూచి గౌరవించేవాడు. కలలో సైతం అసత్యమాడేవాడు కాదు. అభిజాత్యం, ఆకృతి, ఐశ్వర్య విద్యా సంపదలుండి కూడా గర్వం లేనివాడు. ఇంద్రియ నిగ్రహం కలవాడు. ఈ లోకంలోని సద్గుణ సంపదనంతా రంగరించి నింపుకున్నవాడు. అందంతో పాటు సంస్కార శోభితుడు. కామక్రోధాదులు లేనివాడు. నిత్యం హరినామ స్మరణం తప్ప ఇతరం ఎరుగనివాడు. ఈ విషయాన్ని గమనించిన హిరణ్యకశిపుడు తమ కుల ఆచార వ్యవహారములను నేర్పించవలెనన్న ఉద్దేశముతో శుక్రాచార్యుల కుమారులైన చండా మార్కులకు అప్పగించాడు. వారి దగ్గర కూడా ప్రహ్లాదుడు శ్రీహరి కథలనే వల్లె వేస్తూ శ్రీహరి చరణారవింద భజన చేసేవాడు. కొన్నిరోజుల తర్వాత హిరణ్యకశిపుడు గురువుల వద్ద చదువుతున్న ప్రహ్లాదుని రప్పించి ఇంతవరకూ నేర్చుకున్న శాస్త్ర పాఠమొకటి చెప్పమని అడిగాడు.

తండ్రీ! గురువులు ఎంతగానో చదివించారు. వారి కృపా కటాక్షములతో సకల శాస్త్రములను చదివితిని. అంతేకాదు చదువులలో దాగి ఉన్న రహస్యాలను కూడా తెలుసుకొంటినని ప్రహ్లాదుడు చెప్పాడు. అందుకు ఆగ్రహించిన హిరణ్యకశిపుడు ఈ జ్ఞానం నీకెలా వచ్చిందని అడుగగా ఎప్పుడూ శ్రీహరిని ధ్యానించేవారికే సర్వమూ అవగతమవుతుందని, వేరొకరు చెప్పాలా అని పలికాడు. ఆ మాటలు విన్న హిరణ్యకశిపుడు క్రోధంతో పదే పదే శ్రీహరి శ్రీహరి అని పలుకుతున్నావు. ఆ శ్రీహరి ఎక్కడ? ఎక్కడుంటాడని పలుకగా త్రికాలాలలో, త్రిమూర్తులలో, త్రిజగాలలో, నీలో నాలో ఎక్కడ పడితే అక్కడ ఉన్నాడు. ఇందుగలడందు లేడని సందేహము లేదని, ఎందెందు వెదకినా అందందే కలడని పలికాడు. అయితే ఈ స్తంభము నందు జూపగలవా? ఆ చక్రిని అని ప్రశ్నించాడు. బ్రహ్మ నుండి గడ్డిపోచ వరకు అన్నింటిలో విశ్వాత్ముడై యున్నాడు. ఈ స్తంభము నందు ఎందుకుండడని

అన్నాడు ప్రహ్లాదుడు. అట్లాగా! సరే చూద్దామని గదతో స్తంభముపై కొట్టగి బ్రహ్మాండము బద్దలయినట్లు ఆ స్తంభము నుంచి జేగీయ మానంగా ఆవిర్భవించి భీకరంగా అరుస్తూ హిరణ్యకశిపుని ఒడిసిపట్టి తన ఒడిలో వేసుకొని వజ్రాల వంటి తన నఖములతో చీల్చి చెండాడాడు. రుధిరం పారబోశాడు. ప్రేవులను చీల్చి చెండాడు. దాంతో దేహం ఛిద్రమై, దేహి ఛిద్రమై ముక్తినొందాడు. హిరణ్యకశిపుని శరీరం నుండి జ్యోతి బయల్వెడలి, అందరూ చూస్తుండగా శ్రీహరిలో లీనమైపోయింది.

ఉగ్రమూర్తిగా దర్శనమిచ్చిన స్వామికి అంజలి ఘటించి, సాష్టాంగ నమస్కారం చేసి ప్రహ్లాదుడు వినమ్రతతో ప్రార్థించగా నారసింహస్వామి తన అభయ మంగళ దివ్య హస్తాన్ని ప్రహ్లాదుని తలపై ఉంచి దీవించాడు. ప్రహ్లాదుడు పరవశించి పలు విధాలుగా స్తుతించగా ప్రసన్నుడైన స్వామి వరాన్ని కోరుకొమ్మనగా ''స్వామీ! నా తండ్రి అజ్ఞానంతో చేసిన భగవతపరాధాన్ని మన్నించ''మని కోరాడు. అందుకు స్వామి ''నా స్పర్శతో నీ తండ్రి పునీతుడయ్యాడు. నీ తండ్రికి ఉత్తర క్రియలు చేసి ప్రభువువై రాజ్యాన్ని పరిపాలించి విజ్ఞుల ఉపదేశాన్ని పొందుతూ పాలన చేయ''మని ఆశీర్వదించాడు.

దేవకార్య నిర్వహణ గావించి శ్రీ నరసింహస్వామి వారిని ఆనాడు బ్రహ్మాది దేవతలు ఆకాశగంగతో అభిషేకం చేశారు. ఆ పవిత్ర పాదతీర్థం విష్ణుకుండమై, పవిత్ర దివ్యధారగా యాదాద్రిలో నేటికీ భక్తులను పునీతులను చేస్తోంది.

**''ఓం నమో నరసింహాయ వజ్ర దంష్ట్రాయ వజ్రిణే**
**వజ్రదేహాయ వజ్రాయ నమో వజ్ర నఖాయ చ**
**ఆ నాభేర్బ్ర బ్రహ్మణీరూపం అగళాద్వైష్ణవం వపుః**
**ఆశీర్షాద్రుద్ర మీశానాం తదగ్రే సర్వతశ్శివం''**

**(చతుర్ముఖ బ్రహ్మ చేసిన లక్ష్మీ నరసింహ స్తుతి)**

# చెమటలు పట్టే విగ్రహం...

శ్రీమహావిష్ణువు వాహనమైన గరుత్మంతుడు తమిళనాడులోని నాచ్చియార్ కోవెల్ అనే క్షేత్రంలో అదృశ్యరూపంలో సంచరిస్తూ వున్నాడని కొందరు యోగులు తెలియజేస్తూ వున్నారు. 108శ్రీ వైష్ణవ దేశాలలో ఒకటియైన 'తిరునరైయూర్' అనే క్షేత్రంలో ఈ గరుత్మంతునికి సంబంధించిన ఒక అద్భుతవిషయం ఉన్నది.

తమిళనాడులోని కుంభకోణం పట్టణానికి దగ్గరలో వున్న తిరునరైయూర్ అనే క్షేత్రంలో ఉత్సవమూర్తిగా వున్న గరుత్మంతుని విగ్రహం ఊరేగింపుసమయంలో వివిధ రకాల బరువులతో ఉండటం జరుతుంది. ఈ క్షేత్రానికి 'నాచ్చియార్ కోవెల్' అనే పేరుగూడా వున్నది. ఈ క్షేత్రంలో వెలసిన మహావిష్ణువుకి సంవత్సరానికి 2 సార్లు ఊరేగింపు ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవంలో అమ్మవారు హంసవాహనం మీద ఊరేగింపుగా వెళుతూ వుండగా స్వామివారు గరుడవాహనంమీద అమ్మవారి వెనక వెళుతూవుంటారు.

స్వామి వారు ఈ సమయంలో ఒక చిక్కు పరిస్థితిలో పడతారు, అదేమిటంటే గరుడవాహనం యొక్క వేగం హంసవాహనం కన్నా అధికం. తానెక్కిన గరుడ వాహనం వెళితే అమ్మవారు వెనక బడిపోతుంది.అది గ్రహించిన గరుత్మంతుడు స్వామితో ఇలా అంటాడు, నేను అమ్మవారు ఎక్కిన హంస వాహనంకన్నా ముందుకు వెళ్లను, తగిన వేగంతో వెళ్తూ హంసవాహనం వెనకాలే వెళతాను.

ఈ ఊరేగింపు లో ఒక విచిత్రం జరుగుతుంది. అదేమిటంటే స్వామివారు అంతర ప్రాకారంలో గరుడవాహనం ఎక్కినప్పుడు అది తేలికగావుండి కేవలం నలుగురు మనుషులు మోస్తే కదులుతుంది. అలా ముందుకు వచ్చిన గరుడవాహనం ఆ తరువాత ఉన్న 5ప్రాకారాలను దాటి దేవాలయ సింహద్వారం దగ్గరకు వచ్చేసరికి దాని బరువు జామితీయ పద్ధతిలో పెరుగుతుంది. 2 వ ప్రాకారాన్ని దాటుతున్న గరుడవాహనాన్ని 8మంది మోయాల్సుంటుంది.3వ ప్రకారం దాటేటప్పుడు 16మంది మోయాల్సుంటుంది.4వ ప్రకారాన్ని దాటేటప్పుడు 32 మంది మోయాల్సుంటుంది. 5వ ప్రాకారాన్ని దాటే ముందు 64 మంది మోయాల్సుంటుంది. 5ప్రాకారాలు దాటి వీధుల్లోకి వచ్చే సమయానికి గరుడవాహనం బరువు విపరీతంగా పెరిగిపోయి 120మంది మోయాల్సొస్తుంది. ప్రధానవీధుల్లోకొచ్చేసరికి 16మంది మోస్తున్న హంసవాహనం ముందు వెళుతూ వుండగా దాని వెనకాల 128 మంది మోస్తున్న స్వామివారి గరుడవాహనం నిదానంగా కదులుతూ వుంటుంది.

ఇంకొక విచిత్రం ఏంటంటే ఈ వూరేగింపు జరుగుతున్న సమయంలో గరుత్మంతుని ఉత్సవ విగ్రహంపైన చెమటలు కనిపిస్తాయి. గరుత్మంతుడు ప్రారంభంలో తక్కువ బరువు వుండి క్రమంగా పెంచుకుంటూ పోయేసరికి అతడికి చెమట పడుతుందని భక్తులు విశ్వసిస్తారు. తమిళనాడులో వున్న ఈ క్షేత్రంలోని ఈ గరుత్మంతుని 'కాలగారుడన్' అని పిలుస్తారు.

ఈ అద్భుత ఊరేగింపు దృశ్యం సంవత్సరానికి 2 సార్లు జరుగుతుంది.



పవిత్రభూమి కర్మభూమి అయిన భారతదేశములో ఏడాది పొడవునా పండుగలు వస్తూ ఉంటాయి. ఆ పండుగలన్నీ ఆధ్యాత్మికతతో కూడుకున్నవే. ఒక్కొక్క పండుగ ఒక్కొక్క దేవతకు సంబంధించినది అవడము వలన భక్తులు ఆయా పండుగలను శ్రద్ధా భక్తులతో జరుపుకుంటుంటారు. అటువంటి పండుగలలో శివరాత్రి మహిమాన్వితమైనది. ఈ పండుగ శివుడికి సంబంధించిన పండుగ.

## శుభములను ప్రసాదించు శుభరాత్రి

# మహాశివరాత్రి

- చిల్లర సీతారామారావు

పరమ దయాళువు, ఆదిమధ్యాంత రహితుడు, నిరాడంబరుడు, నిష్కళుడు, భోళాశంకరుడు, జ్ఞానమూర్తి, జగద్రక్షకుడు అయిన శివుడు లింగాకృతితో ఆవిర్భవించిన గాథ శివపురాణమునందు వర్ణించబడినది. బ్రహ్మ, విష్ణువు, శివుడు సృష్టి, స్థితి, లయ కారకులు. ఒకసారి బ్రహ్మ, విష్ణువులకు ఎవరు అధికులు అన్న విషయముపై తగాదా వచ్చింది. నేను అధికుడను అంటే నేను అధికుడను అని కలహించుకుంటున్నారు. బ్రహ్మ పాశుపతాన్ని, విష్ణువు మహేశ్వరాన్ని చేతబట్టుకున్నారు. దిశలన్నీ అస్త్రాల తేజస్సుకు జ్వలితమవసాగాయి. సృష్టిలో ప్రళయం సంభవిస్తుందేమోనన్న అనుమానము బయలుదేరింది. భయభీతులైన దేవతలు, మహర్షులు శివుడి సన్నిధికేగి ప్రార్థనలు చేశారు. వారికి అభయమిచ్చిన శివుడు బ్రహ్మ విష్ణువుల మధ్య జ్యోతిర్మయ స్తంభ (లింగ) రూపములో ప్రత్యక్షమయ్యాడు. పాశుపత, మహేశ్వర అస్త్రాలు రెండూ జ్యోతిర్మయ స్తంభములో (లింగము) లీనమయ్యాయి. అది గమనించిన బ్రహ్మ విష్ణువు లిరువురు ఆశ్చర్యపోయారు. ఈ స్తంభము యొక్క ఆద్యంతములు కనుగొన్నవారే అధికులు అన్న ఒక ఒప్పందానికి వచ్చారు. బ్రహ్మ పైభాగమునకు, విష్ణువు క్రింది భాగమునకు వెళ్ళి అన్వేషించసాగారు. ఇరువురూ ఆద్యంతములు కనుగొనలేక శివుడిని ప్రార్థించారు. దేవా! మీ మూలాలను కనుగొనలేకపోయాము. దయచేసి మీ నిజస్వరూపమును సాక్షాత్కరింపచేయండి అని వేడుకున్నారు. వారి ప్రార్థనలకు ప్రసన్నుడైన శివుడు వారితో ఇలా అన్నాడు. నా పరబ్రహ్మ తత్త్వాన్న నిరూపించడానికే నిరాకారము, నిర్గుణము, నిరుపమానము అయిన లింగాకృతి రూపములో మీకు దర్శనమిచ్చాను అని పలికి అదృశ్యమైనాడు.

శివుడు లింగరూపమున ఆవిర్భవించిన రోజు ఫాల్గుణ శుక్లపక్ష అర్ధరాత్రి. ఆ రాత్రిని శివరాత్రి యను పేరుతో పిలుచుకుంటారు. శివరాత్రి శివునికి అత్యంత ప్రీతికరమైన రాత్రి. ఆనాడు భక్తులు ఉపవాసముండి, రాత్రతంతా జాగారము చేసి భక్తి శ్రద్ధలతో శివుడిని పూజించుకుంటారు. ఉపవాసము, జాగరణము, పూజ ఈ మూడింటి కలయికను

శివరాత్రి వ్రతము అని అంటారు. ఈ వ్రతమును ఆచరించిన వారికి పునర్జన్మ అనునది ఉండదు. రాత్రికి నాలుగు జాములు ఉంటాయి. ఒక్కొక్క జామున ఒక్కొక్క పూజా పద్ధతి నిర్దేశింపబడింది.

**శ్లో ॥ ''దుగ్ధేన ప్రథమం స్నానం దధ్నా చైవ ద్వితీయకే**
**తృతీయేతు తథాఽజ్జయేవ చతుర్థే మధునా తథా''**

ప్రథమ జాములో దుగ్ధము, ద్వితీయ జాములో దధి, తృతీయ జాములో ఘృతము, చతుర్థ జాములో మధుతో పూజలు చేయాలి.

శివుడు అభిషేక ప్రియుడు. శివుడి ప్రీత్యర్థం శివరాత్రి నాడు శివాలయాలలో అభిషేకాలు చేస్తుంటారు. కొంతమంది భక్తులు తమ తమ గృహములందు అభిషేకాలు చేస్తుంటారు. అభిషేకాదుల వలన శివుడు సంతృప్తి చెంది కామ క్రోధ లోభ మద మాత్సర్యాది వికారముల నుండి ముక్తులను గావించి సుఖ సంతోషాదులను, ఐశ్వర్యాదులను ప్రసాదిస్తాడు. శివుడొక్కడు మాత్రమే నిష్కలత్వం చేత లింగము గాను, సకలత్వము చేత మూర్తిమంతముగాను ఆరాధించబడుతున్నాడు. శివుని మూర్తిత్వం కన్నా లింగారాధనే శ్రేష్ఠమైనది. నిత్యం షోడశోపచారాలతో సేవించేవారికి శివపదం తథ్యం.

మహాశివరాత్రిని జరుపుకోవడానికి, శివుడిని ఆరాధించడానికి అందరూ అర్హులే. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రాది సర్వులూ శివలింగాన్ని వారి వారి విధాల ననుసరించి పూజించుకోవాలి. పూజలు చేయడానికి స్త్రీలు కూడా అర్హులే. ఘుశ్మ అనే భక్తురాలు ఘుశ్మేశ్వర జ్యోతిర్లింగ ఆవిర్భావానికి కారణమైన మహాత్మురాలు. అక్కమహాదేవి మున్నగు భక్తులు చరిత్రలో ప్రసిద్ధికెక్కారు.

శివనామములోనే అత్యంత మాధుర్యమున్నది. శకార, ఇకార, వకారముల కలయికే శివ యను శబ్దము.

**శ్లో ॥ ''శం నిత్యం సుఖమానంద మకారః పురుషః స్మృతః**
**వకారః శక్తిరమృతం మేలనం శివ ఉచ్యతే''**

శకారమునకు అర్థము నిత్య సుఖము, ఆనందము. ఇకారమునకు అర్థము పరమ పురుషుడు. వకారమునకు అర్థము అమృత స్వరూప శక్తి. నిత్యము పరమానందమును కల్గించు సుఖమును, అమృత స్వరూపమైన దివ్యశక్తిని ప్రసాదించు పరమపురుషుడు శివుడు. శివనామమును ఉచ్చరించుట గొప్ప అదృష్టము. ఆ అదృష్టమే భక్తులు సమస్త దోషములను దూరము గావించుటకు సహాయకారి అవుతున్నది. శివశబ్దము కళ్యాణప్రదము. కళ్యాణ శబ్దము ముక్తివాచకము. కనుకనే భక్తజనులు ముక్తిప్రదాత అయిన ఆ భగవంతుడిని శివుడు అని భక్తిభావనతో పిలుచుకుంటున్నారు అని ఈ క్రింది శ్లోకము ద్వారా తెలియుచున్నది.

**శ్లో ॥ ''శివకళ్యాణ వచనం కళ్యాణం ముక్తివాచకమ్**
**యతస్తద్భవేత్తేన సశివః పరికీర్తితః''**

శివ యను రెండక్షరములను ఉచ్చరిస్తూ స్మరించిన వారికి స్వర్గము, మోక్షము తప్పక లభిస్తాయి. ఇందులో సందేహమునకు తావు లేదు అని స్కంద పురాణోక్తి. జనన మరణ రూప సంసార దుఃఖ విమోచనుడైన పరమశివుడొక్కడే నిత్యము ధ్యానింపదగినవాడు. కనుక శివానుగ్రహము కొరకు శివలీలలను స్మరించాలి. పురాణాలు చదవాలి. శివుడికి సంబంధించిన గాథలను వినాలి. ఉదయము, మధ్యాహ్నము, సాయంకాలము, రాత్రి సమయములందు శివాలయములకు వెళ్ళి శివదర్శనము చేసుకోవాలి.

శివరాత్రి మహిమను తెలియజేసే కథలు ఎన్నో పురాణములలో వర్ణించబడ్డాయి. బహుళ ప్రచారములో నున్న ఒక కథను సంక్షిప్తముగా తెలుసుకుందాం. ఒక వ్యాధుడు వేటకోసము వనమునకు వెళ్ళాడు. వేటాడి వేటాడి అలసిపోయి ఒక చెట్టు క్రింద విశ్రాంతి తీసుకుంటూ నిదురపోయాడు. నిదుర మేల్కొని చూచేసరికి చీకట్లు ముసురుకుంటున్నాయి. అప్పుడు మార్గమును కనిబెట్టి ఇంటికి చేరుకోవడము అసంభవము అని భావించాడు. చెట్టుక్రింద పడుకుంటే జంతువులకు ఆహారమవ్వడం ఖాయం. కనుక చెట్టుపైకి ఎక్కి ప్రాణాలు దక్కించుకోవడం ఉత్తమం అని భావించి చెట్టుపైకి ఎక్కాడు. ఎలాగోలా ఆ రాత్రిని గడిపేయాలనుకున్నాడు. అదృష్టవశాత్తు ఆ రోజు శివరాత్రి. అతడు ఎక్కిన చెట్టు అశ్వత్థము. ఆ చెట్టు మొదటలో ఒక శివలింగము ఉన్నది. వేటకోసమని వ్యాధుడు ఉదయమే బయలుదేరి వచ్చాడు. ఉదయము నుండి ఏమియూ తినలేదు. ఈ విధముగా అతనికి ఉపవాస ఫలితము దక్కింది. వసంతరాత్రి మంచు కురుస్తున్నది. మంచుబిందువులు ఆకుమీద పడి అక్కడ నుండి వ్యాధుని శరీరాన్ని తాకుతూ క్రింద ఉన్న శివలింగము మీద పడ్డాయి. దీనితో అభిషేకము జరిపినట్లయింది. తత్ఫలితముగా వ్యాధుడు ఎన్ని దుష్కృత్యములు గావించిననూ అంత్యకాలమున అతనికి శివలోక ప్రాప్తి కలిగింది. పాప భయాలను పోగొట్టడానికి శివరాత్రి వ్రతమును మించిన వ్రతము లేదు.

**శ్లో ॥ ''శివేతి చ శివం నామ యస్యవాచి ప్రవర్తతే**
**కోటి జన్మార్జితం పాపం తస్యం నశ్యతి నిశ్చితమ్''**

శివనామము మంగళప్రదము. మంగళప్రదము అగు శివనామమును సదా స్మరించువారి కోటి జన్మార్జిత పాపములన్నియూ నశించిపోవుట తథ్యము.



# బాలాజీ

- మందరపు వి.జి.శంకరాచారి

**సప్తగిరీశుడు భక్త హృదయ నివాసి. పిలిచిన పలికే దైవం. భక్తులు ఏ పేరున పిలిచినా పలుకుతాడు. అంతేకాదు... ఆ పేరునే తన సార్థక నామధేయంగా మార్చుకుంటాడు. అలా ఒక భక్తుడి నోటివెంట వచ్చిన 'బాలా' అన్న పదాన్ని బాలాజీగా మార్చుకున్న శ్రీవేంకటేశుడికి భక్తుడిపై గల ప్రేమతత్వాన్ని తెలియజేస్తూ శ్రీవేంకటేశ్వర మహాత్మ్యాలలో ఉటంకించబడినదే ఈ కథ.**

పూర్వకాలంలో ఆంధ్రప్రదేశ్ లో చిత్తూరు జిల్లాలో గల ఒక కుగ్రామంలో ఒక పేద బ్రాహ్మణుడు నివసించేవాడు. అతడికి వేంకటేశ్వరుడంటే అమితమైన ప్రీతి. నిరంతరం స్వామివారి నామజపంలో మునిగి తేలేవాడు.

తిరుమల వెళ్ళి స్వామివారి దర్శనం చేసుకోవాలన్నది అతడి కోరిక. అయితే తన దగ్గర తగినంత ధనము సమకూరడం లేదు. ఎప్పుడు కూడబెడదామన్నా ఏదో ఖర్చు వచ్చి దాచుకున్న డబ్బులు అయిపోయేవి. మరలా డబ్బులు దాయడం ప్రారంభించేవాడు. కొంతకాలమైన తర్వాత అవి కూడా ఇంటి ఖర్చులకు ఉపయోగించవలసి వచ్చేది. ఇలా ఎంతగా ప్రయత్నం చేసినా డబ్బులు సమకూరక పోవడం వల్ల అతడు నిరాశ చెందేవాడు. అయినా వేంకటేశుణ్ణి చూడాలన్న కోర్కెను మాత్రం విడువలేదు. ఈ కారణంగానే పేదబ్రాహ్మణుడు ఒకరోజు ఒక నిర్ణయానికి వచ్చాడు.

ఒక మంచి ముహూర్తంలో స్వామివారిని కనులారా వీక్షించాలని కాలినడకన తిరుమలకు బయలుదేరాడు. నడుచుకుంటూ బయలుదేరిన అతడికి ఎంతసేపటికీ గమ్యం కనబడలేదు. గోవింద నామ స్మరణ చేస్తూ ఒక చిట్టడవిలోనికి ప్రవేశించాడు. నడుస్తూ నడుస్తూ దారి తప్పాడు. ఇప్పుడు ఎటు వెళ్తున్నాడో అతడికి తెలియడం లేదు. మండుటెండలో నడక సాగిస్తున్న అతడి గొంతు ఎండిపోయింది. ఆ అరణ్యంలో నీరు ఎక్కడ దొరుకుతుందోనని వెతుకుతూ "శ్రీనివాసా! వేంకటరమణా! నిన్ను చూడాలని బయలుదేరానయ్యా! దారి తప్పాను. నా గొంతెండిపోతోంది. ఈ దాహంతో నా కళ్ళు తిరుగుతున్నాయి. నీ కొండకు రాగలనా? అన్న సంశయం కలుగుతోంది. నాకు సరైన దారి చూపి నీ దర్శన భాగ్యాన్ని కలుగజేయవయ్యా, ఈ భక్తుడి మొర ఆలకించవా" అంటూ గొంతెత్తి పిలుస్తూ వగరుస్తూ నడుస్తున్నాడు బ్రాహ్మణుడు.

"గోవిందా... గోవిందా అంటూ కొంతదూరం వెళ్ళాడో లేదో ఆ చిట్టడివిలో ఒక సుందరమైన యువతి బంగారు బిందెతో నీటిని పట్టుకుని "ఓ బ్రాహ్మణుడా నీ దాహం తీర్చడానికి మంచినీటిని తీసుకువచ్చాను. ఆకలిని పోగట్టడానికి పళ్ళు, తినుబండారాలు తీసుకుని వచ్చాను" అంటూ పేదబ్రాహ్మణుడి వద్దకు వచ్చింది.

దాహంతో సొమ్మసిల్లి కూర్చుండిపోయి ఉన్న అతడి దగ్గరకు వచ్చిన ఆ యువతి "ఏడుకొండల స్వామిని చూడటానికి వెళుతున్నావా! నీ కష్టాలను పోగొట్టే దేవుడు ఆయనే. ఈ నీటితో నీ దాహం తీర్చుకో" అంటూ అతడి మీద నీరుజల్లి బంగారు కలశంలోని నీటిని త్రాగమని పోసింది.

పేదబ్రాహ్మణుడు నీటిని తాగిన తర్వాత తన

వెంట తెచ్చుకున్న మధుర ఫలాల్ని ఇచ్చి మరికొని తినుబండారములను ఒక మూటలో కట్టి ''ఓయీ బ్రాహ్మణుడా నువ్వు తిరుమలకు వెళ్ళే దారి ఇది కాదు. దగ్గర దారి మరియొకటి కలదు. ఆ దారిలో గనుక నీవు వెళ్ళినచో సరాసరి మెట్లదారి కనిపిస్తుంది. ఈ దారిలో వెళ్ళి నీ స్వామిని దర్శించుకో. నీకు కావలసిన శక్తిని వరాల దేవుడే అనుగ్రహిస్తాడు. అడుగడుగునా నీకు తోడై ఉంటాడు'' అని సువర్ణ కలశాన్ని ఇస్తుంది.



అప్పుడా పేదబ్రాహ్మణుడు ఆమెతో ''బాలా! నీవెవరివో నాకు తెలియదు. అయినా సరే ఈ మహారణ్యంలో దప్పిక గొన్న నాకు దాహాన్ని తీర్చి ఆకలిని పోగొట్టడానికి తినుబండారములను ఇచ్చితివి. నీకేమిచ్చి నా ఋణం తీర్చుకోగలను'' అన్నాడు.

అందులకామె నవ్వుతూ ''ఓయీ! నేను కూడా శ్రీవేంకటేశ్వరస్వామి భక్తురాలనే. భక్తులెవరైనా కష్టాల్లో ఉంటే తనకు తోచిన సహాయం చేయడం మానవ ధర్మం. నేను స్వామివారిని దర్శించుకుని ఇంటికి వెళుతున్నాను. మార్గం మధ్యలో నీవు కనిపించావు. అందుకే నా చేతనైన సహాయం చేశా. అన్నట్లు చెప్పడం మరిచాను. 'బాలా' అంటూ నన్ను సంబోధించిన నీ మాట నాకెంతో ఆనందం కలిగించింది తెలుసా. ఇకనుండి నా కుటుంబంలోని వారంతా నన్ను 'బాలా' అని సంబోధించమని కోరతాను' అని కిలకిలమని నవ్వుతూ వెళ్ళిపోయింది.

పేదబ్రాహ్మణుడు బంగారు కలశమును, తినుబండారములను పట్టుకుని గోవింద నామస్మరణ చేసుకుంటూ తిరుమలకు చేరుకుని అక్కడ ధ్వజస్తంభం దగ్గర బంగారు కలశాన్ని ఉంచి స్వామివారిని ధ్యానిస్తున్నంతలో ఆలయ కార్యకర్తలు అక్కడకు వచ్చి ''ఇదుగో బంగారు కలశం. వీడే దొంగ'' అంటూ పేదబ్రాహ్మణుడిని కొడతారు.

అంతలో ఆలయ ధర్మకర్త అక్కడకు వచ్చి ఆ బ్రాహ్మణుడితో ''ఏయ్ బ్రాహ్మణుడా! స్వామివారి బంగారు కలశం నీ దగ్గరకు ఎలా వచ్చింది? ఎలా దొంగిలించినావు?'' అని అడిగాడు.

''లేదు నేను దొంగను కాను. స్వామివారి భక్తుణ్ణి. స్వామివారి దర్శనం కోసం మా గ్రామం నుండి నడుచుకుంటూ వస్తున్నాను. అలా వస్తున్నప్పుడు ఒక అరణ్యంలోకి ప్రవేశించి దారి తప్పాను. ఎండ వేడిమికి దాహానికి లోనయ్యాను. అప్పుడు ఒక యువతి ఈ బంగారు కలశంతో నీటిని తీసుకువచ్చి నా దాహాన్ని తీర్చింది. అంతేకాదు కొన్ని తినుబండారములను కూడా ఇచ్చి స్వామివారి చెంతకు రావడానికి సరైన మార్గాన్ని చూపించింది. ఆమె చూపిన మార్గములో ప్రయాణించి ఇక్కడకు చేరుకున్నాను. ఈ కలశాన్ని ఆమెయే నాకు ఇచ్చింది'' అంటూ జరిగిన విషయం చెప్పాడు.

పేదబ్రాహ్మణుడి మాటలనెవరూ నమ్మలేదు.

స్వామివారి బంగారు కలశాన్ని దొంగిలించినందుకు గాను ఆ స్వామి సన్నిధిలోని అతడిని కొరడా దెబ్బలతో శిక్షించాలని నిర్ణయించారు ఆలయ పెద్దలు.

ఆరోజు సాయంత్రం స్వామివారి సన్నిధిలో ధర్మకర్తల పర్యవేక్షణలో ఆ పేదబ్రాహ్మణుడికి కొరడాదెబ్బల శిక్ష విధించబోతుండగా గుడిలోని స్వామివారి నుండి మాటలు ఈవిధంగా వినిపించాయి.

''ధర్మకర్తలారా! మీరందరూ అనుకున్నట్లు ఇతడు దొంగ కాదు. నా భక్తుడు. నన్ను చూడవలెనని కాలి నడకన బయలుదేరాడు. దారి తప్పిన అతడికి యువతి రూపంలో కనబడి ఈ బంగారు కలశంలోని నీటిని పోసి దాహార్తిని తీర్చి తినుబండారములను, ఈ సువర్ణ కలశాన్ని ఇచ్చినాను. అప్పుడు నన్ను ఇతడు బాలా అని సంబోధించినాడు. ఆ మాట నాకెంతగానో నచ్చినది. నా భక్తుడి నోటివెంట వచ్చిన ఆ మాటనే ఇకముందు నా నామములలో ఒకటిగా వాడుకలోకి వస్తుంది. ఇకముందు నా భక్తులు నన్ను బాలాజీగా కూడా పిలువబోతారు''.

స్వామివారి మాటలు విన్న ధర్మకర్తలంతా అచ్చెరువొందుతారు.

పేదబ్రాహ్మణుడి కాళ్ళపైపడి క్షమాపణ కోరుతారు. సువర్ణ కలశాన్ని ఆ పేదబ్రాహ్మణుడు వారికి తిరిగి ఇచ్చివేస్తాడు. స్వామివారిని కీర్తిస్తూ ''తండ్రీ నా నోట పలికిన మాటను నీ పేరుగా మార్చుకున్నావా... భక్తుల పాలిట ఎంత పక్షపాతివయ్యా... నిన్ను మించిన దైవం ఎవరున్నారయ్యా ఈ ఇలలో'' అంటూ ఆనందంతో పరవశిస్తాడు.

రాజలాంఛనాలతో ఆ పేదబ్రాహ్మణుడికి స్వామివారి దర్శనాన్ని కల్గిస్తారు.

తదనంతర కాలంలో ఆ పేదబ్రాహ్మణుడు శ్రీవేంకటేశ్వరుని అనుగ్రహంతో ధనవంతుడై, ధర్మాన్ని పాటిస్తూ ముక్తిని పొందాడు.

# కర్మ సిద్ధాంతాల మర్మం

- డా|| కూర్మాచలం శంకరస్వామి

దేనికోసమో తెలియదు. ఎవరి కోసమో తెలియదు. ఎందుకోసమో తెలియదు కాని నేడు ప్రతివ్యక్తీ, ప్రతి సమాజము, ప్రతి దేశమూ సిద్ధాంతాల పేరిట రాద్ధాంతాలు చేస్తూ రక్తపుటేరులు ప్రవహింపచేస్తూ మనశ్శాంతిని కోల్పోతున్నారు. దీనికి ప్రధాన కారణం ఆయా సిద్ధాంతాల మర్మం అనగా మూలాలు తెలియకపోవడమే. ఉదాహరణకు కర్మ సిద్ధాంతాన్నే తీసుకుంటే నీ కర్మ ఇలా కాలిపోయింది అంటూ అవహేళన చేస్తూ పైశాచిక ఆనందం పొందుతారు. నిజమే. ఎవరి కర్మకు వారే బాధ్యులు. ఒకరి కర్మ ఫలం ఇంకొకరు స్వీకరించడానికి వీలు లేదు.

కర్మలు రెండు విధాలు. అకర్మకం, సకర్మకం. మంచి కార్యాలు చేస్తే మంచి ఫలితం వస్తుంది. చెడు కర్మలు చేస్తే అవి జన్మ జన్మల పర్యంతం మనిషిని పట్టి పీడిస్తాయన్నది భగవద్గీత బోధిస్తున్నది. కాబట్టి ఆ మర్మం తెలుసుకున్నప్పుడే మనిషిగా గుర్తించబడతాడు. మంచి మనిషిగా మనుగడ సాధించి, మానవత వెల్లివిరిసి మనశ్శాంతిని పొందగలరు. మూలాలు తెలుసుకున్నప్పుడే మోక్షమార్గము సుగమం అవుతుంది.

**"కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షర సముద్భవమ్**
**తస్మాత్ సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్"**
**– భగవద్గీత – అధ్యాయం 3 – శ్లో.15**

నియమిత కర్మలు వేదములందు నిర్దేశింపబడగా అట్టి వేదములు దేవదేవుని నుండి ప్రత్యక్షముగా ప్రకటింపబడినవి. అందుచే సర్వవ్యాపకమైన పరబ్రహ్మము యజ్ఞకర్మలందు నిత్యముగా ప్రతిష్ఠితమై ఉన్నది. కేవలం శ్రీకృష్ణుని ప్రీత్యర్థమే కర్మ నొనరించు అవసరము ఈ శ్లోకము నందు మరింత నొక్కి చెప్పబడింది. యజ్ఞ పురుషుడైన విష్ణువు ప్రీత్యర్థమే మనము కర్మ చేయవలెనన్నచో కర్మకు సంబంధించిన మార్గదర్శకత్వమును బ్రహ్మము నందే పొందవలెను. కనుకనే వేదములు కర్మ నొనరించుటకు మార్గదర్శకత్వమును బ్రహ్మమునందే పొందవలెను. కనుకనే వేదములు కర్మ నొనరించుటకు మార్గదర్శక సూత్రములై యున్నవి. వేద నిర్దేశము లేకుండా చేయబడిన కర్మము వికర్మముగా లేదా పాపకర్మగా తెలియబడును. కనుక కర్మ ఫలము నుండి రక్షింపబడుటకు ప్రతి యొక్కరు వేదములనుండి మార్గదర్శనమును పొందవలెను. సాధారణ జీవితమున మానవుడు దేశము యొక్క రాజ్యాంగ నిర్దేశము నందు పనిచేయు రీతి ప్రతి యొక్కరును భగవానుని నిర్దేశంలోనే కర్మనొనరించవలెను. వేదములందలి అట్టి నిర్దేశములు ప్రత్యక్షముగా అతని శ్వాస ద్వార ప్రకటితమై యున్నవి. "అస్య మహతో భూతస్య విశ్వసితమేతత్ యద్ ఋగ్వేదో యజుర్వేదః సామవేదోऽ థర్వాంగిరసః". ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణ వేదములనెడి నాలుగు వేదములు దేవదేవుని శ్వాసనుండి బహిర్గతమైనవి. భగవానుడు సర్వశక్తి సమన్వితుడు. కావున శ్వాస ద్వారా భాషించగలడు. ఇతరేంద్రియముల కార్యముల సైతము చేయగలిగిన శక్తి సామర్థ్యములను కలిగియున్నవాడు. వాస్తవమునకు అతడు ప్రకృతిని వీక్షించుట ద్వారానే జీవులను సృష్టించెనని తెలుపబడినది. బద్ధజీవులను ప్రకృతి గర్భమున సృజించిన పిమ్మట వారు ఏవిధముగా తనను చేరగలరో తెలుపుటకు అతడు వేదవిజ్ఞానము నందు నిర్దేశముల నొసగెను. భౌతిక ప్రకృతి యందున్న బద్ధజీవులు సదా భోగాభిలాషను కలిగియుందురని మనం తెలుసుకొనవలెను. కాని జీవుడు అట్టి వికృత కోరికలను సంతృప్తి పరచుకొని ఆ నామ మాత్ర భోగము ముగిసిన పిమ్మట ఎట్లు భగవద్ధామము చేరవచ్చునో తెలుపు రీతిగా వేద నిర్దేశములు సృష్టింపబడినవి. అనగా ఇది బద్ధ జీవులు ముక్తిని పొందుటకు కల్పించబడిన ఒక అవకాశము కనుక వారందరును దైవభక్తి నాయుతులు అగుట ద్వారా యజ్ఞ విధానమును అనుసరించవలెను. వేద శాసనములను అనుసరింపనివారు సైతము దైవభక్తి భావనా నియమములను స్వీకరింపవచ్చును. అట్టి కార్యము వైదిక యజ్ఞాచరణమే కాగలదు.

"కష్టించి పనిచేసి పిదప ఇంద్రియ భోగము ననుభవింపుము అని వేదోక్తి. ఏ కార్యము చేయకుండా ఏ ఫలితమూ సిద్ధింపదు. కనుక మానవులు సదా సత్కర్మలనే ఆచరించాలి. సక్రమ నియమాలను పాటించనివారు మిగుల నిరసింపబడినవారై ప్రమాదకర జీవితమును గడపవలసి వస్తుంది.

పకృతి నియమము ప్రకారము మానవ జన్మ యనునది కర్మయోగము లేదా జ్ఞానయోగము లేదా భక్తియోగ మనెడి ఏదియో ఒక మార్గము ద్వారా ఆత్మానుభూతిని పొందుట కొరకే ప్రత్యేకముగా ఉద్దేశింపబడినది. వాస్తవమునకు కర్మలు పలు రకాలు. దైవభక్తి భావన లేనివారు నిక్కముగా భోగభావన యందే నెలకొని యుందురు. కనుక అట్టివారు పుణ్యకర్మలను చేయవలసి ఉన్నది. భోగభావన కలిగినవారు భోగకర్మ ఫలితము నందు తగుల్కొనకుండా తమ కోరికలను సంతృప్తి పరచుకొనునట్లుగా యజ్ఞ విధానము ఏర్పాటు చేయబడినది. ఈ జగత్తు యొక్క పురోభివృద్ధి మన స్వీయ కృషిపై కాక దేవతలచే ప్రత్యక్షముగా నిర్వహింపబడెడి భగవానుని ప్రణాళికపై ఆధారపడి యుండును. కనుకనే వేదములందు తెలుపబడిన ప్రత్యేక దేవతల కొరకే యజ్ఞములు ప్రత్యేకముగా ఉద్దేశింపబడినవి. పరోక్షముగా దైవభక్తి భావనే అయి ఉన్నది. కనుక ప్రతి ఒక్కరు తమ పురోగతిని కేవలము నీతి సూత్రముల కొరకే పరిమితము చేసుకొనక వాటిని అధిగమించి దైవభక్తి భావన పొందవలసి యున్నది.

"కర్మణ్యే వాధికారస్తే మాఫలేషు కదాచన
మాకర్మఫల హేతూర్భూర్మాతే సఙ్గోస్త్వ కర్మణే"

విధ్యుక్త ధర్మములు నిర్వహించుట యందే నీకు అధికారము కలదు కానీ కర్మఫలము నందు కాదు. నీ కర్మఫలములకు నీవే కారణమని ఎన్నడూ భావింపకుము. అలాగే విధ్యుక్త ధర్మము వీడుట యందు ఆసక్తుడవు కాకుము అని స్వయముగా శ్రీకృష్ణభగవానుడే బోధించాడు కాబట్టి ఎవరి ధర్మాలను వారు తప్పక ఆచరించవలెను. విధ్యుక్త ధర్మములు, దుష్కర్మలు, అకర్మ అనుచు కర్మలు మూడు రకములు. మానవుని గుణముల ననుసరించి విధింపబడిన కర్మలే విధ్యుక్త ధర్మములు. ప్రామాణికమైన అనుమతి లేకుండగనే ఒనరింపబడినవి దుష్కర్మలు కాగా విధ్యుక్త ధర్మమును చేయకుండుట అకర్మ అని దాని భావము. అకర్మునిగా కారాదనియు మరియు ఫలాపేక్ష లేకుండా విధ్యుక్త ధర్మమును విధిగా నిర్వహించుమనియు ఇచ్చట శ్రీకృష్ణ భగవానుడు అర్జునునకు ఉపదేశించినాడు.

కర్మఫలములందు ఆసక్తిని కలిగి యుండెడివాడు అకర్మలకు సైతము కారణమగుటచే ఆ ఫలముల వలన సుఖి లేదా దుఃఖి యగుచున్నాడు. ఇక విధ్యుక్త ధర్మములకు సంబంధించినంత వరకు వాటిని నిత్యకర్మము, అత్యవసరమైన కర్మము, ఇష్టమైన కర్మలనెడు మూడు రకాలుగా విభజించవచ్చును. శాస్త్రానుసారముగా ఎటువంటి ఎటువంటి లాభాపేక్ష లేకుండా విధిగా నిర్వర్తించబడు నిత్యకర్మ సత్వగుణకర్మ అనబడును. ఫలితమును వాంఛించుచు చేయబడు కర్మ బంధమును కలిగించును కావున అది అమంగళ దాయకము. ప్రతి యొక్కరికిని వారి విధ్యుక్త ధర్మమునందు అధికారము కలదు. అట్టి ఫలాపేక్ష రహిత విధ్యుక్త ధర్మపాలనము మానవుని ముక్తిమార్గమునకు చేర్చగలదు. కావున ఫలమునందు ఆసక్తిని చూపకుండా విధిగా యుద్ధమును చేయుమని శ్రీకృష్ణుడు అర్జునునికి ఉపదేశించాడు. యుద్ధములో పాల్గొనకపోవుటయు ఒక విధముగా ఆసక్తి. అటువంటి ఆసక్తి ఎన్నడునూ మానవుని ముక్తిపథమునకు నడిపించదు. ఆసక్తి ఎటువంటిదైనను అది బంధమునకే కారణము కాగలదు. అకర్మ అనునది పాపమే. కనుక విధిగా యుద్ధము చేయుటచే అర్జునునికి శుభప్రదమైన మోక్షమార్గమై యున్నది.

పై శ్లోకాలలోని కర్మ సిద్ధాంత మర్మం, సూక్ష్మం చెప్పాలంటే జయాపజయాలు దైవాధీనాలు కాబట్టి మానవులు తమ విధ్యుక్త ధర్మాలు సక్రమంగా పాటించినప్పుడే సత్కర్మ ఫలితములు కలుగుతాయి. దుష్కర్మలు ఆచరించిన దుష్ఫలితాలు సంభవిస్తాయి. కాబట్టి మంచి పనులు మరువకుండా ఆచరించాలి. ముఖ్యంగా మనిషన్నవాడు పది ధర్మాలను సక్రమంగా ఆచరించాలి. 1. క్రోధమును విడనాడాలి 2. సహనం పాటించాలి 3. సఖ్యత పెంచుకోవాలి 4. సత్యం పలకాలి 5. సమయస్ఫూర్తిని ప్రదర్శించాలి 6. విద్యయందు ఆసక్తిని కలిగియుండాలి 7. ధనాన్ని సక్రమ మార్గంలో సంపాదించాలి 8. దానగుణం కలిగి ఉండాలి 9. తల్లితండ్రులు, గురువుల యెడల గౌరవ భావాన్ని కలిగి ఉండాలి 10. అన్నిటికన్నా అతి ముఖ్యమైనది దైవభక్తి కలిగి ఉండాలి. ఈ పది ధర్మాలను పాటించిన వారికి ఇహ పర సుఖాలు లభిస్తాయన్నది ఆర్యోక్తి. కాబట్టి మానవులు లాభాపేక్ష లేకుండా సత్కర్మలను ఆచరిస్తే సత్ఫలితాలు సమకూరుతాయన్నది అక్షర సత్యం.

"సత్కర్మలాచరిస్తే
సత్ఫలితాలొస్తాయి
దుష్కర్మలాచరిస్తే
దుష్ఫలితాలొస్తాయి
కర్మసిద్ధాంత మర్మమిది తమ్ముడా
మనిషికి ముక్తిమార్గ సోపానమిది తమ్ముడా
నిరంతరం తరం తరం
నిస్వార్థంగా, నిక్కచ్చిగా
నరుల సేవ చేసినవారికి
నారాయణుడు నీలో కొలువై ఉండును తమ్ముడా"

తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 20వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

## సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

## నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగి రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

## గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!


**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1,
హబ్సీగూడ, హైదరాబాద్ – 500007.
ఫోన్: 040– 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

- డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

(గత సంచిక తరువాయి)

## సుకన్యోపాఖ్యానము

''మహాత్మా! ఈరోజు ఏ మహోపాఖ్యానం చెప్పబోతున్నారో అని ఎదురు చూస్తున్నాము. ఒక్కొక్కరోజు ఒక్కొక్క మహనీయుని తపో మహిమను వింటూ తరిస్తున్నాము. మీరు చెబుతున్న గాథలు వింటుంటే ఎక్కడలేని పుణ్యం మమ్మల్ని పునీతుల్ని చేస్తోందా అనిపిస్తోంది. శ్రవణ కీర్తనాదులు భగవంతునికి సమీపస్థుల్ని చేస్తాయని అంటారు కదా! మీవంటి గురువు దొరకటం మా అదృష్టం'' అని శౌనకాదులు అనటంతో వారినందరినీ ప్రసన్న దృక్కులతో చూస్తూ ఉగ్రశ్రవసుడు చెప్పటం ప్రారంభించాడు.

''ఈరోజు సుకన్య అనే పతివ్రతామ తల్లి చరిత్ర గురించి చెబుతాను. చ్యవన మహర్షి ఇల్లాలైన సుకన్య శర్యాతి మహారాజు యొక్క పుత్రిక. పయోష్ణి అనే పుణ్యనదీ తీరంలో శర్యాతి యజ్ఞం చేసి దేవ సాయుజ్యాన్ని పొందటానికి చ్యవన మహర్షి కారకుడైనాడు. త్రేత, ద్వాపర సంధి కాలంలో పయోష్ణి తీరంలో యజ్ఞం చేయటం వల్ల విశేష పుణ్యాన్ని పొందాడు శర్యాతి. ఇక చ్యవనుడంటారా! తపో నియమంలో ఆయనను మెప్పించిన మహర్షి మరొకడు లేడేమో అనిపిస్తుంది.

''ఇక్కొలని సమీపంబున
పెక్కగు వేలేండ్లు తపము భృగు సుతుడు కరం
బక్కజముగ నొనరించెను
వెక్కస నియమమున నిరత వీరాసనుడై''
–174 ప – తృ.ఆ – అరణ్య పర్వము

''భృగు మహర్షి పుత్రుడైన చ్యవనుడు ఈ సరోవరం సమీపస్థలంలో అనేక వేల సంవత్సరాలు తపస్సు చేశాడు. ఆ తపస్సు ఎంత ఆశ్చర్యకరంగా ఉన్నదంటే దానికి చ్యవనుడు అవలంబించిన నియమ నిష్ఠలు మహోన్నత స్థాయిలోకి ఎదిగి ఎడతెగని స్థితిలో నిలిచిపోవటమే నిదర్శనం. ఆ నియమం కూడా సామాన్యమైన నియమం కాదు. చ్యవన మహర్షి యోగాసనాలలో ముఖ్యమైన వీరాసనాన్ని తన తపస్సుకు సాధనంగా స్వీకరించాడు. ఆ యోగంలో స్థైర్యం, నిశ్చలత్వం,



ఏకాగ్రత ముఖ్యమైన లక్షణాలు. ఆ లక్షణాలన్నిటితో నిరంతరం తపో సుమనస్కుడై ఇహాన్ని మరచి పరమాత్మలో లీనం కావాలనే ధ్యేయంతో ఉండిపోయాడు చ్యవనుడు. అంత ఉగ్ర తపస్సులో మునిగిపోయిన చ్యవనుని దేహమంతా పుట్టతో నిండిపోయింది. చూపరులకది పుట్టలాగానే కనిపించసాగింది కాని, ఒక తపస్విని చుట్టుకొన్న మట్టితో కూడిన పుట్టగా కనిపించడం లేదు. అంతేకాక చుట్టుప్రక్కల ఉన్న తీగలు, పొదలు ఆయన శరీరాన్ని పూర్తిగా ఆక్రమించి అక్కడ ఒక మనిషి ఉన్న స్థితిని తెలియనివ్వకుండా అదంతా అరణ్యమే అన్న భావాన్ని కలగజేస్తున్నాయి. ఆ విధంగా చ్యవన మహర్షి వేల సంవత్సరాలు తపో నియతిలో నిమగ్నుడై ఉన్నాడు. ఆయన స్నానమాడిన సరోవర మహిమను విన్న శర్యాతి అనే రాజు, నాలుగు వేల మంది భార్యలతో కలిసి ఆ కొలనులో విహరించాలనే కోరికతో అక్కడకు వచ్చాడు. నిజానికి శర్యాతికి కూడా చ్యవన మహర్షి ఆ ప్రాంతంలోనే తపస్సు చేస్తున్నాడనే విషయం తెలియదు. పయోష్ణిలో స్నానమాడితే దేవసాయుజ్యాన్ని పొందుతారని విని ఉన్నాడు. స్వర్గ సౌఖ్యాలు పొందుదామనే కోరికతో పత్నీ సహితుడై సైన్యం వెంట రాగా ఆ నదిలో స్నానమాడి కృతార్థుడై, నర్మదా నదిని సమీపించాడు.

శర్యాతి కూతురైన సుకన్య తన చెలులతో కలిసి ఆ అడవిలోని సౌందర్యాన్ని వీక్షించాలని ఆ ప్రదేశమంతా తిరగసాగింది. అలా తిరుగుతూ, తిరుగుతూ సుకన్య అక్కడ ఒక పెద్ద పుట్టను చూసి ఆశ్చర్యపడింది.

**''విద్యుల్లతాంగి భార్గవు**
**నుద్యన్నయనములు మెఱచుచున్నను విలసత్**
**ఖద్యోతద్యుతలొకొయని**
**సద్యస్సంజాత బుద్ధి సంభ్రమ యగుచున్''**
**–177 ప – తృ.ఆ – అరణ్యపర్వము**

''మునులారా! ఇక్కడ నుంచే కథ చిత్ర విచిత్రమైన మలుపులు తిరుగుతుంది అని వారందరి వైపూ చూస్తూ చెప్పసాగాడు ఉగ్రశ్రవసుడు. శౌనకాదులలో ఆయన చెప్పిన మాటలతో మరింత ఉత్కంఠ పెరిగింది.

''సుకన్య రాకుమారి. మెరుపు తీగె వంటి శరీర సౌందర్యం కల రూపవతి. ఆ పుట్ట ఆమె నెందుకో ఆకర్షించింది. ఆ పుట్టలో భృగుమహర్షి పుత్రుడైన చ్యవనుని యొక్క తేజోవంతాలైన నేత్రాలు కనిపించాయామెకు. ఆ నేత్రాలను ఆమె నేత్రాలనుకోలేదు. ఆ కాంతులు మిణుగురు పురుగుల యొక్క కాంతులేమో అనుకొంది. పుట్టలో మిణుగురులుండటం ఏమిటి? ఇదేదో చూడాల్సిందే అనుకొంది. ఆ ఆలోచనతో తొందరపాటును ఆపుకోలేక, రాజపుత్రిక కావటం వల్ల తన సైనికులను పిలిచి ఆ పుట్టను త్రవ్వించింది. ఆ కాంతులు ఎక్కడినుంచి వస్తున్నాయో, ఎలా వస్తున్నాయో అన్నది తెలుసుకోవాలన్నదే ఆమె కుతూహలం. పుట్ట తవ్వించడం వరకే ఆలోచించింది కానీ, తరువాత ఎటువంటి ఫలితం కలుగుతుందో అన్నదానిని గురించి ఆలోచించలేదు. సుకన్య చేసిన పని చ్యవన మహర్షికి మిక్కిలి ఆగ్రహాన్ని తెప్పించింది. ఆ క్రోధం శాపరూపంలోకి మారింది. చ్యవన

ముని అసలే అనంత తపశ్శక్తి సంపన్నుడు. రెండు కళ్ళూ లిప్తమాత్రం మూసుకుని శర్యాతి సైనికులందరికీ మూత్రపు రీషాలు స్తంభించేటట్లు శపించాడు. అంతే సైనికులందరూ విపరీతమైన బాధకు గురయి కదలలేకపోయారు. వారి దీనావస్థను చూసిన శర్యాతి వారేదో తప్పు చేసి ఉంటారని భావించి ఒక్కొక్కరినీ నీవేం నేరం చేశావని? ఎందుకీ విధంగా జరిగిందని ప్రశ్నించి కారణాన్ని తెలుసుకోబోయాడు. కాని ఏ ఒక్కరి వల్ల విషయం గ్రహించలేక బాధాతప్త హృదయుడై ఉండటాన్ని చూసిన సుకన్య తండ్రి వద్దకు వచ్చి తాను చేసిన పనిని వివరించి చెప్పింది.

''తండ్రీ! ఈ అరణ్యంలో చెలులతో కూడి నేను తిరుగుతున్న సమయంలో మాకొక వింత కనిపించింది. అదేమిటంటే – ఒక పెద్ద పుట్టలో నుండి రెండు పెద్ద పెద్ద వెలుగులు కనిపించాయి. అవి ఎక్కడ నుండి వస్తున్నాయా అని నాకు సందేహం కలిగింది. అవి మిణుగురు పురుగుల కాంతులేమోనని నాకనిపించింది. మిణుగురులు అంత ప్రకాశమానంగా ఉంటాయా? అని మళ్ళీ అనుమానమేర్పడింది. అదేదో తెలుసుకుందామనే ఆత్రుత నాలో పెరిగింది. ఆ పుట్టను త్రవ్విస్తే అసలు విషయం బయటపడుతుంది గదా అనే ఆలోచన కలిగింది. వెంటనే భటులను పిలిచి ఆ పుట్ట త్రవ్వించాను. కాని ఆ వెలుగులు ఎక్కడనుంచి వస్తున్నాయో, ఎలా వస్తున్నాయో తెలియరాలేదు. ఇక ఏమీ చేయలేక ఆ ప్రయత్నాన్ని మానుకొని విడిదికి తిరిగి వచ్చాను. ఈ సైనికులకు కలిగిన ఇబ్బందికి ఒకవేళ ఆ పుట్టలో నుండి వస్తున్న కాంతులు కారణమై ఉంటాయేమో!'' అని అన్న సుకన్య మాటలు విని శర్యాతి మహారాజు హుటాహుటిన పుట్ట వద్దకు వెళ్ళాడు విషయం తెలుసుకుందామని. అక్కడ ఆయనకు వేల సంవత్సరాల పాటు తపస్సు చేసి, చేసి శుష్కించిపోయిన ఒక మహాతపస్వి కనిపించాడు. ఆ మహర్షి చర్మం, ఎముకలు మాత్రమే మిగిలి ఉన్న శరీరంతో ఇంకా తపస్సు చేస్తున్న వృద్ధుని వలె గోచరించాడు. వెంటనే ఆ మహాత్ముడు తపోనిధి అయిన భృగుమహర్షి కుమారుడని గుర్తించాడు. తక్షణం శర్యాతి, చ్యవనుని పాదపద్మాల మీద పడి శరణు వేడాడు.

''మహానుభావా! అఖండ తపోనిధీ! చ్యవన మహర్షీ! నా కుమార్తె పుట్టలో ఉన్నది మీరని తెలియక మీ పట్ల అపచారం చేసి మీకు విపరీతమైన కష్టాన్ని కలిగించింది. అత్యధికమైన మీ తపోమహిమ ఎటువంటిదో గ్రహించలేనిదై మీ స్థావరాన్నే కదిలించబోయిన అజ్ఞాని నా బిడ్డ. దయచేసి ఆమెను క్షమించి నా సైనికులందరికీ ఏర్పడిన ఈ ఆపదను నివారించవలసిందని మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. నా మనవి ఆలకించి, నావాళ్ళనందరినీ రక్షించమని మరీ మరీ వేడుకొంటున్నాను'' అని శర్యాతి దీనుడై నిలబడటంతో చ్యవనునిలో కరుణ చోటు చేసుకుంది.

''మహారాజా! నీవు కోరిన ప్రకారం నీ సైనికులనందరినీ విపత్కర పరిస్థితులనుంచి తప్పిస్తాను. కాని, నీ కుమార్తెను మాత్రం వదలను. 'అతిశయరూప యౌవన గర్విత' అయిన నీ పుత్రికను నేను భార్యగా పరిగ్రహించటానికి నీవంగీకరిస్తే గాని ఆమె చేసిన నేరాన్ని క్షమించలేను. నీ సైన్యం నీకు దక్కాలంటే సుకన్య నాకు సతీమణి కావల్సిందే'' అని చ్యవనుడు నొక్కి చెప్పటంతో శర్యాతి అతని మాటకు ఎదురు చెప్పలేకపోయాడు. చ్యవనుడు చూడబోతే వృద్ధులలోకెల్ల వృద్ధుడైన వాడు. శక్తిహీనుడు. తపశ్శక్తిని తప్ప శరీరశక్తికి నోచుకోలేకపోయినాడు. తనకాత్మీయురాలైన కూతురు – అతిలోక సౌందర్యవతి. యౌవనంతో విరాజిల్లుతన్న కన్యకామణి. మరోవైపు చూడబోతే ప్రజారక్షణకై ప్రాణాలొడ్డే సైన్య సమూహం. రాజుగా సైనికుల ప్రాణరక్షణే తన కర్తవ్యంగా భావించిన శర్యాతి తన పుత్రికను మహర్షికిచ్చి సైన్యాన్నిరాజధానికి తరలించుకొని తీసుకొని వెళ్ళిపోయాడు'' అని ఉగ్రశ్రవసుడు చెప్పడంతో మునులందరు సుకన్య చేసిన పొరపాటుకు బాధపడ్డారు. ఆ నవయౌవనవతి మహర్షి వద్ద ఎలా మనగలుగుతుందో గదా అని ఆలోచించసాగారు. వాళ్ళ మనోభావాలను అర్థం చేసుకొన్న ఉగ్రశ్రవసుడు మళ్ళీ చెప్పటం మొదలుపెట్టాడు.

**''పతికి పరమభక్తి పరిచర్య సేయుచు**
**నొనరగా సుకన్య యుండు నంత**
**నా లతాంగి కడకు నాశ్వినులేతెంచి**
**తమ్మెఱుంగ జెప్పి దానికనిరి''**


**–183 ప – తృ.ఆ – అరణ్యపర్వము**

సుకన్యా చ్యవనుల వివాహం జరిపి, శర్యాతి వెళ్ళిపోయిన తరవాత సుకన్య అత్యంత భక్తిప్రపత్తులతో పతిసేవ చేస్తూ, చ్యవనుడేది చెబితే అది చేస్తూ మహాసాధ్విగా మనసాగింది. తండ్రి, అతివృద్ధుడైన మహర్షికిచ్చి పెండ్లి చేసినందుకు, గారాలపట్టి అయిన సుకన్య ఎంతమాత్రం బాధపడలేదు. మనసులో కూడా తండ్రిని దూషించలేదు. చ్యవనుని దైవంగా పూజిస్తూ, నిష్కల్మష హృదయంతో ఆతనినే ఆరాధిస్తూ ఉంటున్న సుకన్య వద్దకు ఒకనాడు అశ్వినీదేవతలు వచ్చి ఆ లావణ్యవతిని చూసి ఆశ్చర్యపోతూ, ఆమెతో సంభాషించసాగారు. ''అమ్మా! నిన్ను చూస్తుంటే రాజవంశపు బిడ్డవలె కనిపిస్తున్నావు. నీవు ఎవరి పుత్రికవు? ఎవని భార్యవు?

మేము అశ్వనీ దేవతలమనబడే దేవవైద్యులము. దేవజాతికి చెందిన వారిలో బహు సుందరులము'' అని చెప్పి ఆమె సమాధానానికై ఎదురు చూడసాగారు. వారిద్దరూ అశ్వనీ దేవతలన్న విషయాన్ని విన్న సుకన్య గౌరవ పూర్వకంగా వారిని చూస్తూ తాను శర్యాతి మహారాజు కుమార్తెనని, అద్భుత తపశ్శక్తి సంపన్నుడైన చ్యవనుని ఇల్లాలినని చెప్పడంతో వారు మరింత ఆశ్చర్యానికి లోనయ్యారు. భృగు మహర్షి పుత్రుడైన చ్యవన మహర్షి భార్యయా ఈమె అని అనుకొంటూ ఆమె దురదృష్టాన్ని ఎత్తి చూపారు. 'రాకుమారీ! ఇటువంటి అతిలోక లావణ్యవతివైన నీవు కామభోగ లాలసత్వాలను అందించటానికి అసమర్థుడు, పరమ వృద్ధుడు అయిన ఈ తాపసిని వరించి, నీ యౌవనాన్ని అంతటినీ వృథా పరచుకొన్నావు. ఇప్పటికయినా నీ వయో రూపాలకు సమ ఉజ్జీ అయిన వరుని ఎన్నుకోవటం నీకు ఎంతో శ్రేయస్కరం. ఎందుకు నీ జీవితాన్ని ఇలా వ్యర్థం చేసుకుంటున్నావు? నీకు తగిన వరుని గురించి చెప్పు మేము తెచ్చి పెడతాం'' అన్న వారి మాటలను మహాపతివ్రత అయిన సుకన్య ఇచ్చగించక, సహించలేనిదై వారి దోషాన్ని బయటపెట్టింది.

**"చ్యవనునందు నాకు సంతత ప్రీతియై**
**యుండ నిట్లు పలుకుటుచిత మగునె?**
**యని నిజేశ్వరునకు నప్పడు వారల**
**పలుకు లెఱుగజెప్పె పంకజాక్షి"**
**–185 ప – తృ.ఆ – అరణ్య పర్వము**

''దేవతలారా! పతిదేవుడైన చ్యవన మహర్షి పట్ల నాకత్యంత ప్రీతి ఉంది. ఆయన వృద్ధుడని, రూపవంతుడు కాడని నాకెప్పుడూ అనిపించలేదు. ఆయన యందు ఒక్క ప్రేమే కాదు, నాకు మీదు మిక్కిలి భక్తి గౌరవాలు కూడా ఉన్నాయి. అటువంటి నా గురించి మీరిట్లా పలకటం ధర్మమేనా? అసలలా అనవచ్చా?'' అని అన్న సుకన్య పలుకులతో అశ్వనీ దేవతలు మౌనం వహించారు. సుకన్య అంతమాత్రంతో ఊరుకోక అప్పటికప్పుడే పెనిమిటి వద్దకు వెళ్ళి అశ్వనీ దేవతలు తనతో అన్న మాటలన్నీ విపులంగా తెలియజేసింది. పత్ని లక్షణాన్ని నూటికి నూరు పాళ్ళూ కలిగి ఉన్న పరమ పతివ్రత సుకన్య. చ్యవనుడు సుకన్య సతీత్వ సద్గుణానికి సంతోషించటమే కాక – ''దేవీ! అశ్వనీ దేవతలు చెప్పిన మాటలకు నీవంగీకరించు. వారు దేవతలు గదా! మెచ్చితే మనం కోరిన కోరికలను వరాల రూపంలో తీర్చగల మహానుభావులు. మనకు మంచిని కలిగించటానికే ఇక్కడకు వచ్చి నీతో ఆవిధంగా సంభాషించి ఉంటారు. కనుక నీవు వెళ్ళి వారిని ప్రసన్నులను చేసుకొని, నీ కోరికను తెలియజేయి''



అని అనుజ్ఞ ఇవ్వటంతో పతి ఆజ్ఞ మేరకు సుకన్య అశ్వనీ దేవతలున్న చోటికి వెళ్ళి నమస్కరించింది.

''అశ్వనీ దేవతలారా! ఇంతకుముందు నాకు తగిన వయోరూప వంతుడైన వరుని మీరు తెచ్చి పెడతామని అన్నారు. కనుక మిమ్మల్ని కోరుతున్నాను. ''నాకు నవయౌవనవరుని తెచ్చి ఇవ్వవలసిందని అర్థిస్తున్నాను'' అని అడిగిన సుకన్య పలుకు విన్న అశ్వనీ దేవతలు ప్రక్కనే ఉన్న పవిత్రము, పుణ్యప్రదము, కోరినవరాలు క్రుమ్మరించేది అయిన ఆ సరోవరంలోకి దిగారు. అది చూసిన చ్యవనుడు వారితో పాటు తాను కూడా ఆ సరస్సులో మునిగాడు. అలా మునిగిన ఆ ముగ్గురూ కొలను బయటకు వచ్చేసరికి నవయౌవనులుగా శోభించారు. సుకన్యకు పరీక్ష పెట్టాలని భావించిన అశ్వనీ దేవతలు చ్యవనుడితో కూడా కలిసి సుకన్య వద్దకు వచ్చారు.

''కళ్యాణీ! మా ముగ్గురిలో నీకు నచ్చినవానిని వరించు. ఆతడే నీకు మగడవుతాడు'' అని వారనడంతో సుకన్య ఆ ముగ్గురినీ పరిశీలనగా చూసింది. 'వారిలో తన భర్త ఎవరా?' అని ఆలోచించి, పతిభక్తి గలది కావడంతో, తన పాతివ్రత్య శక్తితో చ్యవనునే వరించింది సుకన్య. తనయందు సుకన్యకున్న భక్త్యనురాగాలకు, అశ్వనీదేవతలు తనకు చేసిన మహోపకారానికి చ్యవనుడు అమందానంద భరితుడైనాడు. అశ్వనీ దేవతలకు ప్రత్యుపకారం చేయాలని తలపోశాడు.

''ఏను మీ కారణంబున నిపుడు లబ్ధ
యౌవనుండనై ధన్యుండ నైతి; మిమ్ము
సోమపీథుల చేసెద సురల రాజు
సూచుచుండగ శర్యాతి సుక్రతువున''
–187 ప – తృ.ఆ – అరణ్యపర్వము

''అశ్వనీ దేవతలారా! మీ వల్ల ఇప్పుడు నవయౌవనాన్ని పొంది భాగ్యశాలినైనాను. మా దంపతులం మీకు నిజంగా కృతజ్ఞులం. మీకు ఏదైనా సహాయం చేయాలని ఉంది. అమరాధిపుడయిన దేవేంద్రుడు మీ ఇద్దరికీ సోమరసం ఇవ్వకుండా మిమ్మల్ని వేదనకు గురి చేశాడన్న విషయం నాకు తెలుసు. శర్యాతి మహరాజు చేత మంచి యజ్ఞం చేయించి ఆ యజ్ఞంలో మీరు సోమపానం చేసేటట్లు చేస్తాను. అది కూడా మీకు ఏ సురరాజు సోమరసం లభించకుండా అడ్డుపడ్డాడో ఆ మహేంద్రుడు చూస్తుండగానే మీకు సోమరసాన్ని అందిస్తాను'' అని చ్యవన మహర్షి చెప్పగానే ఆనందభరితులై ఆయనకు నమస్కరించి అశ్వనీ దేవతలు తమ లోకానికి వెళ్ళిపోయారు.

చ్యవనుడు జరాభారం నుండి విముక్తుడై, నవయౌవనుడైనాడన్న విషయాన్ని విని ఆశ్చర్యంతో కూడిన సంతోషంతో కూతురును, అల్లుడిని చూడటానికి వచ్చిన శర్యాతికి సకల సత్కారాలు చేసి గౌరవించాడు చ్యవనుడు. శర్యాతి చేత తాను ఒక యజ్ఞం చేయించాలనుకొన్న విషయాన్ని ఆతనికి స్పష్టపరచి క్రతువిధానాన్ని అంతటినీ విశదపరిచాడు. ''మహారాజా! నీవు చేయబోతున్న ఈ యజ్ఞం నీకు విశేష ఖ్యాతిని కలగజేస్తుంది. నీకు హితం చేకూర్చాలనే ఉద్దేశంతో నీ చేత ఈ యజ్ఞాన్ని చేయించాలని నిశ్చయించాను. శాస్త్రోక్త విధానమంతా తెలియజెప్పాను గదా! యజ్ఞ నిర్వహణకు కావలసిన సామగ్రినంతటినీ రేపు ఉదయానికల్లా సమకూర్చు'' అని చెప్పిన చ్యవనుని మాటలను యథావిధిగా అమలు పరిచాడు శర్యాతి.

''అనఘుడు శర్యాతి మఖం
బొనరించె విధి ప్రయోగ యుతముగ? నందా
శ్వినులకు సోమంబీఁ బో
యిన భృగు పుత్రునకు నలిగి యింద్రుండనియెన్''
–190 ప – తృ.ఆ – అరణ్యపర్వము

శాస్త్రాలలో చెప్పబడిన విధంగా శర్యాతి, ఏ లోటూ రాకుండా యజ్ఞకార్యాన్ని సమగ్రంగా, అత్యున్నతంగా నిర్వహించాడు. ఋత్విక్కుగా యజ్ఞం చేయించిన చ్యవన మహర్షి అదే యజ్ఞంలో అశ్వనీ దేవతలకు సోమరసాన్ని అందించబోయాడు. భృగుపుత్రుడు చేస్తున్న పనికి త్రిలోకాధిపతి అయిన దేవేంద్రుడు మహోగ్రుడై ఆ మహర్షిలో దోషమెంచాడు.

''భార్గవా! నీవు చేస్తున్న పని అనుచితమైనది.
''వీరిద్దరు సోమార్హులు
కా; రమరుల వెజ్జు; లిదియ కర్తవ్యము; బృం
దారకులు కానివారికి
వారింపక సోమమిచ్చువారుం గలరే?''
–191 ప – తృ.ఆ – అరణ్యపర్వము

''ఈ అశ్వనీ దేవతలిద్దరు సోమరసానికి అర్హులు కారు. వాళ్ళు కేవలం దేవతలకు వైద్యం చేసే వైద్యులే కాని సోమరస పానానికి అర్హులైన అమరులలోని వారు కారు. బృందారకులతో (దేవతలతో) వీరే విధంగానూ పోల్చదగినవారు కారు. అందుచేత వారికి సోమరసం ఇవ్వకూడదు. యజ్ఞం చేయించి హోతగా ప్రసిద్ధుడవైన చ్యవన మహర్షీ! నీవు అశ్వనీ దేవతలకు సోమరసం ఇవ్వటం నీవు చేయవలసిన పని కాదు. నీలాగా అర్హులు కాని అశ్వనీ దేవతలకు సోమరసం పానం చేయమని ఇచ్చేవాళ్ళు ఎక్కడైనా ఉన్నారా? లేరే! కనుక ఈ పనిని మానటం నీ కర్తవ్యంగా భావించు'' అని చెబుతున్న ఇంద్రుని మాటలను చ్యవన మహర్షి ఆదరించలేదు. అశ్వినుల చేత సోమరసాన్ని పానం చేయించాడు – మహా తపస్వి అయిన చ్యవనుడు తన తపోబలంతో. చ్యవనుడు – అశ్వినీదేవతలకు సోమరసాన్ని ఇవ్వడాన్ని సహించలేకపోయిన మహేంద్రుడు – మహర్షి మీద తన వజ్రాయుధాన్ని ప్రయోగించబోయాడు.

'జృంభించి వజ్రమెత్తిన
జంభాంతకు వజ్రయుత భుజాస్తంభము సం
స్తంభించి యతని పటు సం
రంభంబున చంపగడగి రౌద్రాకృతితోన్''
–193 ప – తృ.ఆ – అరణ్య పర్వము

ఇంద్రుడు ఒక్కసారిగా విజృంభించి వజ్రాయుధమున్న తన దక్షిణ హస్తాన్ని పైకెత్తి ఆయుధాన్ని తపశక్తిలో ఎదురు లేని భృగుపుత్రుని మీద ప్రయోగిస్తుండగా ఆ మహర్షి శ్రేష్ఠుడు వజ్రాయుధమున్న హస్తాన్ని స్తంభింపచేశాడు. త్రిలోకాధిపతిననే అహంకారంతో మహర్షి సత్తమునే అంతం చేయబోయిన దేవేంద్రుని చూసి చ్యవనుడు మండిపడ్డాడు. ఇంద్రుని చంపాలన్న కోపంతో రౌద్రాకారం ధరించాడు. ఆ ఆవేశంతో చ్యవనుడు హోమం చేశాడు. చ్యవనుడి తపశ్శక్తి ముందు ఇంద్రుడంతటి వాడే ఆగలేకపోయాడు. ఇంద్రుని వధించాలనే కారణంతో చ్యవనుడు చేసిన హోమం నుంచి ఒక భీకరాకారుడైన రాక్షసుడుద్భవించాడు. అతడి పేరు 'మదుడు'. మదుడు అపారమైన శక్తితో, అనంతమైన బలంతో, మహావేగంతో హోమగుండం నుంచి బయటకు

వచ్చి క్రోధ దృష్టితో ఇంద్రుడి వైపు చూశాడు.

మహాభయంకరాకారంలో ఉన్న ఆ రాక్షసుడి చేతులు పదివేల ఆమడల కొలతతో ఉన్నాయి. అతని నోటినుంచి నాలుగు కోరలు కనిపిస్తున్నాయి. నూరామడల దూరం దాకా పొడుచుకొని వచ్చాయి. ఇక దంతాలు – పది ఆమడల పొడవు ఉన్నాయని అనిపిస్తోంది. కళ్ళు చూడబోతే సూర్య చంద్ర బింబాల వలె మిరుమిట్లు గొలిపే కాంతుల్ని విరజిమ్ముతున్నాయి. నోరు అగ్ని గోళం లాగా మండిపడుతోంది. మొత్తం శరీరం చూడబోతే భూమ్యాకాశాలు నిండా నిండిపోయి, దిగంతాల వరకు వ్యాపించి, విశ్వంలో ఇక చోటు మిగలలేదా అన్నట్లు – ఎక్కడ చూసినా మదుడి శరీరమే కనిపిస్తోంది. ఆ ఘోర రాక్షసుడు నోరు తెరిచినప్పుడు ఒక దవడ ఆకాశం వరకు, మరొక దవడ భూమి అంతా వ్యాపించి భీతి గొల్పేటట్లు ఉన్నాయి. అతి దీర్ఘమైన అతని నాలుక వేగంగా అటూ ఇటూ కదులుతూ అతని క్రింది పెదవిని నాకుతోంది. భరించ శక్యం కాని విధంగా, చెవులు శ్రవణశక్తిని కోల్పోయేటట్లు మహాభయంకరమైన కంఠధ్వనితో, దిక్కులను చీల్చివేస్తున్నాడా అనే విధంగా, ఒక్క దూకు దూకి మీద పడబోతున్నాడా అన్నట్లు మద నామధేయుడైన రక్కసుడు తన మీదకు వస్తుండటాన్ని చూసిన సురరాజు ఆ క్రూర రాక్షసుని ఏమీ చేయలేకపోయాడు. కారణం – అంతకుముందే చ్యవనుడు దేవేంద్రుని వజ్రాయుధాన్ని, కరాన్ని స్తంభింపచేసి ఉండటం. గత్యంతరం లేక మహేంద్రుడు చ్యవన మహర్షిని శరణు జొచ్చాడు. ''మహర్షి సత్తమా! భృగుపుత్రా! నీకివే నా నమోవాకాలు. నీ తపః ప్రభావం ముందు నా శక్తి ఎంత? నీ పట్ల నేను విజృంభించి ప్రవర్తించినందుకు నన్ను క్షమించవలసిందిగా ప్రార్థిస్తున్నాను. నీవు తలపెట్టిన కార్యం సఫలీకృతం కాక అపజయం పాలవుతుందా? మహా ఘోర భయంకర వికృతాకారంతో నా మీదకు వస్తున్న ఈ దనుజుడు మీరు కరుణిస్తే తప్ప నన్ను వధించక మానడు. దయామయుడవైన నీవు నాయందు ప్రసన్నుడవై ఈ విపత్తు నుండి నన్ను కాపాడవలసిందిగా అంజలి ఘటించి వేడుకొంటున్నాను. మీ అభీష్టమే నెరవేరుగాక! మీ కార్యసిద్ధి వల్ల నేటినుండి యజ్ఞాలలో అశ్వనీ దేవతలు సోమరసాన్ని స్వీకరింతురు గాక! అందరు దేవతలతో పాటు దేవ వైద్యులకు కూడా సోమరసపానానికి అర్హతను కలిగిస్తున్నాను'' అని అంటూ వినయశీలిగా నిలబడిన దేవేంద్రుని వైపు ప్రసన్నంగా చూస్తూ క్రోధమూర్తి కాస్తా శాంతమూర్తిగా మారాడు చ్యవన మహర్షి.


''ముని నాథు నలుక తోడన
యనిమిషపతి వజ్రయుత మహాభుజ సంస్తం
భన ముడిగె; నంత భృగు నం
దను వీడ్కొని యింద్రుడరిగె తన పురము నకున్''

–196 ప – తృ. ఆ – అరణ్యపర్వము

ఎప్పుడైతే చ్యవన మహర్షి కోపం ఉపశమించిందో ఆ క్షణంలోనే వజ్రాయుధాన్ని పట్టుకొని ఉన్న దేవేంద్రుడి చేయి కదిలింది. అంతవరకు చలనం లేకుండా బిగుసుకుపోయిన ఆ చేయి మహర్షి కరుణతో స్వాధీనం కావడంతో దేవేంద్రుడు మహర్షి మహిమకు విస్తుపోతూ చ్యవనుని పాదాలకు నమస్కరించి, ఆయన అనుమతితో తన పురమైన అమరావతికి వెళ్ళిపోయాడు'' అని ఆగాడు చెప్పటం ఆపి ఉగ్రశ్రవసుడు.

వెంటనే మునులు ఉగ్రశ్రవసుని చూసి ''మహాత్మా! మరి ఆ రాక్షసుడేమైనాడు? చ్యవన మహర్షి అతని నేమని ఆజ్ఞాపించాడు?'' అని అడగటంతో –

''అవును. ఆ విషయం చెప్పలేదు గదూ! చ్యవన మహర్షి ఉపదేశంతో మదుడనే ఆ రాక్షసుడు ఆ క్షణంలోనే – మద్యంలోను, స్త్రీల యందు, వేటలోను, పాచికలలోను ప్రవేశించాడు. మహానుభావుడైన సుకన్యా నాథుని దయవల్ల అశ్వనీదేవతలు శర్యాతి యజ్ఞంలో సోమరసాన్ని త్రాగి స్వర్గలోకానికి వెళ్ళి దేవతా మిత్రులతో సుఖంగా కాలం గడిపారు. సుకన్యా చ్యవనాశ్వినుల చరిత్ర ఆచంద్ర తారార్కం నిలిచిపోయింది. నిరంతరం, అఖండంగా చ్యవన మహర్షి చేసిన తపో గరిమ వల్ల ఆయన తపస్సు చేసిన పర్వతము ఆర్చీకపర్వతం మీదనే ఉంది. మరొక విషయం. అరణ్యవాసం చేస్తున్న పాండవులు కూడా ఈ ప్రదేశానికి వచ్చి ఆ పుణ్య సరోవరంలో మునిగి పునీతులైనారు. పాతివ్రత్య గరిమకు సుకన్య, తపః ప్రభావానికి చ్యవన మహర్షి, దివ్య మహిమల ప్రకటనకు అశ్వనీ దేవతలు నిలువెత్తు అద్దాలుగా నిల్చిన ఆఖ్యానమే సుకన్యోపాఖ్యానం'' అని ఉగ్రశ్రవసుడు ఆనాటికి ముగించటంతో శౌనకాదులందరూ లేచి ఆయనకు సాష్టాంగ నమస్కారం చేశారు. ''తపో మహిమ వల్ల అనివార్యమైన ఎంతటి ఘనకార్యాన్ని అయినా సాధించవచ్చన్నమాట! దానికి చ్యవన మహర్షి ఉదంతమే ఉదాహరణ. భక్తిప్రపత్తులు, నిష్కల్మషత్వం, ఆరాధనా భావం ఉంటే ఎంతటి కష్టాన్నిఅయినా అవలీలగా దాటి పతి సేవ కంకితమై మహానుభావిత్వాన్ని, సుఖ సంతోషాలను పొందవచ్చుననుకోవటానికి – సాధ్వీమణి అయిన సుకన్య చరిత్రే నిదర్శనం'' అని తమలో తాము అనుకుంటూ మునులందరూ తమ తమ నివాసాలకు వెళ్ళిపోయారు. (సశేషం)



# భక్తవరేణ్యుడు మాణిక్య వాచకర్

– యర్రమిల్లి విజయలక్ష్మి

**పూర్వం అరిమర్దనుడనే పాండ్యరాజు మదురైను పాలించేవాడు. ఆయన ముఖ్యమంత్రిగా తిరువాదవూరుని నియమించాడు. తిరువాదవూరు సమర్థుడైన మంత్రి మాత్రమే కాదు గొప్ప శివభక్తుడు కూడా. నిరంతరం పంచాక్షరి జపిస్తూ తన ఉద్యోగ ధర్మాన్ని చక్కగా నిర్వర్తిస్తూ రాజుకి ముఖ్యుడిగా మన్ననలు పొందాడు.**

ఒకసారి అరిమర్దనుడికి తన సైన్య అశ్విక దళాన్ని పెంచుకుంటే శత్రువుల దాడిని సమర్థవంతంగా ఎదుర్కోగలమన్న ఆలోచన కలిగింది. రాజభటుల ద్వారా చోళదేశపు దక్షిణ సముద్రతీరంలో మంచి అరేబియా గుర్రాలు విక్రయానికి ఉన్నాయని తెలుసుకున్నాడు. వెంటనే మంత్రిని పిలిచి ''మనకిప్పుడు మంచి అశ్వాలు అవసరం తిరువాదవూరా. మీరు ఖజానా నుండి తగిన సొమ్మును తీసుకుని వెంటనే వెళ్ళి తగినన్ని ఎక్కువ అశ్వాలు కొని తీసుకురండి'' అని ఆదేశించాడు.

తిరువాదవూరు వెంటనే తగిన రొక్కం, పరివారాన్ని తీసుకుని బయలుదేరాడు. ఇష్టదైవాన్ని స్మరిస్తూ, ఒంటెల మీద ధనపు సంచులుంచుకుని వెనక ముందు రక్షక భటులు అనుసరించగా పల్లకిలో యాత్ర ప్రారంభించాడు. కొంతదూరం వెళ్ళాక తిరుప్పెరుందురై అనే ప్రాంతంలో వటవృక్షం క్రింద శిష్యసమేతంగా ఆసీనుడై ఉన్న దక్షిణామూర్తి రూపంలో పరమేశ్వరుడు దర్శనమిచ్చాడు. వెంటనే పల్లకీ దిగి తిరువాదవూరు ఆయనకు ప్రణమిల్లి మాణిక్యాల వంటి స్తోత్రంతో ఆశువుగా పరమశివుని కీర్తించాడు.

శివుడు ప్రసన్నుడై భక్తుని కొంతకాలము అక్కడే ఉండమన్నాడు. ఆ సమయంలో అక్కడ ఒక గొప్ప శివాలయ నిర్మాణం జరుగుతోంది. తిరువాదవూరు భక్తపారవశ్యంలో మునిగి తన కర్తవ్యాన్ని మరిచిపోయాడు. 'మీరు నగరానికి తిరిగి వెళ్ళండి. నేను గుర్రాలను తీసుకు వస్తానని రాజుగారికి చెప్పండి' అని వెంట వచ్చిన పరివారాన్ని పంపేస్తాడు. శివాలయ నిర్మాణానికి తను రాజుగారి ధనాగారం నుంచి తెచ్చిన సొమ్మంతా ఖర్చు పెట్టేశాడు.

అనుకున సమయానికి గుర్రాలు రాకపోవటమే కాక మంత్రిగారు కూడా తిరిగి రాకపోయేసరికి రాజు భటులను పంపి విచారణ చేయించాడు. అక్కడ తిరువాదవూరు శివారాధనలో మునిగి ఉన్నాడు. గుర్రాలు కొనుగోలు చెయ్యకుండా తీసుకెళ్ళిన ద్రవ్యమంతా మంత్రి శివాల నిర్మాణానికి వెచ్చించాడని తెలిసి రాజు అతనిని బంధించి రప్పించాడు. దిగులు పడుతున్న భక్తునికి 'భయపడకు. శ్రావణ మాసంలో గుర్రాలు వస్తాయని చెప్పు' అన్న అశరీరవాణి వినిపించింది. అదే మాట రాజుగారికి చెప్పాడు. తిరువాదవూరు. కాని రాజు అతనిని అప్పటివరకు చెరసాలలో బంధించాడు.

అశరీరవాణి చెప్పినట్లుగానే శివుడు నాయకుడిగా, ప్రమథగణాలు రౌతులుగా పరిసర ప్రాంతాలలోని నక్కలన్నీ గుర్రాలుగా మారి మదురై నగర వీధులలో ప్రవేశించాయి.

రాజు ఆనందించి వెంటనే తిరువాదవూరుని విడుదల చేసి క్షమించమని కోరాడు. అయితే ఆ రాత్రే నడిజాములో నక్కల ఊళలు వినిపించాయి. రాజు విషయం గ్రహించి తీవ్రమైన ఆగ్రహంతో మళ్ళీ తిరువాదవూరుని బంధించి కఠిన శిక్షకు గురి చేశాడు. ఇది ఈశ్వరుడి లీల అని గ్రహించలేని రాజు మంత్రి ఏదో మాయ చేసి తన్ని మోసపుచ్చాడు. తన సొమ్ము దుర్వినియోగం చేశాడన్న క్రోధంతో మరింత కఠిన శిక్ష విధించాడు. తన భక్తిని పరీక్షించడానికి పరమేశ్వరుడు ఇదంతా జరిపిస్తున్నాడన్న నమ్మకంతో తిరువాదవూరు శిక్షలు అనుభవిస్తూనే మరింత భక్తితో, ఆర్తిగా భగవంతుని స్తుతించసాగాడు. తన సొమ్ము తిరువాదవూరు వ్యర్థ పరిచాడని, దేశ రక్షణకు తగిన అశ్వాలను కొనుగోలు చెయ్యకుండా శివుడి పేరుతో తన్ని మోసపుచ్చాడన్న కక్షతో కఠిన శిక్షలకు గురి చేస్తున్నాడు రాజు. భక్తవర్యుడై తిరువాదవూరు రాజు నిమిత్తమాత్రుడని, ఈ నెపంతో తన పూర్వ పాప కర్మలకు ఫలితం అనుభవిస్తున్నానని అన్ని శిక్షలు సహనంతో భక్తితో అనుభవిస్తున్నాడు.

అకస్మాత్తుగా వైగై నదికి వరదలొచ్చి నగరమంతా వెల్లువలో మునిగిపోసాగింది. ఆకస్మిక దుర్ఘటనకు రాజు కలత చెంది, మంత్రులను పిలిపించి – నగరంలో ప్రజలందరూ ఇంటికొకడుగా గండిని పూడ్చటానికి నియమించమని ఆదేశాలు జారీ చేశాడు. తక్షణం ప్రతి ఇంటి నుండి యువకులు, బలవంతులు మట్టిని తవ్వి మోసుకొచ్చి వరద నీటిని ఆపే ప్రయత్నం చేస్తున్నారు. నగరంలో ఒక పేద ముదుసలి ఉంది. ఇంట్లో ఎవరూ లేకపోవటంతో రాజాజ్ఞ ప్రకారం తన వంతు మట్టి తవ్వి పోయటానికి ఎలాగో ఒక కూలివాణ్ణి పట్టుకుంది. 'నా వంతుకు నువ్వెళ్ళి మట్టి పోసి వస్తే కావలసినంత పిండినిస్తాను' అని బ్రతిమాలుకుని వప్పించింది. ఒప్పుకోడమైతే ఒప్పుకున్నాడు కాని ఆ కుర్రాడు సోమరిగా తీరంలో కూర్చుని అందరూ శ్రమ పడుతుంటే సరదా చూస్తున్నాడు. పనులు స్వయంగా గమనిస్తున్న అరిమర్దనరాజు ముసలమ్మ కూలివాడి తీరు చూసి మండిపడి కొరడాతో దెబ్బలు కొట్టించాడు. కొరడా దెబ్బలు కూలివాడికి తగలటం లేదని, అవి కొడుతున్న వాళ్ళతో పాటు తనకూ తగులుతున్నాయని తెలుసుకున్న రాజు ఆశ్చర్యపోయాడు. మరుక్షణం ముసలమ్మ ఏర్పాటు చేసుకున్న కూలి కుర్రాడు మాయమయ్యాడు. రాజుకి వెంటనే జ్ఞానోదయమైంది. చెరసాలలో శిక్షలనుభవిస్తున్న తిరువాదవూరు దగ్గరకు పరుగెత్తి తప్పు క్షమించమని పాదాలపైన పడ్డాడు. 'నాదని నేననుకుంటున్నదంతా భగవంతుడిదే. ఆయన ప్రసాదమే. మీ వల్లనే పరమాత్మ అశ్వపు సేవకుడిగా, కూలి కుర్రాడిగా నాకు దర్శనమిచ్చాడు. మీ భక్తి మహిమను గుర్తించలేక మిమ్మల్ని బాధించాను. నన్ను క్షమించండి' అని ప్రార్థించాడు. తిరువాదవూరు చేసిన ప్రార్థనతో వరద ఆగిపోయింది. రాజు వద్ద సెలవు తీసుకుని ఆయన సన్యాసం స్వీకరించి క్షేత్రాలన్నీ సందర్శిస్తూ చివరకు చిదంబరం చేరుకున్నాడు. ఆయన తిరువాచకం అనే గ్రంథాన్ని రచించాడు. శివభక్తిని ప్రబోధించే వరప్రసాదంగా భక్తులా పవిత్ర గ్రంథాన్ని ఆరాధిస్తారు. మాణిక్యం వంటి మధురమైన మాటలతో శివకీర్తనలు చేశాడు కనుక ఆయనకు మాణిక్య వాచకర్ అన్న పేరు వచ్చింది. చిదంబరంలోనే మాణిక్య వాచకర్ శివునిలో ఐక్యమయ్యాడు.

# శ్రీనివాస కృప

కన్నీటి ధారలతో వారధి కట్టనా స్వామి,
నువ్వు కదలిరావడానికి
బాధాతప్త హృదయంతో బాటవేయనా స్వామి,
నీ రాక గూర్చి
నీ పవిత్ర నామస్మరణతో వాహనమమర్చనా స్వామి
నీ పయనానికి
ఎందుకీ ఆలస్యం, ఎందుకీ అలసత్వం
శరణాగత తత్పరా కదలిరా
దీనజన బాంధవా నీ ఉనికి తెలుపవా
ఆపదమొక్కులవాడా ఆదుకోవా
అశేషజనప్రియా అడగవా నా గూర్చి
అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా అడుగిడు
అనంతశయనా అలకమాను
వడ్డీకాసులవాడా వరమివ్వు
ఏడుకొండలవాడా ఏమిటీ ఏమరపాటు
కదలిరా నా స్వామి కదలిరా
శేషాద్రి నివాసా కదలిరా
కదలి వచ్చి నాకు కనువిప్పు కలిగించు
శాశ్వతమైన నీ సాన్నిధ్యాన్ని ప్రసాదించు

- డా. కె.రమ్య

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

గత సంచిక తరువాయి

''కైకా ఈ సీత వల్కలాలు ధరించరాదు. ఆమె సుకుమారి. అమాయకురాలు. ఎల్లప్పుడూ సుఖాలనుభవించింది. ఇప్పుడూ అలాగే ఉండాలి. వనజీవితం తగదామెకు. కులగురువులు చెప్పింది నిజం. సీత అంటే ఎవరనుకున్నావు? జనక మహారాజ ముద్దులబిడ్డ. పతివ్రత. అలాంటి ఉత్తమ ఇల్లాలు అందరిముందు నార చీరలు కట్టింది. తాపసిలా నిలుచుంది. ఆమె ఎపుడైనా ఎవరికైనా ఏ అపకారమైనా చేసిందా? ముందు ఆ నార చీరలు తీయించు. సీత నారచీరలు ధరించాలని నీ వరాల్లో లేదు. ఆమె అనేక వస్త్రాభరణాలు ధరించాలి''.

''కైకా పాపిష్టిదానా నేనింక బతకను. క్రూరురాలా నీ మాటల వలలో చిక్కుకున్నాను. ఘోరమైన ప్రతిజ్ఞ చేశాను. వెదురుకు ఒక పూవు పూస్తుంది. అది ఆ వెదురునే దహించి వేస్తుంది. అలా నా శపథమే నన్ను దహిస్తోంది. పాపాత్మురాలా రామ వనవాసం అన్నావు. అలా కోరటమే ఒక పాపకృత్యం. నీకు నరకం తప్పదు. ఇంకా సీతమ్మకు నారచీరలు కట్టించావు. అడవులకు పంపిస్తున్నావు. ఇంకెంత ఘోర నరకాల్లో పడతావో – అలా అంతులేని శోకంలో ఆవేశంలో పలికాడు మహారాజు. విలపించాడు. కుమిలిపోయాడు. కింద పడ్డాడు. లేచాడు. కూర్చున్నాడు. తలవంచాడు. నేలకేసి చూస్తూ వుండిపోయాడు.

ఎండ్రకాయ (పీత) – తేలు గర్భం దాల్చుతాయి. అవి పిల్లల్ని కంటాయి. ఆ వెంటనే అవి చనిపోతాయి. అలాగే వెదురు చెట్టు పూస్తుంది. చస్తుంది. అరటిచెట్టు పెరుగుతుంది. పూలు కాయలు కాస్తుంది. ఎండగాలి పోతుంది. చస్తుంది. అలా కొడుకుని పొంది – మరణిస్తాడని దశరథుని భావన.

అడవికి ప్రయాణమవుతున్నాడు రాముడు. అంటున్నాడు దశరథునితో. ''దేవా ధార్మికుడా ఈ యశస్విని మా అమ్మ.

కౌసల్య. వృద్ధురాలు. నన్ను అడవికి పంపుతున్నావు. నీమీద కోపం లేదామెకు. ఎప్పుడూ నిన్ను ఒక్కమాట అనలేదు. ఇప్పుడూ నిన్ను నిందించలేదు. నాకోసం శోకసాగరంలో పడిపోతుంది. ఇలాంటి దుఃఖాన్ని అనుభవించి ఎరుగదు. నా ఎడబాటుతో మృత్యువాత పడుతుందేమో. ఆ ప్రమాదం రాకుండా నువ్వే చూడాలి. నువ్వే ఓదార్చాలి. ఆదరించాలి. నేను లేని కొరత తీర్చాలి''.

విన్నాడు మహారాజు. చూశాడు రాముణ్ణి. ముని వేషధారియై ఉన్నాడు. కళ్ళనిండా నీరు కమ్ముకుంది. స్పష్టంగా చూడలేకపోతున్నాడు. దుఃఖం ముంచుకు వచ్చేసింది. మాట్లాడలేకపోయాడు. తల వంచుకున్నాడు. తెలివి తప్పాడు. అంతలోనే కోలుకున్నాడు. రాముణ్ణి తలచుకుంటూ విలపించాడు.

''పూర్వజన్మలో తల్లితండ్రుల నుంచి బిడ్డలను వేరు చేసి ఉంటాను. ఎన్నో ప్రాణుల్ని హింసించి ఉంటాను. వాటిని దూరం చేసి ఉంటాను. ఆ పాప ఫలితమే ఇపుడు బెడిసి కొట్టింది. కైక ఇంత బాధించినా నాకు చావు రాలేదు. నారచీరలు కట్టారు – సీతారామ లక్ష్మణులు. చూసినా చావు రాలేదు. నా బొందిలో ప్రాణం ఎపుడు పోతుంది? చావు గడియలు ఇంకెప్పుడు వస్తాయి. ఒకరి స్వార్థం ఇంతమంది దుఃఖానికి కారణమైంది''.

అలా ఆలోచిస్తున్నాడు దశరథుడు. కళ్ళు సముద్రాలయ్యాయి. శరీరం వణికిపోయింది. 'రామా' అన్నాడో లేదో గొంతు మూగబోయింది. కొన్ని క్షణాలు గడిచాయి. సుమంత్రుణ్ణిపిలిచాడు. కన్నీళ్ళు కారుతున్నాయి. అంటున్నాడు.

''రాముని ప్రయాణానికి ఏర్పాట్లు చూడు. మంచి రథం తీసుకురా. ఈ మహానుభావుణ్ణి (రాముణ్ణి) ఎక్కించు. జనపదాలు దాటించు. పొలిమేర అవతల వదిపెట్టిరా''.

సత్పురుషులు సద్గుణవంతులైన తమ కొడుకులను కొంతమంది తల్లితండ్రులు వనాలకు వెళ్ళగొడతారు. సద్గుణాలకు ఫలం అదే కాబోలు.

## వస్త్రాభరణాలు

రాజాజ్ఞ పాటించాడు సుమంత్రుడు. బంగారం తాపడంతో ఉంది రథం. ఉత్తమాశ్వాలు కట్టాడు. పగ్గాలు పట్టాడు. తోలాడు. రాజభవనం ముందు ఆపాడు. ధనాధ్యక్షుణ్ణి పిలిపించాడు దశరథుడు. అతడు దేశకాలజ్ఞుడు. పరిశుద్ధుడు. ''సీతకు అమూల్య వస్త్రాలు ఆభరణాలు తీసుకురా. పద్నాలుగేళ్ళు సరిపడేట్లు లెక్కపెట్టు. వెంటనే తెచ్చి ఇవ్వు'' – అది మహారాజు గారి ఆజ్ఞ.

క్షణాల్లో కోశాగారం చేరాడతడు. చక్కగా లెక్కపెట్టాడు. భద్రపరచాడు. తెచ్చాడు. సీతమ్మకు సమర్పించాడు. అక్కడే సువర్ణ మణి భూషణాలు అలంకరించుకుందామె. ధగధగా మెరుస్తున్నాయి అవి. బాలభాస్కరుని కాంతిలా ఆభరణాలు భవనమంతా విరాజిల్లచేశాయి.

మామగారు కోడలిని ఎలా గౌరవించాలో శ్రీరామాయణం చెబుతోంది మనకు. పుట్టింటి నుంచి మెట్టినింటికి వస్తుందామె. ఇంటిపేరు మారిపోతుంది. గోత్రం మారుతుంది. వంశం మారుతుంది. అవసరమైతే పేరు కూడా మార్చబడుతుంది. అయినా అత్తమామలే ఆమెకు అమ్మానాన్నలు. ఈ విషయం సుందరకాండలో తెలుస్తుంది. సీతమ్మ వివరాలు అడగుతాడు హనుమ. అపుడామె ముందుగా మామగారి పేరు చెబుతుంది. భూమండలాల్లోని మహారాజుల్లో ప్రముఖుడు – శత్రుసేనల్ని పరితపింపచేసేవాడు, ప్రజ్ఞాశాలి అయిన దశరథుని కోడలిని అంటుంది. ఆ తర్వాత తన తండ్రి పేరు – భర్త పేరు చెబుతుంది. మామగారిని కోడలెలా గౌరవించాలో సీతమ్మ ద్వారా వాల్మీకి మనకు తెలియజేస్తున్నాడు.

## స్త్రీల స్వభావాలు

బయలుదేరుతున్న మైథిలిని చూసింది కౌసల్య. ఆమెను అక్కున చేర్చుకుంది. నుదురు ముద్దాడింది. అంటోంది ఇలా ''అమ్మా కొందరు స్త్రీలుంటారు. కోరిన కోర్కెలు తీరుస్తున్నంత వరకు భార్యలు భర్తలను గౌరవిస్తుంటారు. కష్టకాలం వస్తే అదే భార్యలు భర్తలను చులకనగా చూస్తారు. దూషిస్తారు. చివరకు వదిలేస్తారు. వాళ్ళు పాపసంకల్పులు. దురాలోచనాపరులు. వారి మనసులు తెల్సుకోవటం కష్టం. చిన్న విషయానికి గొడవ పడతారు. పంతాలకు పోతారు. కోపాలు అలకలు ఎన్నెన్నో వికారాలు పడతారు. వాళ్ళకి కులగౌరవాలతో పని లేదు. చేసిన మేలు మరచిపోయే కృతఘ్నులు. లోక మర్యాదలు పాటించరు. ఎంత విద్య నేర్చినా వాళ్ళలో మార్పు రాదు. వేదమంత్రాలు వింటూ అగ్నిసాక్షిగా పెళ్ళాడిన పెనిమిటిని లెక్కపెట్టరు. వాళ్ళ చిత్తాలు క్షణ క్షణానికి చలిస్తూ ఉంటాయి. అసలు వాళ్ళమీద వాళ్ళకే విశ్వాసం ఉండదు. అభిజాత్యం అహంకారం అధికం. ఎంతసేపూ పాతవి జరిగినవి తవ్వుతూ ఉంటారు. ఏదో ఒక సాకుతో గిలికజ్జాలు పెట్టుకుంటారు. ఎప్పుడూ అబద్ధాలాడుతూ వుంటారు''.

''మరికొందరు స్త్రీలుంటారు. వాళ్ళు సత్యవచనులు. సదాచార సంపన్నులు. గురువులను పెద్దలను గౌరవిస్తూ ఉంటారు. శాంతచిత్తులు. పతియే దైవం. అతడే గతి అంటారు. ఆ సాధ్వీమణులు పరమ పవిత్రులు''.

అమ్మా సీతా నా కొడుకుతో అడవులకు వెడుతున్నావు. వాడిని సదా గౌరవిస్తూ ఉండు. నిర్ధనుడైనా సంపన్నుడైనా రాముడు నీకు పరమ దైవం. వాణ్ణి ఎప్పుడూ అనుసరిస్తూ ఉండమ్మా'' అవి కౌసల్య పలుకులు. అవి ధర్మ సమ్మతాలు. ఆమె చెప్పిన రెండు రకాల స్త్రీలు ఈ కాలంలో కూడా ఉన్నారు.

వినింది సీత. అత్తగారికి చేతులు జోడించింది. అంటోంది ఇలా. ''పూజ్యురాలా నీవు ఆజ్ఞాపించినట్లు ఆచరిస్తాను. నన్ను అనార్యగా చూడకు. తీగెలు లేని వీణ మోగదు. చక్రాలు లేని రథం నడవదు. చంద్రుణ్ణి వెన్నెల విడిచి పెట్టదు. నేనెప్పటికీ ధర్మాన్ని వదలను. ఏ స్త్రీకైనా అమ్మా నాన్నలు పరిమితంగా ఇస్తారు. కొడుకులూ పరిమితంగా ఇస్తారు. భర్త మాత్రం అపరిమితంగా ఇస్తాడు. ఐహిక సుఖభోగాలిస్తాడు. భర్త పట్ల ఎలా నడవాలో మా అమ్మ నాన్నలు బోధించారు. పతివ్రతలైన వారి ఆచరణ తెల్సుకున్నాను. నా భర్త నాకు ప్రత్యక్ష దైవం. నేనాయనని నిర్లక్ష్యం చేయను''.

మైథిలి మాటలు హృదయంగమంగా ఉన్నాయి. కౌసల్య కనుల వెంట కన్నీరు కారింది. అది ఆనంద బాష్పాలో దుఃఖ బాష్పాలో తెలియదు. అడవులకు వెడుతోందని దుఃఖం. సాధ్వీమణిలా పలికిందని ఆనందం కావచ్చు.

చేతిగోర్ల పోటు తీగెలకు తగులుతున్నా వీణ బాగా పలికిందంటాం. చక్రాలకు రాళ్ళు రప్పల దెబ్బలు, బురద అంటుకుంటుంది. రథం మాత్రం బాగా పరిగెత్తింది అంటాం. భర్త ఎంతో శ్రమిస్తాడు. భార్యకి పేరు తెచ్చిపెడతాడు. తీగెలు లేకపోతే వీణకు విలువ ఉండదు. చక్రాల్లేకపోతే రథానికి విలువ లేదు. వాటికి పరస్పర సంబంధం ఉండాలి. అలాగే భార్యా భర్తలకు పరస్పర అనుబంధం వుండాలి. అపుడే అది పవిత్ర బంధమవుతుంది.

అది లౌకికపరమైన వివరణ. ఇక పారమార్థిక పరంగా చూస్తూ ఆడ మగ అందరూ జీవకోటిలోని వారే. జీవుడు పరతంత్రుడు. పరమాత్మ ఒక్కడే సర్వస్వతంత్రుడు. జీవేశ్వరులకు ఉండాల్సిన బంధం మూడు రకాలు అన్నారు పెద్దలు. 1.నేను ఇతరులకు చెందినవాణ్ణి కాదు. పరమాత్మకి చెందినవాణ్ణి. 2. నాకు రక్షణ పరమాత్మ ఒక్కడే. 3. పరమాత్మ నన్ను రక్షిస్తాడని నాకు విశ్వాసం ఉంది. అదే ఆత్మ స్వరూప తత్త్వం. సీతమ్మ మాటల్లో ఆ ఆధ్యాత్మిక తత్త్వం ప్రకటమవుతోంది. రాముడు తల్లికి ప్రదక్షిణ నమస్కారాలాచరించాడు. 'అమ్మా దుఃఖించకు. నాన్నగారిని జాగ్రత్తగా చూసుకో. నీవు నిద్రపోయి మేల్కొనేంతలో పధ్నాలుగేళ్ళు గడిచిపోతాయనుకో' అని రాముని ధైర్యవచనాలు.

తక్కిన 350 మంది తల్లులను చూశాడు. నమస్కరించాడు. అంటున్నాడు 'చిర పరిచయంతో తెలిసో తెలియకో తప్పులు చేసి ఉంటాను. నా అపచారాలన్నింటినీ క్షమించండి'.

విన్నారు అందరూ. శోకోపహతులైనారు. ఏడ్చారు. క్రౌంచ పక్షుల అరుపుల్లా ఉన్నాయి వారి విలాపాలు. నిత్యమూ మృదంగ వాద్యాలతో వీణా నినాదాలతో మారుమోగే భవనం ఏడుపులతో పెడబొబ్బలతో నిండిపోయింది.

## సుమిత్ర

కన్నతల్లిని చూశాడు లక్ష్మణుడు. పాదాభివందనం చేశాడు. కొడుకును లేవనెత్తింది. శిరస్సు ముద్దాడింది. దుఃఖించింది. అంటోంది ఇలా.

**''సృష్టిస్త్వం వనవాసాయ స్వను రక్తః సుహృజ్జనే**
**రామే ప్రమాదం మా కీర్షేః పుత్ర భ్రాతం గచ్ఛతి''**

''వనవాసంలో రాముణ్ణి సేవించు. అందుకే నిన్ను కన్నాను. రాముని మీద నీ అనురాగం అపారం. వాడిని కనిపెట్టుకొని ఉండు. ఏమాత్రం పరాకు పడకు. ప్రమాదం అంటే ఆపద. డేంజర్ అని అర్థం కాదు. సంస్కృతంలో ప్రమాదం అంటే అప్రమత్తత. సావధానుడై ఉండు అని అర్థం. సర్వకాలాల్లో రాముని అనుసరించు. అన్నగారి అడుగు జాడల్లో నడవడం తమ్ముని కర్తవ్యం. అది లోక ధర్మం.

**రామం దశరథం విద్ధి మా విద్ధి జనకాత్మజా ।**
**అయోధ్యాం అటవీం విద్ధి గచ్ఛతాత యథా సుఖమ్ ॥**

రాముడే నీ తండ్రి అనుకో. సీత నీ తల్లి అనుకో. అడవి అయోధ్య అనుకో. నాయనా సుఖంగా పోయిరా — అంది సుమిత్ర.

కోసల నుండి వచ్చింది కౌసల్య. కేకయ దేశానికి చెందింది కైక. సుమిత్ర ఏ దేశం నుంచి వచ్చిందో చెప్పలేదు వాల్మీకి. తన కొడుకు బావుండాలి. ఇతరులూ బావుండాలి — అది కౌసల్య మనస్తత్వం. ఇతరులు నాశనమైనా సరే తన కొడుకు బావుండాలి — అది కైకేయి తత్వం. ఇతరుల కోసం తన కొడుకు పోయినా పర్వాలేదు — అది సుమిత్ర తత్వం. అందుకే తన సర్వ సుఖభోగాల్ని త్యాగం చేశాడు లక్ష్మణుడు. వాటిని భగవదర్పితం చేశాడు. అంతకు మించిన ఐశ్వర్యం ఏముంది? లక్ష్మీవర్ధనుడట లక్ష్మణుడు. అది వాల్మీకి సౌమిత్రికిచ్చిన బిరుదు. నిత్య శత్రుఘ్నుడట శత్రుఘ్నుడు. నిత్య శత్రువులు — అరిషడ్వర్గాలు. వాటిని జయించినవాడట శత్రుఘ్నుడు. అది వాల్మీకి అతనికిచ్చిన బిరుదు. ఇద్దరు కొడుకులని సుమిత్రకి ఒకరిని భగవత్ (రాముని) సేవలో — మరొకణ్ణి భాగవత (భరతుని) సేవలో నియోగించిన గొప్ప ఇల్లాలు సుమిత్ర.

అమ్మ అంటే సుమిత్రలా ఉండాలని వాల్మీకి అభిమతం.

శ్రీరామాయణంలో రామతత్త్వం తెలిసిన స్త్రీ మూర్తుల్లో సుమిత్ర ఒకతె. సాక్షాత్ శ్రీమన్నారాయణుడే నరునిగా (రామునిగా) అవతరించాడని గ్రహించిన జ్ఞాన సంపన్నురాలు సుమిత్ర.

వనవాసంలో లక్ష్మణుని ఏమరుపాటుపడక ఉండాలంది సుమిత్ర. ఎందుకని? రాముడు అందగాడు. అతని నడక కూడా అందంగా ఉంటుంది. నాల్గు రకాలుగా నడుస్తాడట రాముడు. ఒక్కోసారి సింగం – శార్దూలం – మత్తగజం – ఆబోతు నడకల్లాంటి నడకలట. ఆ నడకల సౌందర్యానికి మైమరచిపోతే క్రూరమృగాలు రాముని మీద పడతాయని, రామునికి ఆపద కల్గుతుందని సుమిత్ర భయం. అది రాముని మీద భక్తి పండిన ప్రేమ అని చెప్పాలి.

## ప్రయాణం

సీతారామ లక్ష్మణులు కదిలారు. నడిచారు. రథం ఎక్కారు. సీతమ్మ వస్త్రాలు ఆభరణాలు రథం మీదికి చేర్చబడ్డాయి. రామలక్ష్మణుల వివిధ ఆయుధాలు కవచాలు డాళ్ళు పలుగులు గంపలు వచ్చాయి. అవన్నీ రథం వెనుక భాగంలో పెట్టించాడు సుమంత్రుడు. అతడు పగ్గాలు పట్టాడు. అదిలించాడు గుర్రాల్ని. రథం కదిలింది.

పట్టాభిషేకం చూడవచ్చిన పురజనులు పల్లె ప్రజలు – కొందరు మౌనంగా రోదిస్తున్నారు. కొందరు నిశ్చేష్టులైనారు. రాముని స్నేహితులు మూర్ఛపోయారు. సైనికులు కలత పడ్డారు. కోపంతో ఘీంకరించాయి ఏనుగులు. కట్టుతాళ్ళు తెంచుకున్నాయి గుర్రాలు. పరుగులు తీశాయి. చిన్నా పెద్దా ఆడ మగా ముసలి ముతకా రథం వెంట పడ్డారు. కైకను తిడుతున్నారు. దశరథుణ్ణి దుయ్యబట్టుతున్నారు. ఎండాకాలంలో తప్పికతో చెరువువైపు పరిగెత్తినట్లు అందరూ రథం కేసి పరిగెత్తారు. రథానికి అటు కొందరు, ఇటు కొందరు. తలలు పెకెత్తారు. రాముడు కనిపించలేదు. కొందరు నిట్టూర్చారు. కొందరు కన్నీరు కార్చారు.


''సుమంత్రుడా రథాన్ని నెమ్మదిగా పోనియ్. మేం రాముణ్ణి చూడాలి. కండ్లారా ఇపుడే చూస్తాం. ఇంకెన్నాళ్ళకో రామ దర్శన భాగ్యం'' అని ప్రజల కేకలు. పరస్పరం ఇలా చెప్పుకుంటున్నారు వాళ్ళు.

''కైక హృదయం ఇనుములా కఠినం''

''ఆమెది రాతి గుండె''

''వైదేహి ధర్మాత్మురాలు. నీడలా రామునితో పోతోంది''

''ఔను సీతమ్మ నిజంగా ధన్యురాలు''



''లక్ష్మణుడూ ధన్యుడే. రాముణ్ణి సేవించే భాగ్యం దక్కింది''

''ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో సౌమిత్రిది''

''లక్ష్మణునికి ఇక జన్మ లేదు. మోక్షమే''

అని ప్రజలు పలుకులు. అందరూ ఏడుస్తున్నారు.

అక్కడ దశరథుడు దీనుడై ఉన్నాడు. చుట్టూ అంతఃపురాంగనలు బిగ్గరగా ఏడుస్తున్నారు. దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు రాజు. 'రాముణ్ణి చూస్తాను' అన్నాడు.

లేచాడు – నడిచాడు. భవనం బయటకు వచ్చాడు.

మత్తగజాన్ని వేటగాడు బంధించాడు. ఆడ ఏనుగులు గీ పెట్టి ఏడుస్తున్నాయి. అలా ధర్మపాశ బద్ధుడైనాడు దశరథుడు. స్త్రీల రోదనలు విన్నాడు దశరథుడు. రాహుగ్రస్తుడైన పూర్ణచంద్రునిలా ఉన్నాడు.

దూరం నుంచి తండ్రిని చూశాడు రాముడు. రథాన్ని త్వరగా తోలమన్నాడు సుమంత్రుణ్ణి.

ఆపు – అంటున్నారు ప్రజలు. అడ్డుపడుతున్నారు. వేగంగా రథాన్ని నడపలేకపోతున్నాడు సుమంత్రుడు. ఆపలేకపోయాడు. నెమ్మదిగా పోనిస్తున్నాడు.

రథచక్రాల తాకిడికి దుమ్ము రేగుతోంది. ప్రజల కన్నీరు నేలని తడిపింది. దుమ్ము అణగిపోయింది. రథం వెంట పరిగెడుతున్న జన సమూహాన్ని చూశాడు దశరథుడు. వారి హాహా కారాలు విన్నాడు. మొదలు నరికిన చెట్టులా కుప్పకూలి పోయాడు. చూశారు కొందరు.

'మహారాజా!' అది కొందరి గొంతుకలు.

'రామా' — మరికొందరి మాటలు. తల్లితండ్రుల్ని చూడు అన్నట్లున్నాయి వారి కేకలు.

'కౌసల్యా' — ఇంకొందరి అరుపులు. భర్తను కొడుకుని చూడమన్నట్లున్నాయి. అంతఃపుర వాసుల ఆక్రందనలు, ప్రజల రోదనలు — అన్నీ మిళితమైనాయి. మిన్నుముట్టాయి.

వెనక్కి తిరిగి చూశాడు రాముడు.

అమ్మానాన్నలను గమనించాడు. విషాదవదనులై ఉన్నారు. భ్రాంత చిత్తులై ఉన్నారు. తమవైపు పరిగెడుతున్నారు. ధర్మపాశ బద్ధుడైనాడు రాముడు. కట్టివేసిన గుర్రపు పిల్ల తల్లిని చూడలేనట్లు సూటిగి వాళ్ళని చూడలేకపోయాడు.

తల్లితండ్రులు ఎప్పుడేగాని దుఃఖం ఎరుగరు. ఎప్పుడూ వాహనాలపై తిరిగేవారు. ఈరోజు పాదచారులైనారు. పరుగెడుతున్నారు. అంకుశం పోటుకు తల్లడిల్లే ఏనుగులా బాధపడ్డాడు రాముడు.

''రథం వేగంగా పోనియ్'' అది సుమంత్రునికి హెచ్చరిక.

కట్టివేసిన దూడకోసం ఆవు పరిగెత్తినట్లు రాముడి కోసం పరుగు తీసింది కౌసల్య.

''రామా సీతా లక్ష్మణా'' - పిలిచింది. గట్టిగా కేకలు వేసింది. పరుగిడలేకపోయింది. సొమ్మసిల్లిపోతోంది.

''ఆపు రథాన్ని ఆపు'' — గొంతెత్తి అరచాడు దశరథుడు.

''శీఘ్రంగా పోనియ్'' అంటున్నాడు రాముడు.

రెండు రథ చక్రాల మధ్య పడ్డట్లయింది సుమంత్రునికి. రాజాజ్ఞ — రామాజ్ఞ — ఎవరిది పాటించాలో దిక్కుతోచలేదు.

''సుమంత్రా రాజుగారు అడిగితే మీ మాట వినపడలేదని చెప్పు. ఎందుకంటే ''చిరం దుఃఖస్య పాపిష్ఠమ్'' — దుఃఖిస్తున్న వారిని ఎక్కువసేపు చూసి సహించలేను''.

రాముని మాట విన్నాడు సుమంత్రుడు. త్వరగా పోనివ్వాలనుకున్నాడు. ప్రజలకి నచ్చచెప్పాడు. వేగంగా తోలాడు. **(సశేషం)**

Statement about ownership and other particulars about **SRI VENKATESAM** (Monthly)

# FORM IV

See Rule 8

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | H.No.1-1-53, Street No.1, Habsiguda, Hyderabad - 500 007 |
| 2. Periodicity of it's Publication | : | Monthly |
| 3. Editor | : | **PULLAGURLA SAI REDDY** |
| 4. Printer's Name | : | **PULLAGURLA SAI REDDY** |
| Whether Citizen of India | : | Yes |
| Address | : | H.No.1-2-63/10/1, (Plot no.9/3, M-block) Kakatiya Nagar, Habsiguda, Hyderabad - 500 007. |
| 5. Editor's and Publisher's Name | : | PULLAGURLASAI REDDY |
| Whether Citizen of India | : | Yes |
| Address | : | H.No.1-2-63/10/1, (Plot no.9/3, M-block) Kakatiya Nagar, Habsiguda, Hyderabad - 500 007. |
| 6. Name and Address of Owner | : | PULLAGURLASAI REDDY H.No.1-2-63/10/1, Kakatiya Nagar,Habsiguda, Hyderabad - 500 007. |

I P.Sai Reddy, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

HYDERABAD
Date : 1-03-2022

**(Sd.) P. SAIREDDY**
Signature of the Publisher

ధారావాహికం



(స్కాంద పురాణాంతర్గతం)

# శ్రీ వేంకటాచల మాహాత్మ్యం

డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

గత సంచిక తరువాయి

## నేను తీర్థయాత్ర చేయాలి :

పూర్వం పాండవులు స్వయంవరంలో ద్రౌపదిని పొంది ధృతరాష్ట్రుని ఆజ్ఞచే హస్తినాపురికి వెళ్ళారు. అక్కడ భీష్ముడు, ధృతరాష్ట్రుడు దుర్యోధనాదులతో కలిసి ఐదు సంవత్సరాలు ఉన్నారు. ఆ తరువాత భీష్మాదుల సలహా మేరకు ధృతరాష్ట్రుడు కుల పెద్దలందరి సమక్షంలో కృష్ణభగవానుని ముందిడుకొని పాండుపుత్రులకు అర్ధరాజ్యాన్ని, ఖాండవ ప్రస్థాన్ని ఇచ్చాడు. పాండవులు ధృతరాష్ట్రుడు మొదలైన కురువృద్ధుల వద్ద సెలవు తీసుకుని శ్రీకృష్ణునితో కూడ ఖాండవ ప్రస్థానికి వెళ్ళారు. విశ్వకర్మ నిర్మించిన ఇంద్రప్రస్థ పురంలో ధర్మరాజు తమ్ములతో కూడ ఉంటూ రాజ్యాన్ని పరిపాలించాడు. శ్రీకృష్ణుడు తన నగరానికి వెళ్ళిన తరువాత నారద మహర్షి ఆజ్ఞతో ద్రౌపది విషయంలో ఒక నియమాన్ని చేసుకున్నారు. ఆ నియమం ప్రకారం ద్రౌపది ఒక్కొక్క సంవత్సరం క్రమంగా పాండవులలో ఒక్కొక్కరి గృహంలో ఆదరంతో ఉండాలి. ఆమె ఒకరి గృహంలో ఉండగా, మరొకరు ఆమెను చూస్తే వారు ఒక సంవత్సరం వరకు తీర్థయాత్రలు చేయాలని ప్రతిజ్ఞ చేసుకున్నారు. ఈ విధంగా పాండవులు నియమాలను ఏర్పరచుకొని లోక వ్యవహారాలలో జాగరూకులై కాలం గడుపుతున్నారు.

ఇలా ఉండగా ఒకనాడు ఒక జానపదుడైన బ్రాహ్మణుడు రాజగృహ ప్రాంగణానికి వచ్చి 'నా ఆవును దొంగలు దొంగిలించా'రని అనేక విధాలుగా రోదించాడు. అప్పుడర్జునుడు అతనిని ఓదార్చి, ఆయుధాలను తీసుకు రావడానికి తొందరగా ఆయుధాగారంలో ప్రవేశించాడు. ఆ సమయంలో అక్కడ ద్రౌపది, ధర్మరాజు కూర్చుని ఉన్నారు. అర్జునుడు తన ప్రతిజ్ఞ తెలిసి కూడా అంబుల పొదితో కూడిన తన ధనుస్సును తీసుకున్నాడు. దొంగలను సంహరించి ఆవును తోలుకొని వచ్చి దానిని ఆదరంతో బ్రాహ్మణునికిచ్చాడు. ఆ తరువాత ధర్మరాజు వద్దకు వెళ్ళి ఆయనతో 'మనం ఏర్పరచుకొన్న నియమాన్ని నేను ఉల్లంఘించాను కాబట్టి తీర్థయాత్ర చేయవలసి ఉన్నది' అని చెప్పాడు.

అప్పుడు సకల శాస్త్ర విశారదుడైన ధర్మనందనుడు ఆదరంతో అర్జునుని 'గోవుల కొరకు, బ్రాహ్మణుల కొరకు అబద్ధం చెప్పినా, కూడని పని చేసినా అది సత్యం, ధర్మమే

అవుతుంది. బ్రాహ్మణుని కొరకు, గోవు కొరకు నీవు చేసిన పని పాపమెలా అవుతుంది? ప్రజాపాలన విషయంలో దొంగలనుపేక్షిస్తే రాజుకు బ్రహ్మహత్యా పాతకం వస్తుంది. దొంగలను శిక్షించటం వలన అశ్వమేధ యాగఫలం లభిస్తుంది. శత్రువులు బలవంతులని తెలిసి తన ప్రజలకు బాధలు కలిగించే చోరులు మొదలైన దుర్మార్గులను శిక్షించని రాజు శుభాలను పొందదు. నీవు క్షత్రియులమైన మనకు, లోకానికి కూడా హితకరమైన మంచి పనినే చేశావు. కావున నీకు దోషం రాదు' అన్నాడు.

**పిన్నల నియమాలను పెద్దలు గౌరవించాలి :**

అంతట ధర్మవర్తనుడైన అర్జునుడు చేతులు జోడించి 'రాజా! మీరీవిధంగా మీ ప్రతిజ్ఞను అతిక్రమించి మాట్లాడవద్దు. మీరు ధర్మసారాన్ని బాగా ఎఱిగినవారు. రూపు దాల్చిన ధర్మమూర్తి. మంచి-చెడు తెలిసినవారు. సమర్థులైనవారు తాము ముందు చేసిన ప్రతిజ్ఞను అతిక్రమించరాదు. బంధువుల ఆనతిని, గురుని ఆజ్ఞను, తాము ముందు ఏర్పరచుకొన్న నియమాన్ని, ధర్మాన్ని వీడటం దుర్బలులు చేసే పని. పూజ్యులైన మీరు నన్ను దయతో తీర్థయాత్రల నుండి మరలిస్తే, నన్ను గూర్చి ప్రతిజ్ఞ నుల్లంఘించిన వాడినని లోకులు పలికే నిందలను ఎవరు అడ్డగిస్తారు? తీర్థయాత్రలు చేయాలని నా మనస్సు మిక్కిలి ఉవ్విళ్ళూరుచున్నది.

అదీగాక, నారదుని ఆదేశాన్ని పాటించాలి కదా! కావున మహారాజా! నా తీర్థయాత్ర ప్రయత్నం కొనసాగేటట్లు నన్ను అనుగ్రహించు. తమ ననుసరించి జీవించే వారి నియమాలను పెద్దలు గౌరవించాలి కదా!' అని ప్రార్థించి అర్జునుడు ధర్మరాజు వద్ద, తక్కిన అన్నదమ్ములు వద్ద సెలవు తీసుకొని నమస్కారంతో, వినయంతో అన్నను సంతోషపెట్టి, భీమసేనాది సోదరులకు ఉచితరీతిని వీడ్కోలు చెప్పి, పూజ్యులైన బ్రాహ్మణోత్తముల మంగళాశీస్సులు పొంది తీర్థయాత్రలకు బయలుదేరాడు. పౌరాణికులు, జ్యోతిష్కులు, వైద్యులు, బ్రాహ్మణోత్తములు, సేవకులు, శిల్పులు, సూతులు (రథం నడిపేవారు), స్తోత్రపాఠకులు అతని వెంట వెళ్ళారు. ధర్మరాజు ఆజ్ఞతో స్నేహితులు, కోశాధికారులు, నాగరికులు వారి అవసరాలకు, ఇతరులకు దానం చేయడానికి కావలసినంత ధనాన్ని తీసుకుని అర్జునుని వెంట వెళ్ళారు.

**తీర్థక్షేత్ర సందర్శనం :**

అర్జునుడు మొదట గంగానదికి వెళ్ళి గంగాద్వారం, ప్రయాగ, వారణాసిలను సేవించాడు. తీర్థాలు దర్శిస్తూ జాహ్నవి నదీ తీరంలోని సమీప మార్గంలో మిక్కిలి ఎత్తుగా విజృంభిస్తున్న తరంగాలు గల తూర్పు సముద్రాన్ని, మహాపవిత్రమైన మహానదిని, ప్రసిద్ధమైన జగన్నాథ క్షేత్రాన్ని దర్శించి, సింహాచలం చూచి కృతకృత్యుడయ్యాడు. ఆ తరువాత సకల పాపాలను పోగొట్టే పవిత్ర గోదావరి నదిని దర్శించి. దానిలో యథావిధిగా స్నానం చేసి, భూదాన-సువర్ణ దానాదులతో జనులను సంతృప్తి పరచి, మలాపహమనే పేరుగల పవిత్రనదిని చూచి సంతోషించాడు. ఆ తరువాత కృష్ణవేణిని దర్శించి, శివునికి నిత్య నివాసమైన, నాలుగు ద్వారాలతో కూడిన శ్రీశైలాన్ని దర్శించాడు. ఆపైన పినాకిని నదిని దాటి దేవతలు, ఋషులచే సేవించబడుతున్న నారాయణునికి ప్రియ నివాసమైన శ్రీవేంకటాచలాన్ని దర్శించి, ఆ ఎత్తైన పర్వత శిఖరంలో నున్న సర్వలోక నాయకుడైన శ్రీనివాసుని మంగళ కార్యసిద్ధికై భక్తితో పూజించి, ఆ పర్వత శిఖరాన్ని దిగి ముని సమూహాలచే సేవించబడుతున్న, అగస్త్య మహర్షిచే తీసుకుని రాబడిన సువర్ణముఖరి నదిని దర్శించాడు. ఆ విధంగా తీర్థాలన్నింటిని సేవించి వచ్చిన అర్జునునికి ఆ మహానది చాలా సంతోషాన్ని కలిగించింది.

**శ్రీకాళహస్తీశ్వర సేవ :**

అర్జునుడు తీరాల మధ్య ప్రవహించే ఆ సువర్ణ ముఖరి నదికి తూర్పున శ్రీకాళహస్తి అనే ఎత్తైన పర్వతాన్ని చూచాడు. ఆ పర్వతం మిక్కిలి ఎత్తైన తన శిఖరాల అంచులతో ఆకాశమండలాన్ని రాచుకుంటూ ఏడు పాతాళ లోకాల క్రింద స్థిరమైన పునాదిరాళ్ళు కలిగి ఉంది. అర్జునుడు సువర్ణముఖరిలో స్నానం చేసి, ఆ పర్వతంపై దేవతలచే పూజించబడుతున్న శ్రీకాళహస్తీశ్వరుని దర్శించి, భక్తితో ఆ పార్వతీపతియైన మహాదేవుని పూజించి కృతార్థుడయ్యాడు.

ఆ తరువాత అద్భుతమైన ఆ పర్వతంలో ఇంతకు ముందెప్పుడూ కని విని ఎరుగని విశేషాలను చూడాలనే కుతూహలంతో ఆ పర్వతంపై సంచరించాడు. ఆ గిరి సానువులలో నివసిస్తూ తమ స్త్రీలతో పాటు ఆ దేవదేవుని చరిత్రను గానం చేస్తున్న సిద్ధులను చూచాడు. అప్సరాంగనలతో కూడి పూలలోని మధువును త్రాగి, మదించి పూపొందరిండ్లలో కూర్చున్న గంధర్వులను ఆసక్తితో తిలకించాడు. జనసంచారం లేని ప్రదేశాలలో శివధ్యాన పరాయణులై ఆనందిస్తున్న దివ్యయోగులను దర్శించాడు. మిక్కిలి ప్రశాంతంగా ఉన్న ఆశ్రమ ప్రదేశాలను, అక్కడ బలులకై వేసి నీవార ధాన్యంతో శోభిల్లుతున్న ద్వార ప్రదేశాలను చూశాడు. నిరాహారులై, వాయుభక్షకులై ఆకులను, ఎండను మాత్రమే స్వీకరిస్తూ ప్రశాంతచిత్తులై జితేంద్రియులైన మునీశ్వరులను దర్శించాడు. వికసించిన

సౌగంధిక పుష్ప పరిమళంతో గుబాళిస్తున్న దిగంతాలు కల సరస్సులు అర్జునునికి సంతోషాన్ని కలిగించాయి. అతడు వేటయందాసక్తి కలిగి, ధనుస్సులను ఎక్కుపెట్టి సంచరిస్తూ, మృగాలను వెదుకుతున్న, స్త్రీలతో కూడిన కిరాతులను చూచాడు.

## 12.భారద్వాజ మహర్షి వృత్తాంతం :

### భరద్వాజాశ్రమం :

అర్జునుడు ఆ తరువాత సుందరమైన ఆ పర్వతానికి దక్షిణ దిక్కున భరద్వాజాశ్రమాన్ని చూచాడు. అది అరటి, కొబ్బరి, మామిడి, రేగు, సంపంగి, చందన వృక్షాలతోను, తక్కోల, అశోక, గిరకతాడి, తాడి, మొగలి, దానిమ్మ, నేరేడు, కడిమి, ఇందుగ, చంద్ర, ఏరుమద్ది, పాటలి వృక్షాలతోను, పొన్న, సురపొన్న, సరివి, దేవదారు, కానుగ వృక్షాలతోను, లవంగతీగెలు, మాధీపల వృక్షాలు, రాచ ఉసిరి, ప్రేంఖణపు చెట్లు, ఎఱ్ఱగోరింట, తాండ్ర, మారేడు, రావి, ఇప్ప, జువ్వి, పోక, నిమ్మ, నారింజ, వేప, ఉసిరి, గుగ్గిల వృక్షాలతోను శోభిల్లుతున్నది. ఇంకా అనేక రకాల పూలు, పళ్ళు సమృద్ధిగా ఉండే వృక్షాలతో విరాజిల్లుతున్నది. అడవి మొల్ల, మల్లె మొదలగు తీగెలతో అలముకొని ఉంది. అపూర్వమైన సౌరభంతో ఆకర్షించబడిన తుమ్మెదలు ఆ ఆశ్రమమంతా వ్యాపించి ఉన్నాయి. చక్రవాకాలు, కొంగలు, క్రౌంచపక్షులు, హంసలు, కన్నెలేడి పక్షులు సంచరిస్తున్నాయి. చెంగల్వ, నల్లకలువ, తామర, తెల్లకలువల సముదాయాలతో వెలుగొందుతూ అమృతాన్ని స్రవింపచేసే మిక్కిలి మధురమైన నీరు గల సరస్సులున్నాయి. లక్ష్మీపతికి ఉనికిపట్టైన ఆ ప్రదేశం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది.

సింహాలు, ఏనుగులు, పెద్దపులులు, సివంగులు, నల్లచారల దుప్పులు, తెల్లని వెంట్రుకలు – మెత్తని చర్మము గల లేళ్ళు,పరస్పరం అనురాగంతో మెలిగే ఇతర మృగాలక్కడ సంచరిస్తున్నాయి. అక్కడ కుబేరుని ఉద్యాన వనాన్ని, ఇంద్రుని నందనవనాన్ని కూడ తలదన్నే ఉద్యానవనాలున్నాయి. అక్కడి వాతావరణం మాటలతో చెప్పనలవికాని, మనస్సున కందని పరమానందం కలిగిస్తున్నది. ఆ ఆశ్రమంలోని చిలుకలు తమ పిల్లలకు మధురవాక్కులతో దివ్యమైన శైవాగమ శాస్త్రార్థాలను బోధిస్తున్నాయి. ఆకాశం అగ్నిహోత్ర ధూమంతో నల్లగా ఉంది. అది చూచి అక్కడి నెమళ్ళు అకాలంలో వచ్చిన మేఘాలని భ్రాంతి పడుతున్నాయి. అక్కడి ఏనుగులు తమంత తాముగా వచ్చి విహరించి అలసిపోయిన సింహాల శరీరాలపై తమ తొండాలతో చల్లని నీటిని చల్లుతూ వాటి అలసటను పోగొడుతున్నాయి. అటువంటి ఆశ్రమాన్ని చూచి అర్జునుడు విస్మయం చెందాడు. ఆ తపోధనుల ప్రభావాన్ని ప్రశంసించాడు.

అర్జునుడు తన వెంట వచ్చేవారిని అక్కడే ఉండమని స్నేహితులతోను, బ్రాహ్మణ శ్రేష్ఠులతోను ఆ ఆశ్రమంలోకి ప్రవేశించాడు. అక్కడ ప్రజ్వరిల్లుతున్న అగ్నిహోత్రం వలె అమిత తేజశ్శాలియైన భరద్వాజ మహర్షిని దర్శించాడు. ఆయన చుట్టూ అనేక మంది ముని శ్రేష్ఠులు కూర్చుని ఉన్నారు. ఆయన ఒళ్ళంతా విభూతి పూసుకుని, జింకచర్మాన్ని ధరించి నూతన మేఘాలతో కూడిన కైలాస పర్వతం వలె ప్రకాశిస్తున్నాడు. బంగారు కాంతితో ప్రకాశిస్తున్న జడలు వ్రేలాడుతున్నాయి. ఆయన మెరపు తీగలతో నిండిన శరత్కాల మేఘం వలె విరాజిల్లుతున్నాడు. వేదాలు, స్మృతులు, పురాణాలు అన్నీ ఏకమై రూపు దాల్చినట్లున్న ఆ తేజోమూర్తి దివ్యజ్ఞానానికి నిలయమై భాసిస్తున్నాడు. ధైర్యం, ఓర్పు, దయ, తృప్తి, శాంతి మొదలగు సద్గుణాలు గాఢానురాగం గల స్త్రీల వలె ఆయన్ని నిత్యం సేవిస్తున్నాయి. ఆయన అఖండ బ్రహ్మవర్చస్సుతో వెలిగిపోతున్నాడు. అర్జునుడు నెమ్మదిగా ఆయనను సమీపించి, ఆయన పాదాల ముందర నేలపై పడి ఆయన పాదపద్మాలకు సాష్టాంగ నమస్కారం చేశాడు.

### భరద్వాజుని ఆతిథ్యం :

ఆ విధంగా నమస్కరించిన అర్జునుని లేవనెత్తి భరద్వాజ మహర్షి ఆనందంతో ఉప్పొంగిన మనస్సుతో ఆశీర్వదించాడు. ప్రియమైన ఆ అతిథిని అర్ఘ్య పాద్యాదులతో యథోచితంగా సత్కరించి, కూర్చోవడానికి ఆసనాన్ని చూపించాడు. అర్జునుడు కూర్చున్న తరువాత కుశల ప్రశ్నలడిగాడు. అర్జునుడు కూర్చున్న తరువాత ప్రశ్నలడిగాడు. అర్జునుడు ఆ విధంగా భరద్వాజుని ప్రియవాక్యాలు విని సంభాషణలతో ఆయనకు ఆనందాన్ని చేకూర్చాడు. ఆ తరువాత భరద్వాజ మహర్షి కోరిన కోరికల నిచ్చే కామధేనువును స్మరించాడు. ఆ ధేనువు వారందరికీ భక్ష్య భోజ్యాది సురుచిరమైన ఆహారాన్ని ఏర్పాటు చేసింది. అర్జునుడు తన పరివారంతో కూడా తృప్తిగా భుజించి, ఆ తపోనిధిని సేవించి, ఆ రోజంతా సత్కథా శ్రవణంతో గడిపాడు. అనంతరం సాయంసంధ్య నుపాసించి, అగ్నికార్యాన్ని నిర్వర్తించి బ్రాహ్మణులు, మంత్రులతో పాటు భరద్వాజుని పర్ణశాలకు వెళ్ళాడు. భరద్వాజ మహర్షి వారందరినీ ఆశీర్వదించాడు. ఆ నది నుండి వచ్చే చల్లని గాలులతో ఆ ప్రదేశం ఆహ్లాదకరంగా ఉంది. ఈ గొప్ప నదిని భూలోకానికి ఎవరు తీసుకొచ్చారు? ఈ పర్వతం కంటె కూడా దీనికి అధిక ప్రభావం ఎలా వచ్చింది? అని ఆ నదీ ప్రభావాన్ని

మహర్షి నడికి తెలుసుకోవాలని అర్జునుడు అనుకొన్నాడు.

సాయంకాల విధులను నిర్వర్తించి అగ్నిహోత్రుని వలె ప్రకాశిస్తూ సుఖాసీనుడై ఉన్న భరద్వాజ మహర్షికి నమస్కరించి అర్జునుడు ఆయన చల్లని అనుగ్రహామృతంతో ఆనందిస్తూ మిక్కిలి వినయంతో గంభీరంగా 'ఓ మునిపుంగవా! మీరు నన్ను తమ పుత్రుని వలె ఆదరించటం వలన ఈ లోకంలో నేనొక్కడినే ధన్యుడను. మీ ఆదరం వలన కలిగిన కుతూహలం తమ అమృత తుల్యమైన దివ్య వాక్కులను గ్రోలవలెనని నన్ను తొందర పెడుతున్నది. మహాత్మా! ఈ నది ఏ పర్వతంలో పుట్టింది? ఎవరిచే కొని రాబడింది? ఈ నదిలో స్నానమాచరిస్తే, దానం చేస్తే ఎటువంటి పుణ్యం లభిస్తుంది? దీని ప్రభావాన్ని, పుట్టుకను నాకు దయతో తెలియజేయండి. భక్తులను అనుగ్రహించటమే తమ కర్తవ్యం కదా'' అన్నాడు.

ఈవిధంగా అడిగిన అర్జునుని మాటలు విని వాక్య విశారదుడైన భరద్వాజ మహర్షి అతని ముఖంలో ముఖం పెట్టి 'మహాబాహూ! అర్జునా! నీతో కురువంశం పవిత్రమైంది. నీవు ధర్మపుత్రుని సోదరుడ వవటం వల్ల నాకు మిక్కిలి గౌరవనీయుడవు. నేను చాలామంది రాజులను చూశాను కాని నీవలె ఋజువర్తన, దయ, ఔదార్యం, ధైర్యం, గాంభీర్యం కలవారెవరూ లేరు. లోకంలో గొప్ప కులం, విద్య, ధనం బలవంతులకు మద కారణాలవుతున్నాయి. నీవంటి యోగ్యులకు అవి వినయాన్ని కలిగిస్తున్నాయి. గొప్ప రాజభోగాలున్నప్పటికీ వికారాలకు వశం కాకుండా నీవు తప్ప ఎవరుంటారు? అర్జునా! లోకోత్తరమైన నీ అద్భుత గుణాలకు నేను వశమయ్యాను. కుతూహలం కల నీకు చెప్పరాని దేముంటుంది? రాజా! నేను మునుల వలన వినిన దివ్యమైన కథను చెబుతాను విను. దీనిని వినటం వలన సకల ప్రాణులు పాప విముక్తులవుతారు' అంటూ ఇలా చెప్పసాగాడు.

(సశేషం)

# తిలా పాపం తలా పిడికెడు

- శ్రీమతి వెలమకన్ని పద్మావతి

శనికి ప్రీతికరమైనవి తిలలు. శనికి ప్రాణప్రదమైనది తిలతైలం. శనిగ్రహ ప్రీతి కోసం తిలదానం, తైలాభిషేకం చేయాలంటారు.

**తిలదాన మఖిలదానం**
**బుల కంటె విశిష్ట మెల్ల మునులును నియతిం**
**దిల లర్హములగు పాత్రం**
**బుల కిచ్చియ కాదె పెంపు పొందిరి**
**– మహాభారతం**

శనివారం నాడు కాని, శని త్రయోదశి నాడు గాని శనికి ప్రీతికరంగా తిలదానం కావించడం లోకరీతి. బ్రాహ్మణులు ఏ దానమైనా స్వీకరిస్తారు కాని తిలదానం పట్టడానికి భయపడతారు. పూర్వకాలంలో ఒక రాజుకి ఏలిన నాటి శని పట్టింది. పుట్టెడు నువ్వులు రాశిగా పోసి దానిపై బంగారపు శని విగ్రహాన్ని ప్రతిష్ఠించి, దానం పట్టడానికి కావలసిందని బ్రాహ్మణులను ఆహ్వానించాడు. దానం పట్టడానికి వచ్చిన బ్రాహ్మణులలో ఎవరు చేయి జాపినా శని విగ్రహం కత్తి ఝళిపించేది. బ్రాహ్మణులు జంకారు. అప్పుడు రాజా వారి వంట బ్రాహ్మణుడు దానం పట్టడానికి చేయా జాపాడు. శని విగ్రహం కత్తి ఎత్తింది. ఒక వేలు చూపించి, "నేను ఒక రోజు సంధ్యావందనం చేసిన ఫలితం ధారపోస్తున్నాను'' అన్నాడు. శని విగ్రహం మరల కత్తి ఝళిపించింది. అతడు రెండు వేళ్ళు చూపించి "రెండు రోజుల జప ఫలం ధారపోస్తున్నాను'' అన్నాడు. మూడవసారి దానం పట్టడానికి బ్రాహ్మణుడు చేయి చాపాడు. శని విగ్రహం మరల కత్తి ఎత్తింది. ''మూడు రోజుల గాయత్రీ మహామంత్ర ఫలం ధారపోస్తున్నాను'' అన్నాడు బ్రాహ్మణుడు. శని విగ్రహం కత్తిని పారవేసింది. బ్రాహ్మణుడు నిర్భయంగా రాజు నుండి తిలదానం పట్టాడు. అచ్చట చేరిన వేలాది బ్రాహ్మణులకు గుప్పెడు గుప్పెడు నువ్వులు తీసి –

**"తిలాః పాప హరాన్నిత్యం**
**తలా పిడికెడు పిడికెడు''**

అంటూ వారికి పంచిపెట్టాడు. చివరకు మిగిలిన బంగారు శని విగ్రహాన్ని తాను తీసికొన్నాడు. ఈ కథను అనుసరించే ''తిలా పాపం తలా పిడికెడు'' అన్న సామెత ఏర్పడింది. జపసిద్ధి పొందిన వ్యక్తి మాత్రమే తిలదానం పట్టడానికి అర్హుడు అన్న విషయం నిరూపితమయ్యింది.

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

సేకరణ : కె.వి.రాఘవాచార్యులు

గత సంచిక తరువాయి

## 133. ధనుష్మతే నమః

వైష్ణవ ధనుస్సును కల్గి యున్నవాడు – పరశురాముడు.

శ్రీరాముడు శివ ధనుస్సును విరిచి, సీతను వివాహమాడినాడు. శివ ధనుర్భంగమును గూర్చి వినిన పరశురాముడు కోపముతో మిథిలానగరమునకు వచ్చి శ్రీరాముని దర్శించి, తన గురువు శివుని విల్లు విరిచినందుకు కోపముతో తన వైష్ణవ ధనుస్సును ఎక్కుపెట్టి నీ బలమును ప్రదర్శింపుమని శ్రీరాముని ఆదేశించగా, తన వైష్ణవ ధనుస్సును చేతితో స్వీకరించుచు శ్రీరాముడు పరశురాముని తేజస్సుని స్వీకరించినాడు. అపుడు శ్రీరాముడు సాక్షాత్ విష్ణువు అవతారమని గుర్తించిన పరశురాముడు శ్రీరాముని ఆశీర్వదించి, సంతోషముతో తన నివాసమును చేరినాడు. నాటినుండి, పరశురాముని వైష్ణవ ధనుస్సు శ్రీరాముని చేతిలో ఉన్నది. ధనుర్ధారి అయిన పరశురామునిగ అవతరించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 134. బ్రహ్మవిత్తమాయ నమః

బ్రహ్మజ్ఞాన సంపన్నులలో శ్రేష్ఠుడు. వేదములు అనంతములు. ''అనంతా వై వేదాః'' అన్నట్లు వేదములందలి జ్ఞానము సంపూర్ణముగ తెలియుటకు మానవులకు సాధ్యము కాదు. పరమాత్మ సర్వజ్ఞుడు కనుక వేదములు అన్నింటి యొక్క తత్వమును, స్వరూప జ్ఞానమును ఎరుంగును కనుక బ్రహ్మవిత్ అని పిలువబడినాడు. బ్రహ్మ యథావత్ వేత్తిః బ్రహ్మవిత్ – బ్రహ్మణు –వేదములనుయథావిత్ – ఉన్నది ఉన్నట్లుగా తెలిసియుండువాడు – విష్ణుదేవుడు.

వేదై శ్చ సర్వైరహమేవ వేద్యో వేదాంత కృత్ వేదవిదేవ చాహమ్ ॥ – వేదముల ద్వారా తెలియబడే పరతత్త్వము నేనే. ఆ తత్త్వ జ్ఞానమును కలిగించేవాడను నేనే. వేదములను సమగ్రముగా తెలిసినవాడను నేనే అని గీతాచార్యుని మాట.

ఆద్యంతాలు లేని వేదాన్ని దేవతలు, ఋషులు తెలిసికొనలేరు. ఆ నారాయణుడొక్కడే ఎరిగినవాడు అని మహాభారతం విష్ణువే బ్రహ్మవిత్ అని కీర్తించింది.

పరమాత్మను బోధించు వేదము గూడ బ్రహ్మ పదముచే బోధింపబడును. వేదములందలి జ్ఞానము బ్రహ్మజ్ఞానము అనబడుచున్నది.

బ్రహ్మజ్ఞాన సంపన్నులలో శ్రేష్ఠుడగు విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

శ్రీవిష్ణు సహస్ర నామములలో బ్రహ్మవిత్ అను నామము 671 సంఖ్యతో ఉన్నది.

**135. అత్యుదగ్రాయ నమః**

మహాభయంకరుడైన ఉగ్రుడయిన పరశురామునికి నమస్కారము.

పరశురాముడు సర్వ క్షత్రియ సంహారమూర్తి కనుక ఉగ్రుడు అనబడినాడు.

ఉగ్ర స్వరూపుడైన పరశురామునిగా అవతరించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

వినా వేంకటేశం న నాథో న నాథః
సదా వేంకటేశం స్మరామి స్మరామి



అన్ని నామాలూ నీవే అయిన
ఓ వేంకటేశా! నీకు నమస్కారము

## 136. సమగ్రాయ నమః

సర్వగుణ సంపూర్ణుడు శ్రీరాముడు. శ్రీరాముడు దయ, ఔదార్యము మున్నగు సద్గుణములచే ప్రజలనందరినీ తన వశము చేసికొని పోషించినాడు. కనుక శ్రీరాముడు సర్వగుణ పరిపూర్ణుడు, సమగ్రుడు అనబడినాడు.

సమగ్రుడైన శ్రీరాముడిగ అవతరించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

''రమ్యతేఽస్మిన్ సదా సర్వైః గుణ రూప వశీకృతైః'' – రాముని రూపమునకు ఇతర సర్వగుణములకు వశమైపోయిన వారు నిరంతరము రాముని యొక్క ధ్యానములోనే రమింతురు. ఆనందింతురు కనుక రామః అనబడుచున్నాడు.

## 137. న్యగ్రోధాయ నమః

మర్రిచెట్టు వంటి వాడు శ్రీరాముడు. మర్రి చెట్టు అతి విశాల స్వరూపమై అనేక ప్రాణులకు (జంతువులకు, పక్షులకు, మానవులకు) నీడనిచ్చి మేలు చేసినట్లు శ్రీరాముడు సమస్త కళ్యాణ గుణ సంపన్నుడై ఆశ్రితులందరికీ, నమస్కరించిన వారందరికీ మేలు చేయును. కనుక శ్రీరాముడు మర్రి చెట్టుతో పోల్చబడినాడు.

న్యగ్రోధము వంటివాడైన శ్రీరామునిగా అవతరించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 138. దుష్ట నిగ్రహాయ నమః

శ్రీరాముడు దుష్టులయిన తాటక, మారీచ, సుబాహులతో పాటు జనస్థానంలోని ఖర దూషణాది పదునాలుగు వేల రాక్షసులను, లంకలోని రావణాది రాక్షసులను నిగ్రహించినాడు. సంహరించినాడు. కనుక దుష్టనిగ్రహుడు అనబడినాడు.

దుష్టనిగ్రహుడయి శ్రీరామునిగా అవతరించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 139. రఘువంశ సముద్భూతాయ నమః

రఘువంశమున జన్మించిన వాడు శ్రీరాముడు. విష్ణుదేవుడు పుట్టుక లేనివాడైనను దుష్టశిక్షణ, శిష్టరక్షణల కొరకు రఘువంశమున మానవ రూపమున శ్రీరామునిగా జన్మించినాడు.

రఘువంశమున శ్రీరామునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

రఘువు సూర్యవంశపు రాజులలో ప్రసిద్ధుడు. దిలీపుని కుమారుడు. రఘువు కుమారుడు అజుడు. రఘువు యొక్క ప్రసిద్ధి కారణంగా ఇక్ష్వాకు వంశము రఘు వంశము అని పిలువబడింది. మహాకవి కాళిదాసు రఘువంశమను మహాకావ్యమును రచించినాడు.



# తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి
# బ్రహ్మోత్సవ వైభవం

కీ॥శే॥ రాఘవాచార్య

(గత సంచిక తరువాయి)

## 10. హనుమద్వాహనం

బ్రహ్మోత్సవాలలో ఆరవనాటి పగలు వేంకటేశ్వరస్వామి ఒక్కడే హనుమంతుని వాహనంగా చేసికొని ఊరేగుతూ త్రేతాయుగం నాటి శ్రీరాముడను నేనే అని పలుకుతున్నట్లు వేంకటాద్రి రాముడుగా భక్తులకు దర్శనమిస్తాడు.

"కృతేతు నారసింహోఽభూత్ త్రేతాయాం రఘునందనః
ద్వాపరే వాసుదేవశ్చ కలౌ వేంకటనాయకః"

కృతయుగంలోని నరసింహస్వామి, త్రేతాయుగంలోని శ్రీరాముడు, ద్వాపరయుగంలోని శ్రీకృష్ణుడు, కలియుగంలోని వేంకటేశ్వరుడు ఒక్కరే. అందరు విష్ణుదేవుని అవతార పురుషులే. అందుకే

"కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూలా కర్తవ్యం దైవమాహ్నికమ్"

అంటూ ప్రతిరోజు ఆ రాముని పేరుతోనే మేలుకొలుపులు పాడించుకుంటూ, సుప్రభాత సేవ చేయించుకుంటున్నాడు వేంకటేశ్వరుడు. లోకహితం కోసమే నేను త్రేతాయుగంలో శ్రీరామునిగా, కలియుగంలో వేంకటేశునిగా అవతరించాను. ఆ విషయాన్ని జ్ఞాపకం చేయడం కోసమే నేడు అనన్య భక్తుడైన హనుమంతుని అధిరోహించి మీకు వేంకటాద్రి రామునిగా కనిపిస్తున్నాను. హనుమంతుడు దాస్యభక్తికి ప్రతీక. ఆదర్శము. భక్తజనులారా! మీరు హనుమంతుని వలె వేంకటేశునికి దాసులై, అనన్య భక్తులై అభీష్టసిద్ధిని పొందండి. కృతార్థులు కండి అని ఉపదేశిస్తున్నాడు స్వామి.

రామ రావణ యుద్ధంలో రావణుడు రథముపై నుండి యుద్ధం చేస్తుండగా శ్రీరాముడు హనుమంతుని భుజము నధిరోహించి రావణునితో యుద్ధం చేసినాడు. హనుమంతుడు భగవంతుని కంటె భక్తుడే బలవంతుడని నిరూపించినాడు. భగవంతుని కంటె భగవన్నామమే శరణ్యమని దృఢపరచినాడు. దేశంలో శ్రీరాముని భక్తుల కంటెహనుమంతుని భక్తులే అధికముగా ఉన్నారు. కేసరి భార్య అంజనాదేవి వేంకటాద్రిలో ఆకాశగంగా తీర్థ సమీపమున తపస్సు చేసి తపః ఫలితముగా హనుమంతుని ప్రసవించింది. కనుక హనుమంతుని జన్మస్థానం ఆకాశగంగా తీరము. అక్కడ ఉన్న పర్వతమునకు అంజనాచలమను పేరు గలిగింది.

అంజనా పుత్రుడు అంజానాద్రీశ్వరునకు – వేంకటేశ్వరునకు – వాహనమైనాడు.

తాళ్ళపాక అన్నమాచార్యులు హనుమంతుని వైభవాన్ని యిట్లు కీర్తించినాడు.

"ఇతడే యతడుగా బో లేలిక బంటును నైరి
మితి లేని రాఘవుడు మేటి హనుమంతుడు
జలధి బంధించి దాటి చలపట్టి రాఘవుడు
అలరి వూరకే దాటే హనుమంతుడు
అలుకతో రావణుని యదటణచె నతడు
తలచి మైరావణుని దండించె నితడు"

శ్రీవైష్ణవ సంప్రదాయంలో గరుడసేవను 'పెరియ తిరువడి' గాను, హనుమంతుని సేవను 'సిరియ తిరువడి' గాను గౌరవిస్తున్నారు. అందుకు కారణం గరుత్మంతుడు అన్ని యుగములలో సదా విష్ణుదేవుని వాహనము, సేవకుడు. హనుమంతుడు త్రేతా యుగంలో మాత్రమే శ్రీరాముని సేవించి తరించినాడు.

ఆరవనాటి మధ్యాహ్నము శ్రీదేవి భూదేవి సమేతుడైన మలయప్పస్వామికి వసంతోత్సవం జరుగుతుంది. ఈ వసంతోత్సవం దేవాలయంలోని రంగనాయకుల మండపంలో జరుపబడుతుంది. ఈ ఉత్సవం క్రీ.శ. 1993 సంవత్సరము నుండి జరుగుచున్నది. ఈరోజు సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేతంగా మలయప్పస్వామి స్వర్ణరథాన్ని అధిరోహిస్తాడు. సంధ్యాసమయంలో సూర్యుని అరుణ కిరణములు ప్రసరించుచుండగా దివ్య కాంతులీనుచున్న బంగారు రథంలో వేంకటేశ్వర స్వామి దేవేరులతో తిరుమల మాడ వీధులలో విహరిస్తూ భక్తులకు కనువిందు చేస్తాడు. బ్రహ్మోత్సవాలలో ప్రతిరోజు సాయంత్రం జరిగే ఉయ్యాలసేవ ఈరోజు (హనుమ వాహనం నాడు) ఉండదు. వసంతోత్సవానంతరం జరిగే స్వర్ణ రథోత్సవాన్ని ''సువర్ణ రథ రంగ డోలోత్సవం'' అని వ్యవహరిస్తున్నారు. స్వర్ణ రథోత్సవంలో కళ్యాణకట్ట సంఘము వారు బంగారు గొడుగును రథంపై అలంకరిస్తారు.

## 11. గజ వాహనం

బ్రహ్మోత్సవాలలో ఆరవనాటి రాత్రి శ్రీవేంకటేశ్వరస్వామి ఒక్కడే గజరాజుపై ఊరేగుతూ భాగవతంలోని గజేంద్రమోక్షం వృత్తాంతాన్ని స్మరింపజేస్తాడు. భక్తజనులారా! ఈ గజరాజు బలగర్వితుడు. అందుచే మొసలికి చిక్కి దానితో చాలాకాలం పోరాడి చివరకు

లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె, బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను, మూర్ఛవచ్చె దనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్
నీవే తప్ప నితః పరం బెరుగ మన్నింపం దగున్ దీనునిన్
రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షించు భద్రాత్మకా

–ఈశ్వరా! బలముకొంచెమైననులేదు. ధైర్యంనశించింది. ప్రాణములు తమ స్థానముల నుండి తప్పుకొంటున్నవి. సొమ్మసిల్లినాను. శరీరం కృశించిపోయింది. అలసట కలుగుతున్నది. ఇక ఈ మొసలితో పోరాడలేను. నిన్నే తప్ప మరొకరిని ఎరుగను. ఈ దీనుని నీవే రక్షించాలి. ఈశ్వరా! (ఇక్కడ ఈశ్వర శబ్దము ప్రభు వాచకము. శివ వాచకము కాదు. అందువల్లనే జగన్నాథుడైన విష్ణుదేవుడు గజేంద్రుని మొర విని వచ్చి రక్షించినాడు) వేగరమ్ము వరదుడా! కాపాడుము, పరమాత్మా! నన్ను రక్షించుము అని శరణు వేడినాడు. తక్షణమే విశ్వమయుడైన విష్ణుదేవుడు అల వైకుంఠ పురంబులో నగరిలో నామూల సౌధంబు దాపల మందార వనాంతరామృత సరః ప్రాంతేందు కాంతోపలోత్పల పర్యం రమావినోదియైనను, ఆపన్న ప్రసన్నుడై వైకుంఠము నుండి భువికి అవతరించి, మొసలిని సంహరించి గజరాజును కాపాడినాడు. కనుక భక్తులారా! మీరు కూడా స్వశక్తిపై, స్వబలముపై ఆధారపడకుండా మీ రక్షణ భారం నామీద ఉంచండి. నేను మిమ్మల్ని తప్పక రక్షించుతాను అని గజవాహనుడైన వేంకటేశ్వరుడు ఉపదేశమిస్తున్నాడు.

సంసారం ఒక సరస్సు. మొసలి కర్మ. గజేంద్రుడు జీవుడు. సంసారం నుండి, కర్మ నుండి విముక్తిని ప్రసాదించేవాడు విష్ణుదేవుడు. ప్రతి భక్తుడు ఒక గజేంద్రుడు. సంసార బంధం నుండి, కర్మ బంధం నుండి విముక్తిని ప్రసాదించేవాడు వేంకటేశ్వర స్వామి.

ఇప్పుడు వైకుంఠం ఒకటవ క్యూ కాంప్లెక్సు ఉన్నచోట పూర్వం గజేంద్ర మోక్షం సరస్సు (బావి) ఉండేది. కాల పరిభ్రమణంలో అది పూడిపోయింది.

రాజలాంఛనాలలో, చతురంగబలములో గజబలం ఒకటి. నేటికీ గజారోహణము (ఏనుగుపై ఊరేగడం) గొప్ప గౌరవం. విశిష్ట సన్మానం. శరణాగతి ప్రయోజనాన్ని వివరించే పురాణగాథ గజేంద్రమోక్షం.

బ్రహ్మోత్సవాలలో వేంకటేశ్వరుడు ఒక్కడే గజారూఢుడై ఊరేగుతాడు. తాళ్ళపాక అన్నమాచార్యులు అలమేలు మంగతో కలిసి గజారూఢుడైన వేంకటేశ్వరుని విలాసాన్ని ఇట్లు వర్ణించినాడు.

చొల్లెపు జుట్టుతోడి చుంగుల రాజసముతో
వెల్లివిరిగా నేగి వెలదులు గొలువ
వీపు గుచాలు మోపి వెలది కౌగిలించగా

నేపున నేనుగునెక్కి నిదె దేవుడు
చేపట్టి యాపె చేతులు బిగ్గె బట్టుక
పై పై వీధుల వెంట బరువు దోలీని - 13-58

## 12.సూర్యప్రభ వాహనము



భాస్కరాయ విద్మహే
మహాద్యుతికరాయ ధీమహీ
తన్నో ఆదిత్యః ప్రచోదయాత్

అని సూర్య గాయత్రి. బ్రహ్మోత్సవాలలో ఏడవ రోజు పగలు సప్తాశ్వ రథారూఢుడైన సూర్యప్రభ వాహనంపై సప్తగిరీశ్వరుడు వేంకటేశ్వరుడు ఒక్కడే. వజ్రకవచం ధరించి ఉదయ సూర్యకిరణాలు ప్రసరించుచుండగా తిరుమల మాడవీధులలో ఊరేగుతూ సూర్యమండలం మధ్య నున్న నారాయణమూర్తిని నేనే అని బోధిస్తున్నాడు. ''జ్యోతిషాం రవి రంశుమాన్'' జ్యోతిః స్వరూపాలలో సూర్యుడను నేని అని భగవంతుని మాట. భగవంతుని స్వరూపమే తేజస్సు. అది సూర్యభగవానునిలో ప్రముఖంగా ఉంది.

"ధ్యేయస్సదా సవితృమండల మధ్యవర్తీ నారాయణః"

సూర్యమండలము మధ్యలో ఉన్న శ్రీమన్నారాయణుడు ఎల్లప్పుడు ధ్యానింప దగియున్నాడు అని వేద వచనము. అందుకే భారతీయులు ప్రతినిత్యం ఉదయం సూర్యోపాసన, సూర్య నమస్కారములు చేస్తున్నారు. గాయత్రీ మంత్రముతో సూర్యనారాయణుని ఆరాధిస్తున్నారు. సూర్యుడు తేజోనిధి. ప్రకృతికి చైతన్యప్రదాత. వర్షాలు, వాటి వలన పెరిగే పైరు పంటలు చంద్రుడు, అతని వలన వృద్ధి చెందే ఓషధులు మొదలగునవి అన్నీ సూర్యప్రభ వల్లనే వృద్ధి చెందుతున్నాయి.

ప్రపంచానికి వెలుగు ప్రసాదించే సూర్యనారాయణుడను నేనే అని వేంకటేశ్వరస్వామి సూర్యప్రభ వాహనంపై భక్తజనులకు దర్శన భాగ్యం కలిగించి, ఆరోగ్య ఐశ్వర్యాలను అనుగ్రహిస్తాడు.

తాళ్ళపాక అన్నమాచార్యులు —

ఉవిద వదన చంద్రోదయ వేళను
రవియగు సూర్యప్రభ నీ వేగగ 30-197

అని వేంకటేశ్వరుని వర్ణించినాడు. మరోచోట అన్నమాచార్యులు

అదివో చూడరో అందరు మొక్కరో
గుది గొనె బ్రహ్మము కోనేటి దరిని
రవి మండలమున రంజిల్లు తేజము
దివి చంద్రునిలో తేజము
భువి ననలంబున బొడమిన తేజము
వివిధంబులైన విశ్వ తేజము -2-498

అని వేంకటేశ్వరుడే సూర్యమండల మధ్యవర్తి యగు శ్రీమన్నారాయణుడని ధ్రువపరచి కీర్తించినాడు.

## 13. చంద్రప్రభ వాహనము

ఏడవనాటి రాత్రి వేంకటేశ్వరుడు చల్లని వాతావరణంలో చంద్రప్రభ వాహనంపై తిరుమల మాడ వీధులలో విహరిస్తాడు. స్వామికి – వేంకటాద్రి విష్ణుదేవునికి – సూర్యచంద్రులు రెండు నేత్రాలు. పగలు సూర్యప్రభలో ఊరేగిన

వేంకటాద్రి విష్ణుదేవుడు రాత్రి నిశాకరుడైన చంద్రప్రభ వాహనంపై ఊరేగుతాడు. కృష్ణభగవానుడు ''నక్షత్రాణా మహం శశీ'' – చుక్కలలో చంద్రుడను నేను – అని తెలియజేసినాడు. ''చంద్రమా మనసో జాతః'' అని పురుష సూక్తము భగవంతుని మనస్సు నుండి చంద్రుడు జన్మించినాడని వివరిస్తున్నది. సూర్యుడు దివాకరుడు. చంద్రుడు నిశాకరుడు. సూర్యకాంతితోనే చంద్రుడు ప్రకాశిస్తాడు. కనుక పగలు సూర్యప్రభ వాహనం జరిగిన తరువాత చంద్రప్రభ వాహనం రాత్రిపూట జరుగుతున్నది. చంద్రుడు అమృత కిరణములు కలవాడు. కనుక స్వామి దేవతలకు అమృతం పంచిపెట్టిన మోహిని రూపంలో అమృతకలశంతో దర్శనమిస్తూ భక్తులకు అమృత విద్యను బోధిస్తుంటాడు. ''యథా ప్రహ్లాదనాత్ చంద్రః'' – చంద్రుని వలన సంతోషము కలుగుతుంది. అట్లాగే చంద్రప్రభ వాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి దర్శనం భక్తులకు సంతోషాన్ని, వరసిద్ధిని కల్గిస్తుంది. సూర్యుని తీక్షణం చంద్రుని శీతలత్వం రెండు తన స్వరూపమేనని వేంకటేశ్వరుడు సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాల ద్వారా వెల్లడిస్తున్నాడు. సూర్యచంద్రులు భగవంతుని నేత్రాలు. మానవునికి సూర్యుని వలన దృష్టి, చంద్రుని వలన మనస్సు ఏర్పడుతున్నాయి.

(సశేషం)



# అయిదు సన్నిధుల అంజుమూర్తి కోవెల

- ఇలపావులూరి వేంకటేశ్వర్లు

**నూట ఎనిమిది శ్రీ వైష్ణవ దివ్య దేశాలలో అధిక శాతం తమిళనాడులోనే ఉన్నాయి. ఆ రాష్ట్రం తరువాత ఎక్కువ దివ్య తిరుపతులు ఉన్నది కేరళ రాష్ట్రంలోనే ! గతంలో ఈ ప్రాంతాన్ని ''మలైనాడు'' పిలిచేవారు. స్వాతంత్రానంతరం దేశం బాషా ప్రాతిపదికన రాష్ట్రాలుగా విడిపోయిన విషయం తెలిసినదే! అయినా ప్రస్తుతం తమిళనాడులోని నాగర్కోయిల్ జిల్లాలో ఉన్నరెండు క్షేత్రాలతో కలిపి మొత్తం పదమూడు పుణ్య క్షేత్రాలను మలైనాడు దివ్యదేశాలుగా నేటికీ పిలుస్తారు. అంటే వీటిల్లో పదకొండు మాత్రమే భౌగోళికంగా దేవతల స్వస్థలంలో ఉన్నాయి.**

కేరళ రాష్ట్రం అంటే ప్రత్యేక ఆలయాల ప్రాంతంగా ప్రసిద్ధి. ఈ దివ్యదేశాలు కూడా ఎంతో విశేషంగా ఉంటాయి. మరో ప్రత్యేకత ఏమిటంటే వీటిల్లో ఆరు ఆలయాలను పాండవులు స్థాపించినట్లుగా పురాణ గాధలు తెలియజేస్తున్నాయి. కాకపోతే చెంగన్నూర్ పరిసరాలలో ఉన్న అయిదు ఆలయాలైన తిరుచెంగన్నూర్ (ధర్మరాజు), తిరుప్పులియూర్ (భీముడు), ఆరన్మూల (అర్జునుడు), తిరుక్కోడిత్తానం(సహదేవ), తిరువాంవండూరు(నకులుడు) నిర్మించారు. కానీ అంజుమూర్తి కోవెలలో ఉన్న నాలుగు శ్రీ మహా విష్ణు మూర్తులను పంచపాండవులు ఒకేసారి ప్రతిష్ట చేశారని

ఆలయ గాథ తెలుపుతోంది. ఈ క్షేత్రంలోని మరో విశేషం ఏమిటంటే నాలుగు శ్రీమన్నారాయణుని ఆలయాల మధ్య కైలాసనాధుడు స్వయంభూలింగ రూపంలో దర్శనమివ్వడం. ఈ కారణంగా అయిదు సన్నిధులున్న ఆలయంగా ''అంజు మూర్తి కోవెల'' అని అంటారు. హరిహరులిద్దరూ ఒకే ప్రాంగణంలో కొలువై దర్శనమిచ్చే మరో దివ్యదేశం మరెక్కడా కనపడదు.

## ఆలయ పురాణ గాథ

కేరళ రాష్ట్ర గంగానదిగా పిలవబడే ''భరత్ పుళ'' తీరంలో ఉన్న ఈ ప్రాంతం ద్వాపర యుగంలో ఒక మునివాటికగా పేరొందినది. కురుక్షేత్ర యుద్ధంలో విజయం సాధించినా తాత, గురువులు, సోదరులు, పుత్రులతో పాటు మరెందరో బంధువుల మరణాల కారణంగా కలుగుతున్న బాధ నుండి ఉపశమనం పొందడానికి శ్రీ కృష్ణుడు పాండవులను కొంత కాలం తీర్థయాత్రలు చేయమన్నారట. తమ భాంధవుడు అయిన మాధవుని సలహా మేరకు అనేక క్షేత్రాలను సందర్శించిన పాండు నందనులు ఇక్కడికి చేరుకొన్నారట. సతీ సమేతంగా పవిత్ర జలాలలో స్నానమాచరించి అక్కడ మహర్షుల పూజలు అందుకొంటున్న వైకుంఠుని నాలుగు రూపాలను, కైలాసవాసుని సేవించుకొన్నారట. అనంతరం మహర్షుల ఆశీర్వాదం తీసుకొన్న వారు మునులను క్షేత్ర విశేషాల గురించి అడిగారట.

సత్యయుగంలో ఈ ప్రాంతాన్ని అంబరీష చక్రవర్తి పాలించేవారట. ఆయన ధర్మ పాలనలో రాజ్యం సుభిక్షంగా ఉండి ప్రజలు సుఖసంతోషాలతో జీవించేవారట. ప్రజలను కన్నబిడ్డలుగా చూసుకొనే చక్రవర్తికి వారసులు లేరన్న చింత వేధించేదట. చివరికి పండితుల సలహాను అనుసరించి పవిత్ర భరత్ పుళ నదీతీరంలో పుత్రకామేష్ఠి యజ్ఞం చేసి ఒక కుమార్తెను, ముగ్గురు కుమారులను పొందాడట. వార్ధక్యం సమీపించిన తరువాత రాజ్య భారం పుత్రులకు అప్పగించి తాను తిరిగి ఇక్కడికి చేరుకొని శ్రీ మహావిష్ణువు సాక్షాత్కారం కొరకు తపమాచరించాడట.

సంతుష్టుడైన గరుడ వాహనుడు దర్శనమిచ్చాడట. స్తోత్రపాఠాలతో స్తుతించిన అంబరీషుడు స్వామిని ఆయన వ్యూహరూపాలలో దర్శనమివ్వమని అర్థించాడట. భక్తుని మనోభీష్టం నెరవేర్చిన నారాయణుడు అవే రూపాలలో కొలువు తీరారట. నాటి నుండి ఋషి పుంగవులు ఆ మూర్తులకు పూజాదులు నిర్వర్తిస్తున్నారట.

క్షేత్ర పురాణ గాథ విని ఆనందించిన పాండవులు ఆ మూర్తులను సేవించుకొని, ఆలయాలను నిర్మించారట.

## కాశీ విశ్వేశ్వర స్వామి సన్నిధి

అనంతర కాలంలో ఈ ప్రాంతానికి చెందిన బ్రాహ్మణోత్తముడు ఒకరు కాశీ యాత్ర సంకల్పించు కొన్నారట. తల్లితండ్రుల అనుమతి తీసుకొని బయలుదేరారట. వారణాసి చేరుకొని కొన్ని సంవత్సరాల పాటు శ్రీ విశాలాక్షీ సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి వార్ల సేవలో గడిపారట. ఒకనాటి రాత్రి సర్వేశ్వరుడు ఆయనకు స్వప్నములో కనపడి స్వగ్రామం వృద్ధులైన మాతాపితలను సేవించుకోమని ఆజ్ఞాపించాడట. స్వామివారి ఆనతి ప్రకారం తిరుగు ప్రయాణమైన బ్రాహ్మణుడు ఒకనాటి సంధ్యా సమయానికి ఇక్కడికి చేరుకొన్నాడట. తన తాటియాకుల ఛత్రాన్ని, సామానులను ఉంచి స్నానమాచరించి, సంధ్యా వందనం చేసుకొన్నారట. తిరిగి ప్రయాణం ప్రారంభిస్తూ గొడుగును తీసుకోడానికి ప్రయత్నించగా అది రాకపోగా శివలింగముగా మారిపోయినదట. విశ్వేశ్వరుడు తనతో పాటు ఇక్కడిదాకా వచ్చాడు. సత్యం అర్థమైనది విప్రునకు. నిజ భక్తుల పట్ల ఆయనకు భక్తుల అవాజ్య అనురాగానికి పరవశించిపోయిన అతను ఇక్కడే తల్లితండ్రులతో పాటు జీవితాంతం శివ సేవలో గడిపాడట. అలా కాశీ నుండి విచ్చేసిన స్వామిని కాశీ విశ్వేశ్వరుడు అని పిలవసాగారు. అలా నాలుగు రూపాల శ్రీమన్నారాయణునితో పాటు శ్రీ మహేశ్వరుడు కూడా కొలువైన ఏకైక అరుదైన క్షేత్రమిది.

## ఆలయ విశేషాలు

నది ఒడ్డున ఉన్నఈ పురాతన క్షేత్రంలోని అయిదు ప్రధాన అర్చనామూర్తులతో పాటు పరివార దేవతల సన్నిధుల నిర్మాణం కూడా ప్రత్యేకంగా కనపడుతుంది. ప్రధాన ఆలయం తప్ప మిగిలిన వాటిని పునః నిర్మించారు .

ఎటువంటి విరాట్ నిర్మాణాలు లేకుండా సాధారణ కేరళ నిర్మాణ శైలిలో ఉండే ఈ ఆలయానికి పడమర చిన్న ప్రవేశ ద్వారం ఉంటుంది. దక్షిణ దిశగా ఒక ద్వారం ఉంటుంది. ఇక్కడే దీప స్థంభం మరియు బలి పీఠం ఉంటాయి.

పడమర ద్వారం గుండా ప్రాంగణం లోనికి ప్రవేశించగానే కనపడేది మాద్రి తనయులైన నకుల సహదేవులు అర్చించిన ''అనిరుద్ధుని'' సన్నిధి. పక్కనే పాండవాగ్రజుడు ధర్మరాజు పూజించిన ''ప్రద్యుమ్న'' సన్నిధి ఉంటుంది. ఈ రెండు ఆలయాలకు, ప్రధాన ఆలయానికి మధ్యన క్షేత్ర రక్షకుడైన శ్రీ ధర్మశాస్త ఉపాలయం ఏర్పాటు చేయబడినది. ఈ



మూడూ కూడా పాత వాటి స్థానంలో నిర్మించబడిన నూతన నిర్మాణాలే!

ప్రధాన ఆలయానికి తూర్పు వైపున భీమసేనుడు కొలిచిన ''సంకర్షణ'' సన్నిధి కూడా నూతన నిర్మాణమే! ఈ నాలుగు ఆలయాలను సందర్శించుకొని పురాతన ఆలయం లోనికి ప్రవేశిస్తే ముఖమండపం దాటగానే ఉన్న నలుచదరపు గర్భాలయంలో చందన కుంకుమ పుష్పాలంకరణలో దివ్యంగా దర్శనమిస్తారు శ్రీ విశ్వేశ్వర స్వామి. ముఖమండపానికి గర్భాలయానికి మధ్యన శిలాదముని తనయుడైన నందీశ్వరుడు ప్రభువు ఆజ్ఞకై నిరీక్షిస్తున్నట్లుగా ఉపస్థితుడై ఉంటాడు. గర్భాలయ వెలుపలి గోడల పైన దశావతార, కంసవధ, పూతన సంహారం లాంటి శ్రీకృష్ణ లీలా విన్యాసాలను తెలిపే వర్ణ చిత్రాలు కనపడతాయి. కొన్ని వందల సంవత్సరాల క్రిందట సహజ వర్ణాలతో చిత్రించబడిన ఆ చిత్రాలు నేటికీ చెక్కు చెదరక పోవడం గొప్ప విషయంగా చెప్పుకోవాలి.

ఈ గర్భాలయం వెనక పక్క ఉన్న చిన్న ద్వారం గుండా వెళితే వర్తులాకార గర్భాలయంలో స్థానిక భంగిమలో చతుర్భుజాలలో శంఖు, చక్ర, గద మరియు పద్మధారిగా రమణీయ పుష్పాలంకరణలో ప్రధాన అర్చనామూర్తి శ్రీ ఉయ్యవింద పెరుమాళ్ (పర వాసుదేవుడు) దర్శనమిస్తారు.

## పూజలు - ఉత్సవాలు


ఉదయం అయిదు గంటల నుండి మధ్యాహ్నం పన్నెండు వరకు తిరిగి సాయంత్రం నాలుగు నుండి రాత్రి ఎనిమిది గంటల వరకు తెరిచి ఉండే ఈ ఆలయంలో నిత్యం నియమంగా నాలుగు పూజలు జరుపుతారు. ఎన్నో అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు మరియు ఆరగింపులు చేస్తారు. కార్తీక, ధనుర్మాసాలలో, శివరాత్రి, వైకుంఠ ఏకాదశి, కృష్ణాష్టమి, శ్రీరామ నవమి పర్వదినాలతో సహా స్థానిక పర్వదినాలైన ఓనం, విషు రోజులలో విశేష పూజలు నిర్వహిస్తారు. చైత్ర మాసంలో పది రోజుల పాటు జరిగే ఆలయ ప్రతిష్ఠా దినోత్సవ ఉత్సవాల సందర్భంగా ఘనంగా ఏర్పాట్లు చేస్తారు. అమావాస్య, పౌర్ణమి దినాలలో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. భరత్ పుళ నదిలో స్నానం చేసి అయిదు ఆలయాలలో నేతి దీపాలను వెలిగిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుంది అన్నది స్థానిక నమ్మకం. శత్రు, అపమృత్యు భయం తొలగిపోవడానికి, అనారోగ్య సమస్యలు సమసిపోవడానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

పన్నిద్దరు శ్రీ వైష్ణవ ఆళ్వారులలో ఒకరైన శ్రీ కులశేఖర ఆళ్వార్ శ్రీ ఉయ్యవింద పెరుమాళ్ ని కీర్తిస్తూ పది పాశురాలను గానం చేశారు. ఈ కారణంగా అంజుమూర్తి కోవెల నూట ఎనిమిది దివ్య దేశాలలో ఒకటిగా శాశ్వత కీర్తిని సొంతం చేసుకొన్నది.

అంజుమూర్తి కోవెల ఉన్న ''తిరువిత్తక్కోడ్'' గ్రామం భౌగోళికంగా పాలక్కాడ్ జిల్లాలో ఉన్న ప్రముఖ కృష్ణ క్షేత్రమైన గురువాయూరుకి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. నేరుగా చేరుకోడానికి తగిన బస్సు సౌకర్యం ఉన్నది. తగిన వసతి సౌకర్యాలు గురువాయూరులో లభిస్తాయి. బస్ స్టాండ్ నుండి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది ఆలయం. నలుదిక్కులా పచ్చని పొలాలు, మరోపక్క గలగలా ప్రవహించే భరత్ పుళ నదితో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక సౌరభాలతో పాటు ఆహ్లాదకర పరిమళాలను వెదజల్లుతుంటాయి.

# జరాసంధుడు

- పరాంకుశం శ్రీనివాసమూర్తి



మగధరాజు బృహద్రధుడు. ఇతడు జరాసంధుని తండ్రి. బృహద్రధుడు కాశీరాజు కుమార్తెలిద్దరినీ వివాహమాడెను. చాలాకాలము వరకు సంతానము లేక అనేక వ్రతము లాచరించుచుండెను. అయినా ఫలితము లేనందున మిగుల దుఃఖితుడైనాడు. అడవులలో తిరుగుచు ఒకనాడు ఒక మామిడి చెట్టు క్రింద తపస్సు చేసుకొనుచున్న చండకౌశికునికి నమస్కరించి, సంతానము లేని విషయాన్ని తెలుపుకొని ప్రార్థించెను. ఆ సమయముననే చెట్టు నుండి రాలిపడిన ఒక మామిడి ఫలాన్ని మంత్రించి ఆ ముని రాజుకిచ్చినాడు. ఆ ఫలమును రెండు భాగములు చేసి ఇద్దరు భార్యలకిచ్చెను. వారు ఆ మామిడి ముక్కలను భుజించి ఇరువురు గర్భవతులైరి. ఇద్దరికిని ఇరువురు పిల్లలు పుట్టిరి.

వారిద్దరు చీల్చివేసినట్లుగ ఒక కన్ను, ఒక కాలు, చేయి కల్గి ఒక ఉదరము కల్గి వికృత రూపులుగ ఉండిరి. వారిని చూచి భయపడిన తల్లులిద్దరు ఆ బిడ్డలను తండ్రికి చూపడానికి భయపడి వారిని వీధిలో పారవైచిరి. ఆ దగ్గరలో తిరుగుతున్న 'జర' యను రాక్షసి తనకు మంచి ఆహారం దొరికిందని సంతోషంతో ఆ ఇద్దరినీ తీసుకుని భుజాన వేసుకొని పోవుచుండగా వారిద్దరును విడిగా ఉన్న వారిద్దరు ఒకటిగ కలిసి దృఢమైన శరీరంగా ఏర్పడి బలముగా ఏర్పడి బిగ్గరగా ఏడ్చుచుండెను. ఆ బాలుని బరువును రాక్షసి మోయలేకుండుటచే, ఆ ఏడ్పును విని చుట్టుప్రక్కల స్త్రీలు ఆ బాలుని చూచి రాజుకు తెల్పిరి. అందులో ఆ రాక్షసి కూడా ఆ బాలుని పెంచుటకు, తినుటకిష్టపడక ఒక స్త్రీ రూపములో రాజుని చేరి విసయమంతటినీ తెలిసి ఆ బాలుని రాజుకిచ్చినది. అంత రాజుయును సంతోషపడి బలవంతుడైన ఆ బాలుని దగ్గరకు తీసుకొని జర అను రాక్షసి చేత సంధింపబడిన బాలుడు కనుక ఆ బాలునికి జరాసంధుడని పేరు పెట్టి పెంచుకొనుచుండెను. ఆ బాలుడే మగధరాజుగా, జరాసంధుడుగా పేరొంది బలవంతుడయినాడు.

ఇతనిని రాజుగ చేసి తండ్రి తపస్సుకు వెళ్ళెను. గిరివ్రజపురము ఇతని రాజధాని. దానిచుట్టునున్న గోరథము, ఋషభము, వైహారము మొదలగు పర్వతములు పెట్టని గోడలై యుండుటచే నగరము శత్రు దుర్భేద్యమై యుండినది. అంతేకాక జైత్రకగిరి శృంగమున భేరులు పరులు నగరమున ప్రవేశించకుండ మ్రోగించకయే అది మ్రోగుట వలన శత్రులను కనిపెట్టి జరాసంధుడు శత్రుభయంకరుడై ఎవ్వరికీ లొంగక అజేయునిగా నిలిచినాడు. ఆయుధములతో మరణింపకుండునట్లు ఇతనికి వరము కలదు.

హంస డింభకులు మిత్రులుగ సేనా సమన్వితులై కొల్చుచుండిరి. ఇతడు ఇతర రాజులను చెఱపట్టి తన నగరమున బంధించి భైరవపూజ చేయుచు ఒక్కొక్కనిని బలి చేయుచు అజేయుడైనాడు.

జరాసంధుడు తన కుమార్తెలకు అస్తి ప్రాస్తులను కంసునికిచ్చి వివాహము చేసెను. కృష్ణుడు కంసుని వధించినప్పటి నుండి కృష్ణునితో శత్రుత్వము బూని ఇతడు మధురపై అనేకసార్లు దాడి చేసెను. కృష్ణుడీతనికి వెఱచి దాగియుండు చుండెడివాడు.

పదునెనిమిది సార్లు కంసుని చేతిలో ఓడిపోయినాడు

శ్రీకృష్ణుడు. జరాసంధునిచే బంధింపబడి యున్న నృపులు తమనెట్లేని విడిపించుమని శ్రీకృష్ణుని కడకు సందేశము పంపారు. ఆ సమయముననే నారదుడు శ్రీకృష్ణుని కడకు వచ్చి ధర్మజుడు రాజసూయ యాగము చేయతలపెట్టినాడు. నీవుకాక ఎవరు సహాయము చేయగలరు? అని చెప్పెను.

ఇదియే సమయమని, జరాసంధునికి బ్రాహ్మణులందు భక్తి కలదు. వారు కోరిన దానిని అతడు ఇచ్చుచుండును. కావున బ్రాహ్మణ వేషములో పోయి వానితో సంగ్రామ భిక్షను కోరవలయునని ఉద్ధవుడు చెప్పెను.

ధర్మజుడు యాగార్థము తూర్పు దిగ్విజయమునకై భీముని పంపగా జరాసంధుడు ధర్మజుని యాగాశ్వమును భీముని అడ్డుకొనకపోవుటచే భీముడు తిరిగి వచ్చెను. శ్రీకృష్ణుడు ఉద్ధవుని ఆలోచన ప్రకారం తాను, భీమార్జునులు బ్రాహ్మణ వేషమున జరాసంధుని కడకేగిరి.

ధర్మరాజు రాజసూయమును ప్రారంభించిన సమయంలో జరాసంధుని సంహరించుటకై బ్రాహ్మణులుగా మారి గిరివ్రజపురమునకు చేరి సింహద్వారము నుండి గాక అన్యమార్గమున బ్రాహ్మణులకు సుప్రవేశమగు మార్గమున రాత్రియందు కోటలోకి ప్రవేశించినవారిని జరాసంధుడు చూచి బ్రాహ్మణులుగా నెంచి, వారికి ఎదురేగి, సత్కరించి వారికి ఆహ్వానమీయబోవగా వారు తిరస్కరించిరి. అది గమనించిన జరాసంధుడు, మీరెవ్వరు? మా ఆతిథ్యాన్ని ఎలా తిరస్కరిస్తున్నారనగా మేము బ్రాహ్మణులము కాము. క్షత్రియులము. మిత్రభావమున ఇటకు రాలేదని ప్రత్యుత్తరమిచ్చిరి.

అంత రాజు అయ్యా! నేను దైవ బ్రాహ్మణ భక్తి భావములున్న వాడను. ఎవరి యెడల ధర్మమును చేసిన వాడనుకాను. మీకు, నాకు వైరమేల? యన్న జరాసంధునితో నీవు రాజులను బంధించి బలి ఇచ్చుచుంటివి. అది యధర్మము గావున నిన్ను సంహరింప వచ్చితిమనిరి. నేను కృష్ణుడనని కృష్ణుడు పలికెను. క్షత్రియులు పరులను సంహరించుట యధర్మమగునా? అయినా మీరు నాతో యుద్ధము కోరి వచ్చితిరి. కాన అట్లే కానిండని, మీరే అస్త్రాలు కావలయునో కోరుకొనుడు. మీ ముగ్గురును కలిసి నాతో పోరాటమునకు సిద్ధమయిన నేనందుకంగీకరిస్తానని జరాసంధుడు పలికాడు.

శ్రీకృష్ణుడు నీతో మల్లయుద్ధమునకు మాలో ఏ ఒక్కరినైనా కోరుకొమ్మని పలికెను. జరాసంధుడు యుద్ధమనివార్యమని తలచి, ముందుగా రాజ్యమునకు వెళ్ళి తన కుమారుని సింహాసనారూఢునిగా చేసి, యుద్ధమునకు సన్నద్ధుడైనాడు.

వారు మాయారూప వేషధారులని తెలిసినా తనకు సరియైన యోధుడు భీముడని తలంచి భీమునే మల్లయుద్ధానికి ఆహ్వానించాడు. అలా భీముని పిలిచి పదునాల్గు దినములు పోరాడి తుదకు శ్రీకృష్ణుని మాయోపాయము చేత భీముని చేతిలో జరాసంధుడు మరణించాడు. ఈవిధంగా శ్రీకృష్ణుడు ఉపాయముతో దుష్టశిక్షణ గావించి జరాసంధుని చావుకు కారణమయ్యాడు. ధర్మజుని రాజసూయ యాగము పరిసమాప్తమైనది.

# అరిషడ్వర్గాలు

**1. కామము:**

ఇది కావాలి, అది కావాలి అని తాపత్రయ పడటం, అవసరాలకు మించిన కోరికలు కలిగి యుండడము.

**2. క్రోధము:**

కోరిన కోరికలు నెరవేరనందుకు చింతించుతూ, తన కోరికలు నెరవేరనందుకు ఇతరులే కారకులని వారిపై ప్రతీకారము తీర్చుకోవాలని ఉద్రేకముతో నిర్ణయాలు తీసుకోవడము.

**3. లోభము:**

కోరికతో తాను సంపాదించుకున్నది, పొందినది తనకే కావాలని పూచిక పుల్ల కూడా అందులోనుండి ఇతరులకు చెందగూడదని దానములు, ధర్మకార్యములు చేయకపోవడము.

**4. మోహము:**

తాను కోరినది కచ్చితముగా తనకే కావాలని, ఇతరులు పొందకూడదని అతి వ్యామోహము కలిగి యుండడము, తాను కోరినది ఇతరులు పొందితే భరించలేకపోవడము.

**5. మదము:**

తాను కోరిన కోరికలన్ని తీరుట వల్ల అది తన గొప్పతనమేనని గర్వించుతూ మరియెవ్వరికి ఈ బలము లేదని ఇతరులను లెక్కచేయక పోవడము.

**6. మాత్సర్యము:**

తాను గలిగియున్న సంపదలు ఇతరులకు ఉండగూడదని తనకు దక్కనిది ఇతరులకు దక్కకూడదని ఒకవేళ తను పొందలేని పరిస్థితిలో ఆ వస్తువు ఇతరులకు కూడా దక్కకూడదనే ఈర్ష్య కలిగి యుండడము.

ఈ అరిషడ్వర్గాలు భగవంతుని ప్రార్థించడం వలన తొలగిపోతాయి




# కొండలలో నెలకొన్న శ్రీవేంకటేశ్వరుడు

- డా|| ఆకెళ్ళ విభీషణశర్మ

## శ్రీవేంకటేశ మత్స్వామిన్! జ్ఞానానంద దయానిధే!
## శరణాగత సంత్రాణ! కరుణాభీష్ట వార్షుక!!

అఖండ భరతభూమిపై సమున్నత వేంకటాచలంపై కలియుగనాథుడు శోభిల్లుతున్నాడు. సాక్షాత్తూ పరబ్రహ్మమూర్తి విశ్వాంతర్యామియై, శేషచలంపైన కటివరద హస్తంతో నిలిచియున్నాడు. నిత్యకళ్యాణ చక్రవర్తి శ్రీవైకుంఠ విరక్తుడై, కలిదోష పీడితులైన మానవాళిని పరిరక్షిస్తున్నాడు. ఐరమ్మదీయము, అశ్వత్థము, హిరణ్మయ భవనము, అపరాజిత పురము మొదలైన పరమానంద స్థానాలను కలిగినది శ్రీవైకుంఠము. భక్తప్రీతి చేత దివ్యవైకుంఠాన్ని వీడి ఈ వేంకటాచలంపై వైఖానస ఆగమ విహితంగా పూజాదికాలను అందుకొంటున్నాడు. ఆశ్రయించిన వారందరినీ కరుణాభరణుడై దరిచేర్చి ఉద్ధరిస్తున్నాడు.

"ప్రవఃపాన్త మన్ధసో ధియాయతే!
మహే శూరాయ విష్ణవే చార్చత!"
(ఋ. 10 మండలం. 155వ సూ. 1వ మంత్రం)

అన్న మంత్రం చేత ప్రతిపాదించబడుతున్న విష్ణ్వర్చావతారమూర్తిగా అవతరించిన లక్ష్మీవల్లభుడు, సర్వజగన్నియామకుడు. ఈ స్వామి వెలసిన కొండను బంగారు కొండగా, పాపాలను తొలగించి రక్షించే కరుణా స్థానంగా

ఎందరో కీర్తిస్తున్నాడు.

తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య –

వేదములే శిలలై వెలసినదీ కొండ!

యేదెస పుణ్యరాసులే యేరులైనదీ కొండ!

గాదిలి బ్రహ్మాది లోకముల కొనల కొండ!

శ్రీదేవేడుండేటి శేషాద్రి ఈ కొండ!

అని ఈ కలియుగ వైకుంఠం నిజ విలాసాన్ని ఆవిష్కరించాడు. పురాణాలు ఈ కొండను వరహాద్రి, గరుడాద్రి, వైకుంఠాద్రి, కనకాద్రి, వేంకటాద్రి, పుష్కరాద్రి, సింహాచలము, నీలాద్రి, చింతామణిగిరి, అంజనాద్రి, నారాయణాద్రి, వృషాద్రి, వృషభాద్రి, వేదాద్రి, శ్రీనివాసాద్రి, ఆనందాద్రి, శ్రీగిరి, జ్ఞానాద్రి, శేషాద్రి, తీర్థాద్రి, సుమేరు శిఖరాచలం వంటి సార్థక నామాలచే శ్లాఘిస్తున్నాయి. 28వ ద్వాపర యుగాన్తమందలి ఈ కలియుగంలో శ్రీనివాసుని నేడు అసంఖ్యాక భక్తబృందాలు ఆశ్రయించి తరిస్తున్నారు. అనునిత్యం తిరుమల వేదోక్తమైన పూజాదికాలచే భాసిల్లుతున్నది. వేదవేద్యుడైన శ్రియఃపతి నిరంతర వేదపఠనాసక్తుడైన బ్రహ్మదేవుని సేవలకు ప్రసన్నుడవుతున్నాడు. అందువల్ల వేదాద్రిగా ఈ తిరుమలను భాగవతోత్తములు కీర్తిస్తున్నారు.

''వృష'' శబ్దానికి ''ధర్మ'' మని అర్థం. తన వృద్ధికై ధర్మం ఈ తిరుమల క్షేత్రంలో తపస్సు చేసింది. అందువల్ల ధర్మదేవత లబ్ధిపొందిన ఈ దివ్య ప్రదేశం వృషాద్రిగా ప్రసిద్ధి చెందింది.

''గిరావస్మిన్ తపస్తేపే, ధర్మోపిస్వాభివృద్ధయే!

తస్మాదాహు ర్వృషాద్రిం మునయో వేదపారగః ||''

(1వ భాగం–అధ్యాయం 36 శ్లో 28 వరాహ పురాణము)

భవిష్యోత్తర పురాణం ఈ వృత్తాంతం కృతయుగంలో జరిగినది కనుక దీనిని వృషాద్రి యని ఆ యుగంలో పేర్కొనేవారని తెలియజేస్తున్నది.

''కృతే వృషాద్రిం, వక్ష్యంతి, త్రేతాయా మంజనాచలమ్!

ద్వాపరే శేషశైలేతి, కలౌ శ్రీవేంకటాచలమ్!!''

శ్రీవారు పూర్వం ఈ లోకాన్ని పీడిస్తున్న హిరణ్యాక్షుని సంహరించాడు. తెల్లని తన కోరతో భూదేవిని అగాధమైన జలరాశినుండి ఉద్ధరించాడు. భూదేవి అంశరూపాన్ని తన ఒడిలో ఉంచుకొని, ధర్మదేవత తపమాచరించిన ఈ ఉన్నతస్థలంపై నివాసముండ దానికి నిర్ణయించాడు. గరుత్మంతుని పిలిపించి లోకానుగ్రహ కాంక్షతో క్రీడాద్రిని భూమికి తెప్పించాడు. లోకారాధ్యుడై యజ్ఞవరాహమూర్తి భూమాతను ఒడిలో ఉంచుకొని అప్రాకృతమైన ఈ క్రీడాద్రిపై కొలువైనాడు.

''వరాహాద్రి వరాహక్షేత్ర లక్షతః'' (వ.పు.36 అ. 28 శ్లో)

నాటినుండి ఆది వరాహ క్షేత్రమవడం వల్ల ఈ క్రీడాద్రి వరాహాద్రిగా కొనియాడబడుతున్నది.

''ఆగతం గరుడం వీక్ష్య, స్థాపయేహ ఖేగశ్వర!

ఇత్యువాచ హరిస్సోపి స్థాపయామాస తం తథా!!''

(వ.పు. 34వ అధ్యా. 22 శ్లో)

శ్రీవైకుంఠం నుండి గరుడుడు ఈ పర్వతాన్ని తీసుకురావడం వల్ల ఈ గిరికి ''గరుడాద్రి'' అని ప్రసిద్ధి వచ్చింది.

గరుడాళ్వార్లు ఈ క్రీడాద్రిని శ్రీవైకుంఠం నుండి తీసుకువచ్చాడు.

''వైకుంఠాదాగతత్త్వేన వైకుంఠాద్రిరితి స్మృతః''

(వ.పు 1–36–26 శ్లో)

అందువల్ల వైకుంఠాద్రి అని పేరు వచ్చింది. ఈ గిరి శ్రీవైకుంఠమందు బంగారు వర్ణంతో విరాజిల్లేది.

''అప్రాకృత మమేయం చ! సర్వరత్నమయం గిరిమ్!

హిరణ్మయం మహాశృంగం! పంచోపనిషదాత్మకమ్!!''

''శాంత కుంభ స్వరూపత్వాత్! కనకాద్రిం చ తుం విదుః!!

(వ.పు 1–34 శ్లో 24)

అప్రాకృతమైన ఈ క్రీడా పర్వతం సాటిలేనిది సర్వరత్న శోభితమైనది. బంగారు శిఖరాలతో, పంచోపనిషత్స్వరూపమైనదిగా దీనిని దర్శించే దేవతాదులు ''కనకాద్రి''గా కీర్తిస్తున్నారు.

మూడు యోజనములు విస్తారము, ముప్పై యోజనములు పొడుగు కలిగి శేషాకృతితో ఈ గిరి విరాజిల్లుతున్నది. కనుక ఇది శేషాద్రిగా ప్రసిద్ధికెక్కినది.

''యోజనత్రయ విస్తారం, త్రింశద్యోజన మాయతమ్!

శేషాకారం హరేశ్శేషం శేషికాం సర్వదేహినామ్!!''

(వ.పు 34–17–18)

బ్రహ్మాండ పురాణం శేషుడు తపస్సు చేసి, శ్రీహరి నివాసమున్న చోట తాను కొండగా ఉండుటకు కటాక్షించమని వరాన్ని పొందాడని తెలియజేస్తున్నది.

''అనంతోహం మహాదేవ! స్థాస్యామి గిరి రూపధృక్!

భవతా రమయా సార్థం! మమ సానుషు రమ్యతామ్!!''

(2.అధ్యా. 37 శ్లో)

శేషాద్రిగా ఈ గిరిని భవిష్యోత్తర పురాణం, బ్రహ్మపురాణం తెలియజేస్తున్నాయి. అయితే శేషుడికి వాయువుకు కలిగిన స్పర్ధతో శేషుడు మేరుపర్వత పుత్రుని ఆవరించాడు. వాయువు మహావేగంతో వీచి, పర్వత శిఖర శోభితమైన పవిత్రభూమిని సువర్ణ ముఖరీ తీరానికి తెచ్చాడు. శేషునితో ఆచ్ఛాదింపబడిన పర్వతం కనుక శేషాద్రిగా వ్యవహరిస్తున్నారు.

ఈ కొండకున్న మరో పేరు ''సుమేరు – శిఖరాచలం'' మేరు పర్వత శిఖరాలు ఎలా బంగారు కాంతితో ప్రకాశిస్తాయో అలా

ఈ కొండ సత్త్వగుణ సంపన్నులకు గోచరిస్తున్నది. అంతేకాక బ్రహ్మాండపురాణం ఈ కొండను మేరు పుత్రుడిగా వివరిస్తున్నది.

**''మేరుపుత్రం మహాపుణ్యం, వేంకటాచలం సంజ్ఞకమ్!!''**

(3 అధ్యా. 37 శ్లో)

మేరుపర్వత పుత్రుడైన గిరికి వేంకటాచలమని పేరు ఉన్నది. అంతేకాక ధర్మదేవత తపమాచరించిన ఈ పవిత్ర దివ్యదేశం భక్తుల పాపాలను తొలగించేది, దీని వ్యుత్పత్తిని వరాహ పురాణం ఇలా తెలియజేస్తున్నది.

**''వేంకారో మృతబీజం తు, కటమైశ్వర్యముచ్యతే!**

**అమృతైశ్వర్య సంఘత్వాత్, వేంకటాద్రిరి స్మృతః!!''**

**(వ.పు 1-36 అ.34 శ్లో)**

'వేం' కారం అమృతమని ''కట'' శబ్దం ఐశ్వర్యమని చెబుతున్నాయి. ఈ కొండ ఆశ్రితులకు అమృతము, ఐశ్వర్యం అనుగ్రహిస్తున్నది. కనుక వేంకటాద్రిగా ప్రసిద్ధి చెందింది. కొందరు అక్షయమైన సిరులను కటాక్షించే కొండగా అభివర్ణిస్తున్నారు. భవిష్యోత్తర పురాణం 'వేంకటాద్రి' వ్యుత్పత్తిని సమీక్షిస్తూ-

**సర్వపాపాని వేం ప్రాహుః కటస్తద్దాహ ఉచ్యతే!**

**తస్మాద్వేంకటశైలోయం! లోకే విఖ్యాత కీర్తిమాన్!!**

**(1-220-21)**

వేం అంటే అన్ని పాపాలు కట ధాతువు – దాహః అనే అర్థాన్ని కలిగి ఉన్నది. వేంకటతీతి వ్యుత్పత్తి లోకంలోని సర్వపాపాలను దహింపజేసే పర్వతంగా వేంకటశైలాన్ని విశ్లేషిస్తున్నది.

**పుష్కరాణాంచ బహుళ్యాత్, గిరావస్మిన్ సరస్సువై!**

**పుష్కరాద్రిం ప్రశంసన్తి మునయస్తత్వ దర్శినః!!**

**(వ.పు.1-36 22 శ్లో )**

ఈ కొండపైన అనేక తీర్థాలు ఉన్నాయి. భక్తిప్రద, జ్ఞానప్రద, ముక్తిప్రద తీర్థాలు అసంఖ్యాకంగా ఉన్న ఈ తీర్థ దేశానికి తీర్థాద్రి అని పేరు వచ్చింది. 'ర' 'ల' కు అభేదం వల్ల పుష్కర శబ్దం 'పుష్కల' మనే మేఘాలను సూచిస్తున్నది. మేఘాలకు ఆకరమైన ఈ గిరిని 'పుష్కరాద్రి' అని మునులు, తత్వజ్ఞులు సన్నుతిస్తున్నారు.

**''హిరణ్యాఖ్య వినాశాయ! ప్రహ్లాదానుగ్రహాయ చ!**

**నారసింహకృతిర్యజ్ఞే! యస్మాదస్మాత్స్వయం హరిః!!**

**సింహాచల ఇతిప్రాహు! స్తస్మాదేనం మునీశ్వరాః!**

**(వ.పు 34,26,27 శ్లో)**

హిరణ్యకశిపుని శిక్షించుటకు – ప్రహ్లాదుని రక్షించుటకు నారసింహాకృతితో ఈ పర్వతం నుండే బయలుదేరాడు. కనుక మునీశ్వరులు ఈ కొండను ''సింహాచలం'' గా అభివర్ణిస్తున్నారు.

త్రేతాయుగంలో ఈ కొండకు నీలాద్రి, చింతామణి గిరి, అంజనాద్రి అనే పేర్లు ప్రసిద్ధిలోకి వచ్చాయి. రఘువంశ రాజులలో ప్రసిద్ధుడైన దశరథుడు పుత్రులు లేరని దుఃఖించిన వేళ వశిష్ఠాది మహర్షులు వేంకటాచల యాత్ర చేయమని ప్రబోధించారు. దశరథుడు స్వామి పుష్కరిణిలో స్నానమాచరించి శ్రీహరిని ప్రార్థించాడు. నాలుగు శ్లోకాలతో ప్రార్థించిన రాజును శ్రీవారు కరుణించి నలుగురు కుమారులు కలిగేటట్లు వరాన్ని అనుగ్రహించారు.

**''రాజన్! ప్రీతో భవద్భక్త్యా, చతుశ్లోక్యా త్వదీయయా!**

**స్తుత్యా చ పరమప్రీతః తవ దాస్యే వరోత్తమమ్!!**

**(వ.పు 48 అధ్యా 36 శ్లో)**

ఓ రాజా! నీకు జన్మించే పుత్రులు నలుగురు ఉత్తములని స్తుతిప్రీతుడైన స్వామి తెలియజేశారు. నాటి నుండి ఈ కొండ మానవాళికి సైతం ''చింతామణి'' గిరిగా ప్రపంచీకరింపబడింది.

**''చిన్తితస్య చ సిద్ధ్యాతు! చింతామణిమిమం విదుః!**

**(వ.పు 36, 20 శ్లో)**

త్రేతాయుగంలో నీలుడనే వానరుడు ఈ కొండపైన నివసిస్తూ తపమాచరించాడు. ధన్యుడయ్యాడు.

**''నీలస్య వానరేంద్రస్య! యస్మాన్నిత్య మనస్థితిః**

**తస్మాన్నీలగిరిం నామ్నా! వదన్త్యేనం మహర్షయః!''**

నీలుడు చరితార్థుడైన ఈ గిరి ప్రదేశం ''నీలగిరి''గా ప్రసిద్ధి పొందింది. ఈ తపోభూమిపై తపమాచరించిన అంజన హనుమంతుని పుత్రఫలంగా పొందింది.

**''అంజనా చ తపఃకృత్వా హనుమన్త మజీజనత్!**

**తదాదేవస్సమాగత్య, దేవ సాహాయ్య కారకమ్!''**

మతంగ మహర్షి ఆదేశానుసారం అంజన ఆకాశగంగా తీరంలో ఉపవాసంతో తపమాచరించింది. వాయుదేవుని కటాక్షంతో గర్భవతియై మారుతికి జన్మనిచ్చింది.

''అంజనావ్రత మాస్థాయ, పుత్రం ప్రాపగిరీశ్వరే!

తస్మాదంజన శైలోయం లోకే విఖ్యాత కీర్తిమాన్!!''

అంజనాదేవి వ్రతాన్ని ఆచరించి పుత్రుడిని పొందిన కొండ కనుక అంజనాద్రిగా లోకంలో విఖ్యాతి పొందింది.

**''యస్మాత్పుత్రమసూతోసా, జగస్తస్మాదిమం గిరిమ్!**

**అంజనాద్రిం..............................................''**

**(వ.పు 36 అధ్యా. 29 శ్లో)**

శ్రీకృష్ణపరమాత్మప్రబోధంవల్లపాండవులు ఈవేంకటాచలం పైనతీర్థస్నానం చేసి, గోగర్భతీర్థం ప్రభావం వల్ల భాత్రువధాజనిత పాపపంకిలాన్ని తొలగించుకొన్నారని, విజయసిద్ధిని పొందారని, వేంకటాచల మాహాత్మ్యం తెలియజేస్తున్నది. బలరాముని తీర్థయాత్రలలో వేంకటాచలక్షేత్రం ఒక భాగమయింది.

శ్రీమన్నారాయణుడు అర్చాస్వరూపియై స్వయంవ్యక్త మూర్తిగా శిలాంతర్యామియై వేంకటాచలంపై కలియుగంలో

ఆవిర్భవించాడు. కలియుగ ప్రత్యక్ష దైవంగా శ్రీమన్నారాయణుడు ఈ కొండపై అవతరించాడు కనుక ఈ గిరికి ''నారాయణగిరి''గా ప్రసిద్ధి వచ్చింది. అంతేకాక నారాయణుడనే విప్రుడు శ్రీహరిని ప్రసన్నం చేసుకొని వరదానాన్ని పొందాడు.

**''అనంత విహగేశాన, సేనాపతి ముఖైః స్సదా!**
**సేవ్యమానః శ్రియా సార్థం, విహరన్ వస మాధవ!**
**గిరిశ్చాయం హి మన్నామ్నా, ప్రసిద్ధి మధి గచ్ఛతి!!''**

**(బ్రహ్మాండ 3-48,47)**

వరాహ పురాణం కూడా నారాయణ విప్రుని అభీష్టాన్ని తెలుపుతుంది.

**''ద్విజో నారాయణః కశ్చిత్తపః కృత్వా మహత్పురా!**
**ఐచ్ఛదస్య స్వనామ్నా చ వ్యపదేశం మురారితః!**
**తస్మాన్నారాయణాద్రిం తం విదురుత్తమ పూరుషః!!''**

(వ.పు 36 అధ్యా. శ్లో 24,25)

ఈ కొండపైన వృషభుడనే రాక్షసుడు తపమాచరించి యుద్ధ ప్రీతుడై స్వామి చక్రంచే మరణాన్ని పొందుతూ తన పేరుతో ఈ గిరి ప్రసిద్ధి చెందాలని వరాన్ని కోరాడు.

**అద్యప్రభృతి చాయంవై, గిరిరుచ్ఛ్రిత శేఖరః!**
**మదాఖ్యాయాప్రధాం తం, ''వృషభాచల'' ఇత్యపి!!**

**(బ్రహ్మాండ 4-43)**

స్వామి అనుగ్రహంతో ఈ కొండ వృషభాచలంగా కీర్తింపబడుతున్నది.

సనక సనందనాదులనే జ్ఞానయోగులకు, వశిష్ఠాది – సప్తఋషులకు, దిక్పాలకులకు, బ్రహ్మాది సకల దేవతలకూ, జ్ఞానమయ ఉపాసనకు నిర్దేశిత క్షేత్రం వేంకటాచలం.

**''పంచోపనిష దాత్మకమ్'' (వ.పు 11 శ్లో 34 అధ్యా)**

బ్రహ్మపురాణంలో మాధ్యందిన శాఖోపనిషత్తు ఈ గిరిని జ్ఞానాద్రిగా ''జ్ఞానప్రదాయిని''గా పేర్కొంటున్నదని వివరించబడింది.

**''ఉక్తం మాధ్యందినేమన్త్రే మాహాత్మ్యం భూధరస్య చ!**
**ఉదస్వ్య మన్తేవాసిభ్యో, గిరేః కురుప్రదక్షిణమ్!!''**

**(3 అధ్యా 18 శ్లో)**

వక్షఃస్థల లక్ష్మితో శ్రీనివాసుడు అలరారుతున్న ఈ వేంకటాచలం శ్రీనివాసాద్రిగా కీర్తించబడుతున్నది.

శ్రీనివాసుడు ''ఆనందనిలయ'' విమానంచే శోభిల్లుతున్న బ్రహ్మాండ నాయకుడు.

**''ఆనందాద్రి మిమంప్రాహుః, వైకుంఠపురవాసినం**
**ప్రాహుః భగవతః క్రీడా, ప్రాచుర్యాత్తు తథాసురాః''**

**(వ.పు 36 శ్లో 33)**

బ్రహ్మానందమయుని కొండపై ఋషులు తపమాచరించి ఆనందమే బ్రహ్మస్వరూపంగా తెలుసుకొంటున్నారు. అందువల్ల ఈ కొండ ఆనందాద్రిగా కొలువబడుతున్నది.

లక్ష్మీ సహితుడైన శ్రీవారు ఆశ్రిత భక్తులకు అక్షయసిరులను ప్రసాదిస్తున్నారు, కనుక ఈ కొండ ''శ్రీశైలం''గా పిలువబడుతున్నది.

**''శ్రీప్రదత్వాత్ శ్రియోవాసాత్, శబ్దశక్త్యా చ యోగతః**
**రూఢ్యా శ్రీశైల ఇత్యేవం, నామచాస్య గిరేరభూత్''**

**(వ.పు 1-36 అధ్యా 34 శ్లో)**

ఇలా యుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన తిరుమలకు అనేక పేర్లువచ్చాయి. ఇవి యుగయుగాలలో ఈ క్షేత్ర కటాక్షాన్ని, స్వామి వైభవాన్ని తెలియజేస్తూ ప్రఖ్యాతి చెందాయి. సకల దురితాలను తొలగించే ఈ తిరుమల దివ్యనామాలు ప్రాతః స్మరణీయమైనవి. అందువల్ల స్కాందపురాణం ఈ దివ్య తిరుమలను ఎక్కునపుడు ప్రతి భక్తుడు ప్రార్థనచే గిరికి నమస్కరించాలని వివరిస్తున్నది.

**''వేంకటాద్రి గిరిం తన్తు ప్రార్థయే త్పుణ్యవర్ధనమ్!**
**స్వర్ణాచల మహాపుణ్య! సర్వదేవ నిషేవిత!!''**

వేంకటాచలాన్ని అధిరోహించు వేళ బంగారు పర్వతమా! మహాపవిత్రమైనదానా! నీవు నిత్యం సకల దేవతలచేత ఆరాధింపబడుతున్నావు.

**''బ్రహ్మదయోపి యం దేవా! సేవన్తే శ్రద్ధయాసహ!**
**తం భవన్తం మహం పద్భ్యాం! ఆక్రమేయం నగోత్తమ!!''**

బ్రహ్మాది దేవతలు సైతం నిన్ను శ్రద్ధతో పూజిస్తున్నారు. నేను నా పాదములు నీపై మోపుతున్నాను.


**''క్షమస్వ తదఘం మే ద్య! దయయా పాపచేతసః!**
**త్వన్మూర్ధని కృతావాసం! మాధవం దర్శయస్వమే!!''**

కొండలలో శ్రేష్ఠమైనదానా! పాపాత్ముడనైన నా సాహసాన్ని దయతో మన్నించుము. నీ శిఖరమున నివసిస్తున్న శ్రీనివాసుని దర్శనాన్ని కటాక్షించు.

**''ప్రార్థయిత్వా నరస్త్వేవం! వేంకటాద్రి నగోత్తమమ్!**
**తతో మృదుపదం గచ్ఛేత్! పావనం వేంకటాచలం!!''**

ఇలా ప్రార్థించినవారై, మెల్లగా అడుగులిడుతూ (అంటే విస్ఫాటంగా కాకుండా) పవిత్రమైన కొండ నెక్కాలి. మహాపవిత్రము, సర్వపాపహరమైన స్వామి పుష్కరిణిలో స్నానమాచరించి నియమంతో పిండాదులను పితృదేవతలకు సమర్పించాలి. పితరులకు మోక్షాన్ని స్వర్గసౌఖ్యాన్నిచ్చే ఈ కొండ నిత్య ముక్తులకు, దేవతలకు నివాసభూమి, కలియుగ వైకుంఠం. పుణ్యతీర్థాలకు నిలయమై, కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీనివాసస్వామికి నిజనివాస స్థానమై అనేక మహిమలు గల ప్రదేశంగా కొనియాడబడుతున్నది. అందువల్లనే పురాణాలు ఈ క్షేత్రాన్ని, శ్రీవారిని అలా ఉద్ఘోషించాయి.

# అనంత ఫలప్రదం లింగార్చన



- చింతలపాటి శివశంకర శాస్త్రి

**శిశిర ఋతువులో వచ్చే తొలిమాసం మాఘమాసం. సూర్యుడు కుంభ సంక్రమణం చేసే మాసం. పౌర్ణమి నాటికి చంద్రుడు మఖ నక్షత్రంలో ఉంటాడు. అఘము అంటే పాపం. 'మ' అంటే పోగొట్టేది. మా... అఘం = మాఘం. మాఘ మాసమంటే పాపాలను నశింపచేది. శ్రీలక్ష్మీనారాయణులకు, ఉమామహేశ్వరులకు ఎంతో ప్రీతిపాత్రమైన మాసం. ఆధ్యాత్మిక కోణంలో పరిశీలిస్తే జన్మ జన్మల పాపాలను తొలగించుకునేందుకు భగవంతుడు మానవునికి ఇచ్చిన అద్భుతవరం మాఘమాసం.**

సృష్టి స్థితి లయ కారులైన త్రిమూర్తులలో లయకారుడికి అత్యంత ఇష్టమైన ఈ మాసమందు స్నాన, దాన, జపాదులు, అర్చన ద్వారా పవిత్ర జీవితము గడిపి, జీవితమును సార్థకం చేసుకోవాలి. వేదాలలో యజుర్వేదం మేలుబంతి. దానిలోని నాలుగో కాండలో రుద్రం ఉంది. ఆ రుద్రం మధ్యలో నాలుగో ప్రశ్నలో ఉన్న పంచారీ మంత్రరాజం ''విద్యాసుశ్రుతి రుత్కృష్టా రుద్రైకాదశినీ శ్రుతే, తత్ర పంచాక్షరీ తస్యాం శివ ఇత్యాక్షరద్వయమ్''.

పంచాక్షరీ మంత్రంలోని అయిదు అక్షరాలలోని రెండు అక్షరాలు మహోత్కృష్టమైనవి. అవే 'శివ' అనే అక్షరాలు. ఈ అక్షర ద్వయాన్ని జీవరత్నమంటారు. శివ అంటే మంగళం. ''శ్వ శ్రేయ సం శివం భద్రం కళ్యాణం మంగళం శుభం'' అని అమరకోశం వ్యాఖ్యానిస్తోంది. పాపాలన్నింటినీ ఒక్క క్షణంలో పోగొట్టగలిగే వేదాలకు జీవరత్నము, దేహానికి ప్రాణమూ, దేవాలయానికి మహాలింగం వలె వెలుగుతున్న శివ అనే రెండక్షరాలు పాపాన్ని పటాపంచలు చేసే పరమౌషధం.

అవ్యక్త స్వరూపుడైన పరబ్రహ్మము మొదటి నిర్గుణుడు. లోక శ్రేయవస్సు కోసం, భక్తులను అనుగ్రహించడం కోసం శివుడు లింగరూపం ధరించాడు.

''లీయతే గమ్యతే యత్రయేన సర్వం చరాచరమ్ తదే
తల్లింగ మిత్యుక్తం లింగ తత్త్వ విశారదైః''

అన్నాడు వ్యాసుడు. ఎందులోంచి అన్ని వస్తువులు పుడుతన్నాయో, అలాగే దేనిలోనికి అన్ని వస్తువులు లయమౌతున్నాయో అదే లింగం. సృష్టికి ప్రతీక, సృష్టిలోని శక్తికి ప్రతీక లింగమే.

శివుడు సాకార, నిరాకారాలైన రెండు రూపాల్ని కలిగియుంటాడు. సకల కళలతో శోభిల్లే రూపం ఒకటి. అసలు ఏ కళనూ ప్రతిబింబించకుండా సాక్షాత్కరించే

రూపం మరొకటి. ఇదే లింగాకారం. అంటే ఏమీలేని తత్వం నుండి అన్నీ ఆవిర్భవిస్తున్నాయనేది విశ్వాసానికి చాటి చెప్పేదే శివతత్వం. ఆయన స్వరూపం నిరాడంబరతకూ సహజత్వానికి సంకేతం.

శివుడు అభిషేకప్రియుడు. అభిషేకమనగా స్నానమని, దేవతా స్నానమని అర్థము. అభిషేకం అనేది షోడశోపచారాలలో ఒకటి. ''అయాంతు ఈశ్వర స్నానార్థం నదీ జలం ఆవాహయామి'' అంటూ పవిత్ర నదీజలాలను పెద్ద కలశపాత్రలో మంత్రశక్తి చేత ఆవాహన చేస్తారు. ఆ నీటితోనే అభిషేకం చేస్తారు. పంచామృతాది పదార్థాలకు మధ్య ప్రతిసారీ శుద్ధజలంతో అభిషేకం చేస్తారు. ఇలా ఒక వరుసలో రుద్ర నమక చమక మంత్రాలతో అభిషేకం చేస్తారు. దానిని ఆయన స్నానంగా స్వీకరిస్తాడు. ఎందుకు స్వీకరిస్తాడనగా ఆ స్నానాన్ని మనం దర్శనం చేయడం కోసం. రుద్రాభిషేక దర్శనం వల్ల అలక్ష్మి నివారణమవుతుంది. లక్ష్మీ కటాక్షం కలుగుతుంది.

''ద్రాసే అంధ సస్పతే దరిద్రం నీలలోహిత'' – అని ఒక మంత్రం. అంటే అందుబాటులో భోగోపకరణాలు ఉండి కూడా భోగానుభవం పొందడానికి శరీరం సహకరించకపోవడం దరిద్రం. అటువంటిది మా దరికి రాకుండా మమ్మల్ని అనుగ్రహించమని – ఇత్యాది ప్రార్థనలు అనేకం రుద్ర మంత్రాలలో ఉంటాయి. యజుర్వేదాంతర్గతమైన రుద్రాభిషేకంలో అష్టమానువాకంలో పంచాక్షరీ మహామంత్రం ఉంది. ఘంటానాదాల మధ్య ''నమశ్శివాయ చ శివతరాయ చ'' అనే మంత్రాన్ని సుస్వరంగా చదువుతూ ఉంటే, ధారగా అభిషేకం చేస్తూ ఉంటే చూడడం మానవ జన్మకు ధన్యత.

శివుడికి పంచామృతాలతో అభిషేకం విశేష ఫలదాయకం. ఆవుపాలు, ఆవు పెరుగు, ఆవు నెయ్యి, తేనె, నీరు – ఈ ఐదింటినీ కలిపితే పంచామృతం. పంచామృతాభిషేకం శివునికి ప్రీతికరం. ఆయన పశుపతి. పంచభూతాలకు అధిపతి. ధారగా పంచామృతాభిషేకం జీవాత్మ పరమాత్మలను అనుసంధానం చేసే కార్యం. 'యోగ జాగమం' అనే గ్రంథంలో పంచామృతాభిషేక ఫలితాన్ని గురించి వివరిస్తూ శుద్ధమైన జలాభిషేకం చేస్తే పది అపరాధాలు తొలగిపోతాయి. పాలతో శివుణ్ణి అభిషేకిస్తే వంద దోషాలు, పెరుగుతో వెయ్యి దోషాలు తొలగుతాయని ఆ గ్రంథం తెలుపుతోంది. పన్నీరుతో శివుణ్ణి అభిషేకించిన వారి పాపపు రాశులన్నీ దగ్ధమవుతాయి. నువ్వులనూనెతో అభిషేకిస్తే అపమృత్యు పరిహారమవుతుంది. ఈ విధంగా వివిధ ద్రవ్యాలతో అభిషేకించడం ద్వారా భిన్నమైన ఫలితాలను పొందవచ్చు. అభిషేకాన్ని చూస్తున్నపుడు శివనామం మనస్సులో ధ్యానం చేయాలి. అలా చేస్తే ఆయన అనుగ్రహిస్తాడు.

శివలింగాభిషేక జలం కంటె దివ్యౌషధం లేదు. శివలింగమే వైద్యుడు. సకల పాప – రోగ హరుడు లింగస్వరూపుడు.

శివునికి జలముతోనే కాక భస్మముతోను అభిషేకం చేస్తారు. భస్మం జ్ఞానానికి సంకేతం మరియు ఐశ్వర్యం. భాసిస్తుంది కనుక భసితమని, కల్మషాలను భక్షిస్తుంది కనుక భస్మమని, ఐశ్వర్యం కలిగిస్తుంది కనుక భూతి అని, రక్షిస్తుంది కనుక రక్ష యని విభూతికి పేర్లున్నాయి. శివుడే యజ్ఞ స్వరూపుడని వేదాలు పేర్కొన్నాయి. వైష్ణవులైనా, శైవులైనా భస్మధారణ విధిగా చేయాలి. మృత్యుంజయ మహామంత్రం జపిస్తూ భస్మధారణ చేయాలి.

**''ఈశ్వాతే తత్పురుష నమో ఘోరాయతే సదా**
**వాసుదేవ నమస్తుభ్యం సద్యోజాతాయ వైనమః శ్రీ శివాయ నమః**

అనే మంత్రంతో కూడా భస్మాన్ని ధరించవచ్చు.

**''యాని తీర్థాని లోకేస్మిన్ గంగాద్యాః సరితశ్చయాః**
**స్నాతో భవతి సర్వత్ర లలాటే యస్త్రి పుండ్రధృత్''**

ఈ భూమండలంపై ఉన్న అఖిల తీర్థాలలో పుణ్యస్నానాలు ఆచరిస్తే ఎంత ఫలితం కలుగుతుందో భస్మధారణతో అంతటి ఫలితం ప్రాప్తిస్తుందని పురాణ ప్రశస్తి. శివప్రియమైన మంగళ ద్రవ్యాలతో కూడిన విభూతి సర్వోన్నతమైంది. శేషతత్వానికి, ఫలసిద్ధికి విభూతి ప్రతీక.

భస్మధారణ, శివునికి అభిషేకం మహా పాపనాశనం. సకల చరాచర కోటికి రక్ష. శివలోకం పొందడానికి, లోక కళ్యాణానికి కూడా భస్మాభిషేకం చేస్తారు. భస్మాభిషేకం ధరించినవారు సైతం విశేషఫలం పొందగలుగుతారు.

శివార్చనకూ, మహాలక్ష్మిని అర్చించడానికి కూడా అత్యంత శ్రేష్ఠమైనది బిల్వదళం. మారేడు వృక్షంలో త్రిశక్తులూ ఉంటారు. బిల్వదళం లక్ష్మీనివాసం. మారేడు ఆకులో మూడు దళాలుంటాయి. మధ్యదళంలో పరమేశ్వరుడు అటూ, ఇటూ ఉంటే రెండు దళాల్లో బ్రహ్మ విష్ణువులుంటారు. అందుచేత బిల్వం త్రిమూర్తి రూపం. శివునికి అత్యంత ప్రీతికరమైన మారేడు దళాలతో పూజించే వారికి లక్ష్మీకటాక్షంతో పాటు, శివుడు ప్రసాదించే ఐశ్వర్యమైన జ్ఞానం కూడా లభిస్తుంది.

**''బిల్వాణం దర్శనం పుణ్యం స్పర్శనం పాపనాశనం**
**అఘోర పాప సంహారం ఏకబిల్వం శివార్పణమ్**
**సహస్ర వేదపాఠేషు బ్రహ్మస్థాపన ముచ్యతే**
**అనేక వ్రత కోటీనామ్ ఏకబిల్వం శివార్పణం**

**అన్నదాన సహస్త్రేషు సహస్రోప నయనం తథా**
**అనేక జన్మ పాపాని ఏకబిల్వం శివార్పణం**

అంటోంది బిల్వాష్టకం. ఒక్క బిల్వం సమర్పించినా చాలు శివుడు సంప్రీతుడై గొప్ప మేలు చేస్తాడు.

శివునికిపూజఅనగానేఅందరికీఅభిషేకంగుర్తుకువస్తుంది. కానీ పరమేశ్వరుడు పుష్పప్రియుడు కూడా. మల్లెపువ్వుల మాలను ధరించి ఆ పూవులనే తన పేరుగా పొందాడంటే ఆయనకున్న పుష్ప ప్రియత్వం స్పష్టంగా కనిపిస్తుంది.

శివునికి అత్యం ప్రీతికరమైన పుష్పాల్లో జిల్లేడు ముఖ్యమైనది. దీనినే అర్కపుష్పం అంటారు. పరమ శివుని జిల్లేడు పూలతో పూజించినవారు బంగారు నాణాలు దానం చేసిన ఫలితం కనిపిస్తుంది. లభిస్తుంది. జిల్లేడు పూలతో పూజించిన వారి దారిద్ర్య బాధలు తొలగిపోతాయి. జిల్లేడు పాప హరణానికి సంకేతం.

**"పుష్పైర్దేవాః ప్రసీదంతి"**

అంటే పుష్పాలతో దేవతలు ప్రసన్నులవుతారు. శివుని బిల్వ పత్రాలతో గానీ, శీత పత్రాలతో గానీ, శంఖ పుష్పాలతో కాని అర్చిస్తే పాపాలు నశిస్తాయి. శివుని ఉమ్మెత్త పువ్వులతో పూజిస్తే పుత్రులు, తులసీదళాలతో పూజిస్తే భక్తి – ముక్తి, అవిసెపూలతో పూజిస్తే కీర్తి, చిన్న కలువలతో శత్రు నాశనం, గన్నేరు పూలతో రోగ నిర్మూలన, జాజిపూలతో వాహనలాభం, శమీపత్రాలతో పూజించిన ముక్తి కలుగుతుంది. శివుణ్ణి విభూతితో అభిషేకించిన, సృష్టిలో ఎన్ని పుష్పాలు గలవో వానితో శివుని అర్చించిన ఎంత ఫలితం కలుగుతుందో అంతే ఫలితం కలుగుతుంది.

గన్నేరు, పొగడ, జిల్లేడు, ఉమ్మెత్త, పెద్ద ములక, తెల్ల దిరిసెన, అశోకం, మందారం, విష్ణుక్రాంత, పొన్న, తుమ్మి, ఎర్రకలువ మొదలైన పువ్వులతో శివుని పూజించినా ఎన్నో వేల వేల రెట్లు శుభ ఫలితం కలుగుతుంది. మల్లెలు, కలువలు, తామరలు, జాజి, పొన్న, సంపెంగ, అశోక, తెల్లమందారం, పారిజాతం వంటి పూలతో పరమేశ్వరుని అర్చిస్తే అన్ని కోరికలు తీరి, చివరికి కైలాసం చేరుతారని పురాణోక్తి. కొబ్బరి నీళ్ళతో బిల్వపత్రాలను తడిపి, ఆ పత్రాలతో శివుని పూజించిన మహదైశ్వర్యం లభిస్తుందని ఆగమ శాస్త్రాలు వివరిస్తున్నాయి.

మహా మహిమాన్వితమైన మాఘమాసాన పరమేశ్వరుని ఆరాధన ఐహికాముష్మికోభయ ఫలదాయకం. కనుక భక్తి శ్రద్ధలతో పరమేశ్వరుని ఆరాధించి తరిద్దాము.

**"ప్రభుం ప్రాణనాథం విభుం విశ్వనాథం**
**జగన్నాథ నాథం సదానంద భాజం**
**భవద్భవ్య భూతేశ్వరం భూతనాథం**
**శివం శంకరం శంభు మీశానమీడే"**

**"సర్వేజనా స్సుఖినో భవంతు"**


# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.


రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.

రచనలు పంపవలసిన చిరునామా



**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

# మీ ప్రశ్న మా సమాధానం

జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు.
భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.
– ఎడిటర్, శ్రీవేంకటేశం

నిర్వహణ:
డా. మరింగంటి లక్ష్మణాచార్యులు

**1.వేదాల గొప్పదనం, వాటిని అనుసరించవలసిన అవసరం గురించి చెప్పండి.**

జ. వేదాలనేవి అపౌరుషేయాలు. అంటే అవి మానవ నిర్మితాలు కాదు. ఋషీశ్వరులకు, మునిపుంగవులకు వారి దివ్యదృష్టికి గోచరించినవి. వారికి ఆ భగవత్ కృప వల్ల అవి వారి మేధస్సు నుండి ఏర్పడి మనకు అందిన దివ్య సంపదలు. విద = జ్ఞానే అనేది ధాతువు. మనది వేదమార్గం. విద్ అంటే తెలుసుకోవడం. వేదం అనేది వివిధ విషయములను తెలిసికొనుటకు కావలసిన జ్ఞానాన్ని ప్రసాదించే గ్రంథం. ఈ జ్ఞానము అనేది బ్రహ్మ జ్ఞానము కావచ్చు లేక భౌతిక జ్ఞానము కావచ్చు. ఋషుల చేత వినబడిన దైవవాణి ఇది. వారు దైవవాణిని మంత్రరూపములలో దర్శించారు. వారు ధ్యానమగ్నులై తురీయావస్థలో ఉన్నప్పుడు అంతర్ దృష్టి లేక అంతఃస్ఫూర్తి చే వేదసత్యాలు దర్శించి వాటినే గ్రంథస్థం చేశారు.

భగవానుని నిశ్వాసతో పాటుగా వెలువడిన మూలవేదము నాలుగు విభాగములుగా ఉన్నది. కాలక్రమంలో ఇవి కలిసిపోవడం, లుప్తమైపోవడం జరుగగా ద్వాపర యుగారంభంలో కృష్ణ ద్వైపాయనుడు వేదాన్ని సంస్కరించి ఋక్ యజు స్సామ అథర్వమను నాలుగు విభాగాలుగా చేశాడు. వేదమును సంస్కరించి విభజించుటచే ఆయనకు వేద వ్యాసుడు అనే పేరు కూడా ఉన్నది. ప్రతి వేదము నాలుగు భాగాలు అనగా –

1.సంహితలు 2. బ్రాహ్మణములు 3. అరణ్యకములు 4. ఉపనిషత్తులుగా విభజింపబడినవి. భగవత్ తత్త్వం వల్ల తత్త్వ జ్ఞానం, తత్త్వ జ్ఞానం వలన ఆధ్యాత్మికత వృద్ధి చెందుతాయి. జ్ఞానకాండ, కర్మకాండ, ఉపాసనా కాండలలో జ్ఞానకాండ నిర్గుణ బ్రహ్మ గురించి చెప్తుంది. కర్మలు అనగా – యజ్ఞ యాగాదులు మరియు నిష్కామ లౌకిక సేవ. మనసులోని అజ్ఞానం తొలగించి, చిత్తశుద్ధిని కలిగిస్తే జప ధ్యానాదులచే మన మనస్సు దైవంపై కేంద్రీకరింపగలుగుతుంది. అప్పుడే మనకి బ్రహ్మజ్ఞానం పొందే అర్హత, పరిపక్వతలు లభిస్తాయి. జీవితం ధన్యం కావాలి అంటే మనం వేదమార్గంలో వెళ్ళాలి. ఆ వేద విద్య మనకి సద్గురు సమాశ్రయణం ద్వారానే లభిస్తుంది.

**2. మన పురాణాలలో అసలు శ్రీవేంకటేశ్వరుని ప్రసక్తి ఉన్నదా?**

జ. ఎందుకు లేదు? చక్కగా, స్పష్టంగా ఉన్నది. శ్రీమన్నారాయణుడే వేంకటేశ్వరుడని, అన్యుడు కాదని భగవద్రామానుజులు తమ శ్రీభాష్య గ్రంథములోని ప్రారంభ ప్రార్థనా శ్లోకంలో – ''శ్రుతి శిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే'' అని కీర్తించాడు. వేదాంత గ్రంథాలు, పురాణ గ్రంథాలు కూడా ఇదే మాటను నొక్కి వక్కాణిస్తున్నాయి. ముఖ్యంగా ఆదిత్య, బ్రహ్మ, బ్రహ్మాండ, స్కాంద, మార్కండేయ, గరుడ, వామన, భాగవత, భవిష్యోత్తర, వరాహ, పద్మ పురాణాలలో శ్రీవేంకటేశ్వరుని ప్రస్తావన ప్రశంసలు ఉన్నాయి.

వేదేషు చ పురాణేషు వేంకటేశ కథామృతమ్ ।
వర్ణితం చేతిహాసేషు భారతాద్యాగమేషు చ ॥

వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలలో శ్రీనివాసుని మహిమలను తెలిపే కథలు ఎక్కువగా ఉన్నాయి.

త్రిమూర్తులలో సాత్త్వికమూర్తి ఎవరో తెలుసుకునేందుకై వైకుంఠమునకు వచ్చిన భృగువుకు తనను పాదముతో తన్నినను కోపించని శ్రీహరియే సాత్త్వికమూర్తిగా నిశ్చయించెనని పురాణములే వెల్లడించుచున్నవి. జీవకోటిని భక్తికి అలవరించుటకై కలియుగమున వేంకటాచలముపై శ్రీహరియే వేంకటేశ్వరునిగ అవతరించెనని భగవదాదేశముతోనే గరుడుడు క్రీడాద్రిని వైకుంఠము నుండి భూలోకానికి తెచ్చెనని, ఆ క్రీడాద్రి సకల దేవతల ఆవాసమని పురాణ కథనం. భవిష్యోత్తర పురాణమైతే కలియుగంలో దీనిని వేంకటాచలమని పిలిచెదరని తెలుపుచున్నది. వరాహ పురాణములో స్వామి పుష్కరిణి మాహాత్మ్యము, బ్రహ్మపురాణము వచనముల ద్వారా దేవాలయ విశేషములు మనకు తెలియుచున్నవి.